
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 16-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 130 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.9:02 తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర తె.4:50 తదుపరి రేవతి, వర్జ్యం: మ.3:00-4:32, దుర్ముహూర్తం: ఉ.11:55-12:47, అమృతఘడియలు: రా.12:13-1:45, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:53, సూర్యాస్తమయం: 6:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కింగ్‌తో టీమిండియా

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు బ్రిటన్ రాజు చార్లెస్-3ని మర్యాద పూర్వకంగా కలిశాయి. మంగళ వారం క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు ఆయనతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అలాగే కెప్టెన్ గిల్, పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ తదితర ఆటగాళ్లతో కింగ్ ముచ్చటించారు. అంతేకాకుండా లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టు హైలైట్స్‌ను తాను చూసినట్టు ప్లేయర్లతో కింగ్ చార్లెస్ అన్నారు. 'బ్రిటన్ కింగ్‌ను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అందరితో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. అలాగే చివరి రోజు ఆటలో సిరాజ్ అవుటైన విధానం దురదృష్టకరమని, బంతి పక్క నుంచి వెళ్లి స్టంప్స్‌ను తాకిందని మాతో అన్నారు' అని గిల్ వివరించాడు.

నాలుగో టెస్టుకు మార్పులు!

నాలుగో టెస్టు కోసం భారత జట్టులో మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. పని ఒత్తిడిలో భాగంగా పేసర్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే అతడి స్థానంలో లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ జట్టులోకి రావచ్చు. అలాగే చేతి వేలి గాయంతో ఇబ్బందిపడుతున్న వికెట్ కీపర్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌ను ఆడించే చాన్సుంది. ఇక వరుసగా మూడు టెస్టుల్లోనూ విఫలమైన కరుణ్ నాయర్‌ను తప్పించి సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకోవడం ఖాయంగానే కనిపిస్తోంది. లార్డ్స్‌లో పేసర్ ఆకాశ్ కేవలం ఒకే వికెట్ తీసినా అతడి స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు.

ఎనిమిదేళ్ల తర్వాత జట్టులోకి..

స్పిన్నర్ డాసన్‌ను ఎంపిక చేసిన ఇంగ్లండ్



లండన్: మాంచెస్టర్ వేదికగా ఈనెల 23 నుంచి జరుగబోయే నాలుగో టెస్టు కోసం 14 మందితో కూడిన ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. అయితే చేతి వేలు ఫ్రాక్చర్ కావడంతో స్పిన్నర్ షోయబ్ బషీర్ మిగిలిన రెండు టెస్టులకు దూరం కానున్నాడు. దీంతో అతడి స్థానంలో 35 ఏళ్ల స్పిన్నర్ లియామ్ డాసన్ (35)కు చోటు కల్పించారు. 2017లో చివరిసారిగా అతను ఇంగ్లండ్ తరపున మూడు టెస్టులు ఆడి ఏడు వికెట్లు తీయగా, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బ్యాటింగ్‌లోనూ రాణించి 18 శతకాలతో 10,731 పరుగులు చేయడం విశేషం. ఇక పేసర్లు సామ్ కుక్, ఒవర్టన్‌ను కౌంటీల్లో ఆడేందుకు విడుదల చేశారు.

ఇంగ్లండ్ జట్టు: స్టోక్స్ (కెప్టెన్), ఆర్చర్, అట్కిన్సన్, బెథెల్, బ్రూక్, కార్స్, క్రాలే, డాసన్, డకెట్, పోప్, రూట్, స్మిత్, టంగ్, వోక్స్.

వన్డేల్లోనూ అదరగొట్టాలని!

● **నేడు ఇంగ్లండ్‌తో భారత్ తొలి మ్యాచ్**

సా. 5.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

సౌతాంప్టన్: ఇంగ్లండ్‌పై తొలిసారి టీ20 సిరీస్ గెలిచిన ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత మహిళల జట్టు.. వన్డే సిరీస్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం తొలి మ్యాచ్ జరుగనుంది. వన్డే వరల్డ్‌కప్ నేపథ్యంలో జట్టులోని లోపాలను మరింతగా సవరించుకోవాలని భారత జట్టు భావిస్తోంది. గత మేలో శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత్ చివరిసారిగా వన్డేల్లో తలపడింది. ఆ టైటిల్ నెగ్గిన హర్మన్‌సేన ఇప్పుడు ఈ సిరీస్ కూడా నెగ్గితే.. ప్రపంచకప్‌నకు ముందు ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది. ఓపెనర్‌గా షఫాలీ స్థానంలో ప్రతికా రావల్ జట్టులోకి రానుంది. స్మృతి మంధాన, హర్మన్, జెమీమా, రిచా ఘోష్‌లతో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. స్పిన్నర్లు శ్రీచరణి, రాధా యాదవ్ కీలకం కాగా.. పేస్ విభాగంలో రేణుక, పూజా వస్త్రాకర్ లేనిలోటు కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకొన్న కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్‌తోపాటు ఎకెల్‌స్టోన్ రీఎంట్రీతో ఇంగ్లండ్ బ్యాటింగ్ బలం పెరిగింది.

114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ మృతి

స్వగ్రామంలో రోడ్డు ప్రమాదం
చికిత్సపొందుతూ కన్నుమూత



చండీగఢ్: 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సోమవారం ఉదయం జలంధర్‌కు సమీపంలోని తన స్వగ్రామంలో వాకింగ్ కోసం బయటకు వెళ్లినప్పుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని, తీవ్ర గాయాలైన ఫౌజా సింగ్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోపాటు ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తెల్లవారుజామున 3.30 గంటలకు రోడ్డు దాటుతుండగా ఎస్‌యూవీ కారు ఢీ కొట్టిందని కొందరు స్థానికులు చెబుతున్నారు.

ఆ వయసులో పరిగెత్తడం మొదలుపెట్టి..

1911లో రైతు కుటుంబంలో జన్మించిన ఫౌజా సింగ్.. నలుగురు సంతానంలో ఆఖరివాడు. భార్య, చిన్న కొడుకు, కుమార్తె మరణంతో కుంగిపోయిన ఫౌజాను మరో కొడుకు 90వ దశకంలో లండన్ తీసుకెళ్లాడు. తన బాధను మరవడానికి రన్నింగ్‌ను ఎంచుకొన్న ఫౌజా .. అందులోనే గుర్తింపు సాధించాడు. 88 ఏళ్ల వయస్సున్నప్పుడు ఓ స్వచ్ఛంద సంస్థ కోసం మారథాన్ రేస్‌లో పరుగెత్తాడు. ఆ తర్వాత అనేక అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని పలు రికార్డులు నెలకొల్పాడు. మారథాన్ రేసును పూర్తి చేసిన శతాధికుడిగా ఖ్యాతికెక్కాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో టార్చ్ బేరర్‌గా వ్యవహరించాడు. క్వీన్ ఎలిజబెత్ నుంచి సన్మానాన్ని అందుకొన్నాడు. మూడేళ్ల క్రితమే లండన్ నుంచి సొంతూరుకు తిరిగొచ్చిన సింగ్.. ఇప్పుడిలా రోడ్డు ప్రమాదంలో మరణించడం అందరినీ కలచివేస్తోంది.

యువతకు స్ఫూర్తి: మోదీ

ఫౌజా సింగ్ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'ఫౌజా అద్భుతమైన, భిన్నమైన వ్యక్తి. ఫిట్‌నెస్ విషయంలో యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమ'ని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు.

డ్రాతో గట్టెక్కిన ఇంగ్లండ్

● **భారత్ అండర్-19తో అనధికార టెస్టు**

బెకెన్‌హామ్: భారత్ అండర్-19తో జరిగిన తొలి అనధికార టెస్టులో ఇంగ్లండ్ డ్రాతో గట్టెక్కింది. యువ భారత్ నిర్దేశించిన 350 పరుగుల ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 128/3తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 270/7 స్కోరు చేసింది. కెప్టెన్ హమ్జా షేక్ (112) శతకంతో రాణించగా.. బెన్ మేయర్స్ (51), థామస్ (50) రాణించారు. అంబ్రిష్ 2 వికెట్లు తీశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 540, రెండో ఇన్నింగ్స్‌లో 248 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 439 రన్స్‌కు ఆలౌటైంది.



2028 ఒలింపిక్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

● **జూలై 12 నుంచి 29 వరకు మ్యాచ్‌లు**


లాస్ ఏంజెల్స్: క్రికెట్‌కు లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో చోటు కల్పించిన నిర్వాహకులు.. జెంటిల్మన్ గేమ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. 2028 జూలై 12న క్రికెట్ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్లో మొదలవుతాయి. జూలై 20, 29 తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు జరుగుతాయి. పురుషులు, మహిళల విభాగాల నుంచి మొత్తం 12 జట్లు స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం పోటీపడతాయి. మ్యాచ్‌లన్నీ లాస్ ఏంజెల్స్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని పొమెనా నగరంలో జరుగుతాయి. తొలిసారి, చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి. ఆ క్రీడల్లో రెండు జట్లు మాత్రమే పోటీపడ్డ రెండ్రోజుల మ్యాచ్‌లో బ్రిటన్‌ను ఓడించి ఫ్రాన్స్ స్వర్ణం గెలిచింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత జెంటిల్మన్ గేమ్‌కు విశ్వక్రీడల్లో ప్రాతినిథ్యం దక్కింది. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్ (సిక్సెస్), స్క్వాష్ క్రీడలకు కూడా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

'జపాన్' నుంచి శ్వేతపర్ణ జోడీ అవుట్

టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ జోడీ శ్వేతపర్ణ పాండ/రుతుపర్ణ పాండ పోరాటం తొలిరౌండ్‌కే పరిమితమైంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శ్వేత ద్వయం 13-21, 7-21తో ఆతిథ్య జపాన్ జంట కొకొనా/మయికో చేతిలో ఓటమి పాలైంది. సింధు, లక్ష్య సేన్, డబుల్స్ స్టార్ సాత్విక్ జోడీ తమ పోరును బుధవారం ప్రారంభించనున్నారు.

వెస్టిండీస్ 27 ఆలౌట్

టెస్టు చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు
9 రన్స్‌కే ఆరు వికెట్లు తీసిన స్టార్క్
బోలాండ్ హ్యాట్రిక్
ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్



స్టార్క్ (7.3-4-9-6)

బోలాండ్

కింగ్‌స్టన్: దశాబ్దాలపాటు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్.. తమ చరిత్రలోనే అత్యంత దారుణమైన ప్రదర్శన కనబర్చింది. ఆస్ట్రేలియాతో సోమవారం ముగిసిన మూడో టెస్టులో 204 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఈ జట్టు కేవలం 27 పరుగులకే కుప్పకూలింది. ఏడుగురు బ్యాటర్లు డకౌట్లు కాగా, జస్టిన్ గ్రీవ్స్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. దీంతో 176 రన్స్ తేడాతో నెగ్గిన ఆసీస్ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇది కరీబియన్ టెస్టు చరిత్రలో అత్యల్ప స్కోరు (27 ఆలౌట్). అయితే న్యూజిలాండ్ పేరిట ఉన్న అత్యంత చెత్త ప్రదర్శన (ఇంగ్లండ్‌పై 1955లో 26 ఆలౌట్)కు మరో పరుగు దూరంలో నిలిచి కాస్త పరువు కాపాడుకుంది. ఇక ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (7.3-4-9-6) నిప్పులు చెరిగే బంతులతో తన వందో టెస్టును చిరస్మరణీయం చేసుకున్నాడు. కేవలం తొమ్మిది పరుగులే ఇచ్చి ఆరు వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. లూయిస్‌ను అవుట్ చేయడం ద్వారా స్టార్క్ కెరీర్‌లో 400 వికెట్ల మైలురాయిని చేరాడు. స్టార్క్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పరుగులేమీ ఇవ్వకుండా మూడు వికెట్లతో బెంబేలెత్తించాడు. స్టార్క్‌కు తోడు మరో పేసర్ స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ తీయడంతో విండీస్ కుదేలైంది. అంతకుముందు ఆసీస్ నాలుగో రోజు 99/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించి 121 పరుగులకే ఆలౌటైంది. అల్జారి జోసెఫ్‌కు ఐదు, షామర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 225, వెస్టిండీస్ 143 పరుగులు చేశాయి. స్టార్క్.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గానూ నిలిచాడు.

రికార్డుల హోరు

ఈ టెస్టు మొత్తమ్మీద ఒక్క అర్ధసెంచరీ కూడా నమోదు కాలేదు. చివరిసారిగా 2015లో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాగ్‌పూర్ టెస్టులో ఇలా జరిగింది.

ఒక ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్లు డకౌటవడం 148 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి.

టెస్టుల్లో తొలి 15 బంతుల్లోనే ఐదు వికెట్లు తీసిన మొదటి బౌలర్ స్టార్క్. గతంలో ఎర్నీ టోషాక్, స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్), బోలాండ్ (ఆస్ట్రేలియా) 19 బంతుల్లో 5 వికెట్లు సాధించారు.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 121కే ఆలౌటైంది. వెస్టిండీస్‌పై ఆసీస్‌కు గత 30 ఏళ్లలో ఇదే అత్యల్ప స్కోరు.

క్రిస్‌క్యాపిటల్ చేతికి థియోబ్రోమా

న్యూఢిల్లీ: బేకరీ, మిఠాయిల వ్యాపార సంస్థలపైనా ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ముంబై కేంద్రంగా పని చేసే థియోబ్రోమా బేకరీ, కన్ఫెక్షనరీ స్టోర్ల సంస్థ ఈక్విటీలో 90 శాతం వాటాను పీఈ సంస్థ క్రిస్‌క్యాపిటల్ రూ.2,410 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే ఈ డీల్‌పై రెండు సంస్థలు అధికారికంగా నోరు విప్పడం లేదు. థియోబ్రోమ ప్రస్తుతం దేశంలోని 30 నగరాల్లో 200కు పైగా బేకరీ, కన్ఫెక్షనరీ స్టోర్లు నిర్వహిస్తోంది.

టెస్లా.. ఆగయా

భారత్‌లో టెస్లా తొలి షోరూమ్ ముంబైలో ప్రారంభం

తొలుత 'మోడల్ వై' కార్ల విక్రయం.. ప్రారంభ ధర రూ.60 లక్షలు



ముంబై: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా ఎట్టకేలకు భారత్‌లోకి ప్రవేశించింది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో కంపెనీ ఏర్పాటు చేసిన తొలి షోరూమ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం ప్రారంభించారు. టెస్లా భారత్‌లో కార్ల తయారీ ప్లాంట్, ఆర్ అండ్ డీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

బెస్ట్ సెల్లింగ్ మోడల్‌తో ఎంట్రీ: ఒకప్పుడు ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ కారైన 'మోడల్ వై'తో టెస్లా భారత మార్కెట్ విక్రయాలను ప్రారంభించింది. మన దగ్గర ఈ కారు రెండు వేరియంట్లలో లభించనుంది. రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ.59.89 లక్షలు. లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ రేటును రూ.67.89 లక్షలుగా నిర్ణయించింది. ఈ కారును బుక్ చేసుకున్న కస్టమర్లకు ఈ ఏడాది మూడు (జూలై-సెప్టెంబరు), నాలుగో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికాల్లో డెలివరీ అందించనున్నట్లు వెల్లడించింది. కారు రిజిస్ట్రేషన్, డెలివరీ సేవలు తొలుత ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

సింగిల్ చార్జింగ్‌తో 500 కి.మీ ప్రయాణం: రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ పూర్తి చార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్‌లో 622 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది.

కస్టమైజ్ చేసుకోవచ్చు: తమ డిజైన్ స్టూడియో ద్వారా కొనుగోలుదారులు కారు ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్‌తో పాటు ఫీచర్లనూ కస్టమైజ్ (తమ అవసరానికి లేదా అభిరుచికి అనుగుణంగా మార్చుకోవడం) చేసుకోవచ్చని టెస్లా స్పష్టం చేసింది.

అమెరికాతో పోలిస్తే చాలా కాస్ట్‌లీ!: టెస్లా మోడల్ వై కారును అమెరికా మార్కెట్లో 37,490 డాలర్లకు విక్రయిస్తోంది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో దాదాపు రూ.32.24 లక్షలు. యూఎస్‌తో పోలిస్తే మన మార్కెట్లో కంపెనీ ఈ కారును సుమారు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నది.

ఎందుకంటే, కంపెనీ ఈ కారును చైనా నుంచి దిగుమతి చేసుకుంటుడటమే కారణం. విదేశాల నుంచి కార్ల దిగుమతిపై భారత్ 70-110 శాతం వరకు సుంకాలు విధిస్తోంది.

ఢిల్లీలో రెండో షోరూమ్.. త్వరలో షురూ: టెస్లా రెండో షోరూమ్‌ను ఢిల్లీలో ఏర్పాటు చేస్తోంది. అందులో పనిచేసేందుకు సిబ్బందిని ఇప్పటికే నియమించుకుంటున్న కంపెనీ.. వాహనాలను నిల్వ చేసేందుకు గిడ్డంగిని కూడా సమకూర్చుకుంటోంది. ఈ నెలాఖరుకల్లా ఈ షోరూమ్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి.

బీమా భాగస్వాములుగా లిబర్టీ, అకో: టెస్లా భారత్‌లో విక్రయించే కార్లకు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, అకో బీమా కవరేజీని కల్పించనున్నాయి. భారత్‌లో టెస్లాకు బీమా భాగస్వాములుగా ఎంపికైనట్లు ఈ రెండు కంపెనీలు ప్రకటించాయి.

చైనా ప్లాంట్ నుంచి దిగుమతి

టెస్లా భారత్‌లో విక్రయించే మోడల్ వై కార్లను చైనాలోని తన ప్లాంట్ నుంచి కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ)గా దిగుమతి చేసుకోనుంది. కంపెనీ ఇప్పటికే కొన్ని కార్లను మన దేశంలోకి దిగుమతి చేసుకుంది కూడా. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశించకపోవడానికి అధిక దిగుమతి సుంకాలే కారణమని ఎలాన్ మస్క్ గతంలో ఆరోపించారు. అయినప్పటికీ, కంపెనీ దిగుమతులే ఆధారంగా భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం గమనార్హం.

భారత్‌లో అంత ఈజీ కాదు..

చైనా ఎలక్ట్రిక్ కార్ బ్రాండ్ల నుంచి గట్టిపోటీ ఎదురవుతుండటంతో గడిచిన కొన్ని నెలల్లో ఐరోపా, అమెరికా మార్కెట్లో టెస్లా కార్ల విక్రయాలు బాగా తగ్గుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీ భారత్‌లోకి ప్రవేశించింది. ధర విషయంలో మన మార్కెట్‌పై పట్టు సాధించడమూ టెస్లాకు అంత సులువు కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ వంటి జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజాలు భారత మార్కెట్లో ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ మోడళ్లను అందుబాటులోకి తెచ్చాయి. చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ బీవైడీ కూడా మన దగ్గర కార్లను విక్రయిస్తోంది. విన్‌ఫాస్ట్ సైతం త్వరలో తన ఈవీల బుకింగ్‌లు ప్రారంభించబోతోంది. టాటా మోటార్స్, మహీంద్రా వంటి దేశీయ కంపెనీలు రూ.30 లక్షల లోపే పలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చాయి.

కియా కారెన్స్ క్లావిస్ ఈవీ

ప్రారంభ ధర రూ.17.99 లక్షలు



న్యూఢిల్లీ: కియా ఇండియా.. మార్కెట్లోకి కారెన్స్ క్లావిస్ ఎలక్ట్రిక్ కారు (ఈవీ)ను విడుదల చేసింది. కంపెనీ భారత్‌లో ఉత్పత్తి చేసిన తొలి ఎలక్ట్రిక్ కారు ఇదే. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ కారును కంపెనీ తయారు చేసింది. ఈ కారు ధర రూ.17.99 లక్షల నుంచి రూ.24.49 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉంది. 42 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు ఒకసారి చార్జింగ్‌తో రూ.404 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. అలాగే 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు 490 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కియా తెలిపింది. 100 కిలోవాట్ డీసీ చార్జర్‌తో కేవలం 39 నిమిషాల్లోనే 10 నుంచి 80 శాతం బ్యాటరీ చార్జింగ్ అవుతుందని పేర్కొంది. ఏడు సీట్ల క్లావిస్ ఈవీలో ఏడీఏఎస్ లెవల్ 2 వ్యవస్థతో పాటు 20కి పైగా అటానమస్ ఫీచర్లను పొందుపరిచినట్లు కియా తెలిపింది. కాగా కియా ఇప్పటికే ఎలక్ట్రిక్ కార్లయిన ఈవీ6, ఈవీ9 మోడళ్లను దిగుమతి చేసుకుని భారత మార్కెట్లో విక్రయిస్తోంది.

ఆటో, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస నష్టాలకు తెరపడింది. వాహన, ఔషధ రంగ షేర్లలో కొనుగోళ్లతో ప్రామాణిక సూచీలు మంగళవారం లాభాల్లో పయనించాయి. ఒక దశలో 490 పాయింట్ల వరకు పుంజుకున్న సెన్సెక్స్.. చివరికి 317.45 పాయింట్ల వృద్ధితో 82,570.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 113.50 పాయింట్ల పెరుగుదలతో 25,195.80 వద్ద స్థిరపడింది.

20 కోట్లకు చేరువలో డీమ్యాట్ ఖాతాలు

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే చిన్న మదుపరులు భారీగా పెరిగారని, దాంతో దేశంలో డీమ్యాట్ ఖాతాలు 20 కోట్లకు చేరువయ్యాయని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రుచి చోజెర్ తెలిపారు. 2019లో 3.6 కోట్ల డీమ్యాట్ ఖాతాలుండగా.. 2025లో ఈ సంఖ్య 19.4 కోట్లకు పెరిగిందన్నారు.

బిజినెస్

బీమా సంస్థల ఆగడాలకు చెక్!

● **కమిటీలు ఏర్పాటు చేసిన ఐఆర్‌డీఏఐ**


న్యూఢిల్లీ: బీమా సంస్థలు, బీమా మధ్యవర్తుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) సిద్ధమైంది. ఇందుకోసం తన పూర్తి స్థాయి సభ్యుల పర్యవేక్షణలో వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు బీమా కంపెనీలు, వాటి ఏజెంట్లు తప్పుడు హామీలతో పాలసీలు అమ్మడం, సెటిల్‌మెంట్లలో లోపాలు, పాలసీదారుకులకు సంబంధించిన కీలక డేటా వెల్లడి వంటి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాయి. బీమా సంస్థలు, వాటి ఏజెంట్లు తప్పుడు హామీలతో తమకు పాలసీలు అంటగట్టడమే గాక, ఏదో ఒక సాకుతో సెటిల్‌మెంట్స్‌లోనూ కోత పెడుతున్నారని ఇటీవల పాలసీదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వీటికి చెక్ పెట్టేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేసింది.

133 దేశాలకు అరబిందో హెచ్ఐవీ ఔషధం

హైదరాబాద్: ప్రపంచంలోని 133 దేశాల్లో హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే ఇంజెక్షన్ కాబోటెగ్రవిర్‌ను అరబిందో ఫార్మా తయారుచేసి, సరఫరా చేయనుంది. మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ), వీఐఐవీ హెల్త్‌కేర్ మధ్య విస్తరించిన వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందం కింద కాబోటెగ్రవిర్ తయారు చేసేందుకు ఎంపిక చేసిన జెనరిక్ ఔషధ తయారీదారుల్లో అరబిందో ఒకటి. హెచ్ఐవీ రోగులు రోజువారీ మాత్రలు మింగడాన్ని ఈ చికిత్స నివారిస్తుంది. అందుకు బదులుగా వారు 1 లేదా 2 నెలలకి ఒక ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ



హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	496
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	94
వరంగల్	91	గుంటూరు	99
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	100
కర్నూలు	91	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	94		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,770 ▼	91,450 ▼	1,27,000 ▲
విజయవాడ	1,01,450 ▲	95,500 ▲	1,15,000 ▼
విశాఖపట్నం	1,00,840 ▼	91,550 ▲	1,25,000 ▲
రాజమండ్రి	99,760 ▼	91,450 ▼	1,15,200 ▼
ప్రొద్దుటూరు	98,300 ▲	90,440 ▲	1,13,400 ▲
ముంబై	97,916 ▼	89,691 ▼	1,11,997 ▼

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 16-7-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ



డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటికి వస్తున్న శుభాన్షు

సురక్షితంగా భూమికి శుక్లా

యాక్సియం-4 మిషన్ విజయవంతం

షెడ్యూల్ ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో దిగిన డ్రాగన్ క్యాప్సూల్.. నలుగురు వ్యోమగాములూ క్షేమం

మరో 7 రోజులు వారంతా పునరావాస కేంద్రంలోనే!

ఆనందంతో కంటతడి పెట్టిన శుభాన్షు తల్లిదండ్రులు

హృదయపూర్వక స్వాగతం పలికిన రాష్ట్రపతి ముర్ము

అంకితభావం, ధైర్యసాహసాలతో శుభాన్షు కోట్లాది మంది కలలకు స్ఫూర్తిగా నిలిచారన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 15: భారత కీర్తిపతాకను అంతరిక్షంలో సగర్వంగా ఎగురవేసిన వాయుసేన కెప్టెన్, వ్యోమగామి శుభాన్షు శుక్లా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి క్షేమంగా భూమికి తిరిగొచ్చారు! యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోష్ ఉజ్‌నైన్‌స్కీ (పోలండ్), టిబోర్ కాపు (హంగరీ)తో కలిసి జూన్ 26న ఐఎస్ఎస్‌కు చేరుకున్న శుక్లా.. 18 రోజులపాటు అక్కడ పలు ప్రయోగాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. ఆ నలుగురితో కూడిన డ్రాగన్ క్యాప్సూల్ (దాని పేరు గ్రేస్) భారత కాలమానం ప్రకారం

మిగతా 10వ పేజీలో...

ఉద్యోగాల కల్పనలో విశాఖ టాప్

ఫార్మా, ఐటీ రంగాల్లో నియామకాల జోరు

స్థానిక ప్రతిభకు తోడ్పాటునందిస్తున్న కంపెనీలు

ప్రధాన నగరాలకు దీటుగా టైర్-2, టైర్-3 సిటీలు

పెద్ద పెద్ద డేటా కంపెనీలను ఆకర్షిస్తున్న విశాఖ

బెజవాడకు పెరిగిన భక్తులు, పర్యాటకుల సంఖ్య

టాప్-10 నగరాలతో లింక్డ్‌ఇన్ జాబితా విడుదల

మూడో స్థానంలో బెజవాడ

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కల్పన అసాధారణ స్థాయిలో వృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రాంతాల ఆధారంగా తొలిసారి ప్రొఫెషనల్ నెట్‌వర్క్.. లింక్డ్‌ఇన్ 'సిటీస్ ఆన్ ది రైజ్-2025' నివేదికను

మిగతా 11వ పేజీలో...

కొత్తగా 10 లక్షల ఉద్యోగాలు

ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లలో సృష్టే లక్ష్యం

త్వరలోనే టాటా ఇన్నోవేషన్ హబ్: లోకేశ్

మంచి పాలసీ రెడీగా ఉంది ఏపీకి రండి 11

ఏరోస్పేస్ ఇండస్ట్రీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

మిగులు జలాలపై హక్కు మాకే!

అమిత్ షాకు చంద్రబాబు స్పష్టీకరణ

అన్ని రాష్ట్రాల అవసరాలు తీరాక కూడా గోదావరిలో 90-120 రోజుల మిగులు

దానిని కరువు ప్రాంతాలకు ఇవ్వడానికి పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కీలకం

200 టీఎంసీల వరద జలాల తరలింపునకు రూపకల్పన

ధ్వంసమైన ఎకానమీని కేంద్ర సహకారంతో గాడినపెడుతున్నాం

ఇప్పటికీ ఆర్థిక వనరుల కొరత

మరింతగా సాయం చేయండి: సీఎం

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవిపై ప్రధానికి, షాకు కృతజ్ఞతలు

వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీతోనూ ముఖ్యమంత్రి సమావేశం

న్యూఢిల్లీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజులు మిగులు నీరు ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో అమిత్ షాను ఆయన నివాసంలో సీఎం కలుసుకున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై

మిగతా 11వ పేజీలో...



ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నేటి సీఎంల భేటీ ఎజెండాలో బనకచర్ల వద్దు

కేంద్రానికి తెలంగాణ సీఎస్ లేఖ

ఇచ్చంపల్లి నుంచి కాదు.. పోలవరం నుంచి

కావేరి అనుసంధానం!

ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ సూచన

జాతీయ జల అభివృద్ధి సంస్థదీ అదే ఆలోచన

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయం

ధవళేశ్వరం ఆనకట్ట పాతబడిపోయింది

పోలవరం నుంచి అనుసంధానించడం మేలు

రాష్ట్ర జల వనరుల శాఖ ప్రతిపాదన 9

పీవీ.. భారత డెంగ్ జియావోపింగ్

ఆర్థిక సంస్కరణలతో దేశం రూపురేఖలను మార్చారు

దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు

తెలుగు జాతి గర్వించదగ్గ మేధావి

విదేశీ పెట్టుబడులు ఆహ్వానించారు

ఐటీ విప్లవానికి నాంది పలికారు

ఢిల్లీలో సీఎం చంద్రబాబు పీవీ స్మారకోపన్యాసం 7





మిథున్‌రెడ్డిని కస్టడీలో విచారించాలి!

మద్యం స్కామ్ కేసులో వైసీపీ ఎంపీకి హైకోర్టు షాక్

ఆయనపై మోపిన తీవ్ర అభియోగాలను విస్మరించలేం

నేరపూరిత కుట్రలో ఆయన పాత్ర ఉందని ప్రాథమికంగా స్పష్టమవుతోంది

తమ సంస్థకు అందిన సొమ్ము మద్యం స్కామ్‌ది కాదనేందుకు ఆధారాలను చూపలేదు

ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం

నేర తీవ్రత, రూ.3,500 కోట్ల స్కామ్ దృష్ట్యా బెయిల్‌కు మిథున్‌రెడ్డి అనర్హుడు: న్యాయమూర్తి

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణం వ్యవహారంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. మిథున్‌రెడ్డిపై మోపిన తీవ్రమైన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ఆయన్ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. మద్యం తయారీ కంపెనీల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు వసూలు చేసేందుకు వీలుగా మద్యం పాలసీలో

మిగతా 12వ పేజీలో...

మిథున్‌రెడ్డిపై లుక్ అవుట్ నోటీసు

విదేశాలకు పారిపోకుండా 'సిట్' అప్రమత్తం

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేతతో కదలికలపై నిఘా

మహిళా ఎమ్మెల్యేపై అవేం మాటలు?

ఆమెపై మీ వ్యాఖ్యలను ఉపేక్షించలేం

మహిళా నేతకు ఇచ్చే గౌరవం ఇదేనా?

మీ వ్యాఖ్యలతో న్యూసెన్స్ సృష్టించారు

మాట్లాడేటప్పుడు జాగ్రత్త.. నియంత్రణలో ఉండండి

ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని మందలించిన హైకోర్టు

వైసీపీ నేత ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా



అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని హైకోర్టు తీవ్రంగా మందలించింది. ఒక మహిళా ఎమ్మెల్యేపై ఆ వ్యాఖ్యలు ఏంటని నిలదీసింది. 'ఓ మాజీ ఎమ్మెల్యే అయి ఉండి, ప్రస్తుత ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు ఎలా చేస్తారు? మహిళా నేతను గౌరవించేది ఇలాగేనా? అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నియంత్రణలో ఉండండి.. మీ వ్యాఖ్యతో న్యూసెన్స్ చేశారు. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండండి' అంటూ హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న

మిగతా 12వ పేజీలో...

సరస్వతి షేర్ల బదిలీపై

ఎన్‌సీఎల్‌టీ తీర్పు రిజర్వు

తల్లి, చెల్లిపై ట్రిబ్యునల్‌కు జగన్.. షేర్ల బదిలీ రద్దుకు వ్యాజ్యం

తన వాటా పునరుద్ధరించాలని వినతి 12

కంపెనీ మొత్తం తనదేనని విజయలక్ష్మి స్పష్టీకరణ



ఇస్లామిక్ విద్యా బోధన

తప్పేమీ కాదు!

వేదాలు, ఉపనిషత్తుల బోధనకూ అభ్యంతరం అవసరం లేదు

రాజకీయ పార్టీలు విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం

మైనారిటీలకు రాజ్యాంగ రక్షణలు

మతచిచ్చు, కులచిచ్చు.. రెండూ ప్రమాదకరమైనవే: సుప్రీంకోర్టు

ఎంఐఎం గుర్తింపును రద్దు చేయాలన్న పిటిషన్ కొట్టివేత 10



లెక్చరర్లు నరేంద్ర, సందీప్, వారి మిత్రుడు అనూప్

విద్యార్థినిపై ఇద్దరు

లెక్చరర్ల అత్యాచారం

ఆ వీడియోలతో బెదిరించి ఆమెపై వారి స్నేహితుడూ అఘాయిత్యం

కర్ణాటకలోని దక్షిణకన్నడ జిల్లాలో ఘోరం

ప్రొఫెసర్ వేధింపులతో ఆత్మాహుతికి యత్నించిన యువతి మృతి

ఒడిశాలోని బాలాసోర్‌లో ఘటన



'ఫోన్ ట్యాపింగ్'లో లిక్కర్ స్కామ్ తీగ!

వేల కోట్ల కుంభకోణంలో మరో మలుపు

ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావుకు, లిక్కర్ స్కామ్ ఏ1 రాజ్ కసిరెడ్డికి అనుబంధం

దుబాయ్‌లో శ్రవణ్‌రావు కుటుంబానికి ఫ్లాట్

లిక్కర్ కేసు నిందితులకు అక్కడ ఆశ్రయం

దుబాయ్ నుంచి వస్తూ శంషాబాద్‌లో రాజ్ కసిరెడ్డి అరెస్టు

29సార్లు అక్కడికి వెళ్లొచ్చిన కిరణ్‌కుమార్

మరో నిందితుడు చాణక్యతో కలిసి ఫ్లాట్‌లో

దూకుడు పెంచిన సిట్, ఈడీ అధికారులు

2 కేసుల్లోని నిందితులకు దుబాయ్ బంధం



రాజ్ కసిరెడ్డి

శ్రవణ్‌రావు

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం స్కామ్ నిందితులకు తెలంగాణకు చెందిన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు ఆశ్రయం ఇచ్చిన వ్యవహారం ఇప్పుడు కలకలం రేపుతోంది.. రెండు రాష్ట్రాల్లోనూ సంచలనం రేపిన రెండు కేసులివి. గత ప్రభుత్వాల్లోని పెద్ద తలకాయలకు లాభం చేకూర్చడానికి నడిచిన వ్యవహారాలకు సంబంధించిన ఈ కేసుల్లో కీలక నిందితులను దుబాయ్ బంధం కలిపినట్టు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో ఏ1 రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి

మిగతా 9వ పేజీలో...

ఒక్క ఓటరుకూ అన్యాయం

జరగొద్దు!

జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి

బీఎల్‌వోల ప్రోత్సాహకాన్ని మరింత పెంచాలి

జాబితా సవరణ సమయంలో పార్టీ 'బూత్' ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలి 9

యూనిక్ ఓటరు ఐడెంటిటీతో నకిలీలకు చెక్

కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ సూచనలు

కమిషనర్లతో భేటీ అయిన పల్లా, ఎంపీలు

ఆ ఐదేళ్లూ బాదుడే

కమీషన్ల కిక్కుతో మద్యం ధరలకు రెక్కలు

జగన్ హయాంలో 6,300 కోట్ల భారం

చీప్ నుంచి స్కాచ్ వరకూ ధరాభారం

సీసాపై రూ. 20-200 వరకు అదనం

కమీషన్ల రూపంలో తాడేపల్లికి చేరిక

ప్రస్తుతం కమీషన్ రాజ్‌కు గుడ్‌బై 12

నెలకు 116 కోట్ల భారం నుంచి విముక్తి

దేశంలోనే తొలిసారి కీలక నిర్ణయం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిచ్చురేపిన నివాళి!

‘కశ్మీర్ అమరవీరుల దినోత్సవం’ సందర్భంగా నివాళులు అర్పించేందుకు నక్షబంద్‌సాహిబ్ స్మశానవాటికకు వెళ్ళిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన గేటుదూకి మరీ లోపలకు పోయిన దృశ్యాలు మాధ్యమాల్లో విస్తృతంగా కనిపిస్తున్నాయి. 22మంది అమరుల సమాధులపై గులాబీరేకులు చల్లి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నర్‌పై విరుచుకుపడ్డారు. తనను ఆదివారమంతా గృహనిర్బంధంలో ఉంచారని, సోమవారం కూడా అడ్డుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ‘వాళ్ళు’ మమ్మల్ని బానిసలు అనుకుంటున్నారు, మా చేతుల్లో జెండా చింపేయాలని కూడా చూశారు అన్నారాయన. ఈ ఉదంతం వెనుక ఉన్న చారిత్రక ఘట్టాలమీద ఎవరి అభిప్రాయాలు, అభ్యంతరాలు వారికి ఉండవచ్చును కానీ, ఓ ముఖ్యమంత్రికి ఇటువంటి పరిస్థితి ఎదురుకావడం అమితాశ్చర్యం కలిగిస్తుంది.

ఒక్కమాటలో చెప్పుకోవాలంటే, గవర్నర్ అనధికారిక ఆదేశాల మేరకు ఆదివారం కశ్మీర్ లోయలో ఆంక్షలు అమలైనాయి. నివాళిని నిలువరించేందుకు లోయలోని నాయకులను గృహనిర్బంధం చేశారు. పోలీసు కాపలాతో పాటు, గేట్లు లాక్‌చేశారు, బారికేడ్లు పెట్టారు, సీసీ కెమెరాల్లో ప్రతీక్షణం పర్యవేక్షిస్తూ, ఏ నాయకుడూ తమ కళ్ళుకప్పి తప్పించుకోవడానికి వీల్లేకుండా చాలాచర్యలు తీసుకున్నారు. ప్రధానంగా ఒమర్ అబ్దుల్లాను బయటకు రానివ్వకుండా మరిన్ని జాగ్రత్తలు పడ్డారు. దీనితో, అసలు రోజున నివాళులర్పించలేకపోవడంతో మర్నాడు వేర్వేరుమార్గాల్లో అబ్దుల్లాలు బయటకువచ్చి అనుకున్నది చేశారు. ఫరూఖ్ అబ్దుల్లా ఆటోలో వచ్చారని, కొందరు మంత్రులు స్కూటర్లువాడారని వార్తలు వచ్చాయి. కబరస్థాన్‌కు పోయే దారులన్నీ అధికారులు మూసేయడంతో, ముఖ్యమంత్రి కొంతదూరం నడిచి, ఆఖరుకు గేటు ఎక్కాల్సివచ్చింది.

గవర్నర్ పెత్తనానికి హద్దూపద్దూ లేకపోతోందనీ, అర్థంపర్థంలేని చర్యలతో అనవసరపు వివాదాలు రేపుతున్నారని ఒమర్ అంటున్నారు. కానీ, కేంద్రప్రభుత్వ దూతగా, తమ ఎజెండాకు అనుగుణంగానే సిన్హా ఈ చర్యకు దిగారు. మహారాజా హరిసింగ్‌కు చెందిన డోగ్రా బలగాలు ఆయన పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారిపై కాల్పులు జరిపిన 1931జూలై 13ఘటన కశ్మీర్ చరిత్రలో కీలకమైనది. హరిసింగ్ పాలనకు వ్యతిరేకంగా కశ్మీరీలను కూడగడుతున్న అబ్దుల్ ఖదీర్‌ఖాన్‌ను దేశద్రోహం నేరంపై శ్రీనగర్‌జైల్లో విచారిస్తున్నప్పుడు, అక్కడకు చేరిన ఐదు వేలమంది ప్రజలపై సైన్యం కాల్పులు జరిపిన ఈ ఘట్టం తరువాతే హరిసింగ్ ఎన్నికలకు సిద్ధపడ్డారని అంటారు. జూలై 13ను అమరుల దినంగా నిర్వహించే సంప్రదాయాన్ని షేక్ అబ్దుల్లా ఆరంభిస్తే, ఎవరు అధికారంలో ఉన్నా కొనసాగింది. ఆర్టికల్ 370రద్దుతో కశ్మీర్ తన స్వయం ప్రతిపత్తినీ, రాష్ట్రహోదానీ కోల్పోయిన ఈ ఆరేళ్ళకాలంలో నివాళి నిలిచిపోయింది, ప్రభుత్వ అధికారిక సెలవుల జాబితానుంచి కూడా ఆ రోజు తొలగిపోయింది. బదులుగా హరిసింగ్ పుట్టిన రోజునూ, భారతదేశంతో విలీన ఒప్పందం చేసుకున్నరోజునూ సెలవు దినాలుగా చేర్చారు. ఆరేళ్ళతరువాత, ఇప్పుడు పేరుకైనా ఓ ప్రజా ప్రభుత్వం ఉన్నది కనుక, ‘బ్రిటిష్‌వారి తొత్తుమీద సామాన్యుడు తిరుగుబాటు చేసిన ఈ సందర్భాన్ని మా జలియన్‌వాలాబాగ్’ అంటూ ఈ నాయకులు ఆ నివాళి కార్యక్రమం పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు, కేంద్రప్రభుత్వ దూతదానిని అడ్డుకున్నారు.

మరో ఆరేళ్ళలో నూరేళ్ళవుతున్న నేపథ్యంలో, మహారాజా హరిసింగ్‌కు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని ప్రజల మస్కిష్కాల నుంచి చెరిపివేయాలన్న ఇటువంటి ప్రయత్నాలవల్ల ఫలితం ఉండదు. ఎవరిని స్మరించుకోవాలో, ఎవరిని వదిలించుకోవాలో ప్రజలకు తెలుసు. నివాళిని నిరోధించే ఈ ప్రయత్నం వెనుక భద్రతాకారణాల కంటే, చరిత్రను తిరగరాసే ప్రయత్నం ప్రధానంగా కనిపిస్తున్నది. గతవారం శ్రీనగర్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను ఆరంభిస్తూ, రెండేళ్ళపాటు ఆయన సైద్ధాంతిక ప్రచార కార్యక్రమం ప్రభుత్వపరంగా నిర్వహించబోతున్నట్టు ప్రకటించిన గవర్నర్, మరోపక్కన వందేళ్ళనాటి చరిత్రను ప్రజలు మరిచిపోవాలని కోరుకుంటున్నారు. పహల్గాం దారుణాన్ని నివారించక, ఒక యుద్ధానికి పరోక్షంగా కారకుడైన మనోజ్ సిన్హా ఇటువంటి చిన్నాచితకా వివాదాలకు దూరంగా ఉంటే ఆయన పరువుతోపాటు, కేంద్రప్రభుత్వం గౌరవం కూడా నిలబడుతుంది.

మోదీ వారసుడిపై చర్చ అవసరమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

డైబ్బైతొమ్మిదేళ్ల ట్రంప్ ఉదయాన్నే ఏ ట్వీట్ చేస్తారా అని ప్రపంచమంతా ఎదురు చూస్తుందని, కొద్ది పదాల్లో ఆయన వెల్లడించే అభిప్రాయాలు ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల విధానాలనూ ప్రభావితం చేస్తున్నాయని విదేశాంగ వ్యవహారాల నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దును ప్రకటించి అరగంటలో భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన, వ్యవస్థలపై పట్టుబిగించిన నరేంద్రమోదీకి వచ్చే సెప్టెంబర్‌లో 75 ఏళ్లు నిండనున్నాయి. పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా కనిపించే మోదీ గురించి తెలియని భారతీయుడు ఇప్పుడు ఈ దేశంలో ఎక్కడా ఉండడు. అయిదుసార్లు రష్యా అధ్యక్షుడుగా గెలిచిన 74 ఏళ్ల పుతిన్ వర్తమాన ప్రపంచ శక్తిమంతమైన నాయకుల్లో ఒకరు. 75 సంవత్సరాలు ఇప్పటికే నిండిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇవాళ క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ విధానాలే దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయని, 70 సంవత్సరాల వయసులో ప్రధాని అయిన పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించకపోతే ఇవాళ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తూ ఉండేది కాదని మంగళవారం చంద్రబాబు ఢిల్లీలో పీవీ స్మారకోపన్యాసం వెలువరిస్తూ చెప్పారు. దేశ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేందుకు నాయకుల వయసుతో నిమిత్తం ఉండదని, ప్రజల అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా నాయకులు క్రియాశీలంగా ఉన్నంతకాలం వారు తమ రాజకీయ జీవితంలో కొనసాగుతూనే ఉంటారని చెప్పేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

అయినప్పటికీ ప్రజా జీవనంలో ఉన్నవారు 75 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఇతరులకు అవకాశం కల్పించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల అన్నమాటలు తీవ్ర చర్చను ఎందుకు ప్రేరేపిస్తున్నాయి? రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటే బీజేపీ మాతృసంస్థ. బీజేపీలో ఉన్న అగ్రనాయకులంతా ‘సంఘ్’ నుంచి వచ్చినవారే. ‘ఒక్కసారి స్వయం సేవకుడైతే జీవితాంతం స్వయం సేవకుడే’ అని దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి సగర్వంగా ప్రకటించారు. గత ఏప్రిల్ తుదినాళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి వెళ్లినప్పుడు స్వయం సేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ ‘మనం..’ అనే పదాన్ని ఉపయోగించారు. తాను స్వయం సేవకుడిని కాదని మోదీ ఎప్పుడూ అనలేదు.

ఇంతకూ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై చర్చిస్తున్నది ఎవరు అన్నది ప్రధానం. భాగవత్ అలా ప్రకటించగానే కాంగ్రెస్ నేతలు సంబరపడిపోయారు. తన మనుగడకు మోదీ ఎంత ప్రమాదకరమో కాంగ్రెస్ భావిస్తున్నందు వల్లే ఆ పార్టీ నాయకులు సంబరాన్ని ప్రకటించారనడంలో అతిశయోక్తి లేదు. 2014లో మోదీ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచీ కాంగ్రెస్ జీవన్మరణ సంఘర్షణ చేస్తూనే ఉన్నది. ఒకో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతూ వస్తోంది. మోదీని ఢీకొనడానికి బలమైన రాజకీయ కార్యాచరణ ఎలా నిర్మించాలా అన్న విషయం కాంగ్రెస్ నేతలకు అంతుపట్టడం లేదు. మోదీనే కాదు, ఆయన మూలంగా విస్తరిస్తోన్న భావజాలాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ భావజాలం కాంగ్రెస్ కానీ, ఇతర ప్రతిపక్షాలు కానీ, వామపక్ష మేధావులు కానీ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉన్నది. అందువల్ల తాము ఓడించలేని మోదీని సంఘ్ పరివార్ పక్కకు తప్పిస్తుందని ఆశపడడంలో అర్థం లేదు. మోదీ ఉన్నా, లేకపోయినా మోదీ ఒక మహాశక్తిగా రూపొందడానికి కారణమైన భావజాలాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు శక్తులు ఎలా ఎదుర్కోగలవా అని సామాజిక విశ్లేషకులు ఆలోచిస్తున్నారు. 82 ఏళ్లు నిండిన మల్లికార్జున ఖర్గేని పార్టీ అధ్యక్షుడుగా, 78 ఏళ్ల వయసులో సోనియాను రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగిస్తున్న కాంగ్రెస్ ఇతర పార్టీల నేతల వయసు గురించి మాట్లాడడం అసమంజసంగానే ఉంటుంది.

మోదీ స్వయం సేవకుడే. అంతమాత్రాన మోహన్ భాగవత్ వ్యక్తం చేసిన అభిప్రాయం మోదీకి కూడా వర్తిస్తుందని అనడానికి వీల్లేదు. బహుశా, భాగవత్ స్వయంగా తన గురించి ఈ అభిప్రాయం వ్యక్తం చేసి ఉండవచ్చు. ఆయనకు కూడా సెప్టెంబర్‌లోనే 75 ఏళ్లు పూర్తి కానున్నాయి. గత ఏప్రిల్‌లో మోదీ నాగపూర్‌కు వెళ్లినప్పుడు ఆయనను పదవీ విరమణ చేయమని సంఘ్ అడిగిందని శివసేన నేత సంజయ్ రౌత్ చెప్పారు. మోదీ త్వరలో పదవీవిరమణ చేస్తారని, అమిత్ షాకు అధికారం అప్పజెబుతారని గత ఏడాది ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఊహాగానం చేశారు. అసలు బీజేపీ వ్యవహారాలపై మాట్లాడే హక్కు వారికేమున్నది?

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే కేజ్రీవాల్, సంజయ్ రౌత్ వ్యాఖ్యానించినప్పుడు అమిత్ షా, దేవేంద్ర ఫడణవీస్ వంటి నేతలు వెంటనే ఖండించారు. 75 సంవత్సరాలు దాటినంత మాత్రాన మోదీ పదవీ విరమణ చేయాలన్న నిబంధన ఏమీ లేదని వారు స్పష్టం చేశారు. గమనార్హమేమిటంటే మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ మోదీని సంఘ్ ఇంటికి పంపాలనుకుంటున్నదని వ్యాఖ్యానిస్తే బీజేపీ నేతలు ఎవరూ మాట్లాడలేదు. అంతా నీరవ నిశ్శబ్దం నెలకొన్నది. అయినప్పటికీ భాగవత్ వ్యాఖ్యలు మోదీకి వర్తిస్తాయని చెప్పేందుకు వీల్లేదు. ఎందుకంటే సంఘ్ పెద్దల వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఎవరూ వ్యాఖ్యానించే అవకాశం ఏ మాత్రం లేదు. ఇది సంఘ్‌లోనూ, పార్టీలోనూ అందరూ పాటించే క్రమశిక్షణ. సంఘ్ పెద్దలు ఏ వ్యాఖ్యలు చేసినా అది తమ అంతర్గత వ్యవహారమని వారు భావిస్తారు. అంతేకాదు, మోదీ పది సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్నా, బీజేపీలో ఎక్కడా ఆయనకు వ్యతిరేకంగా రణ గొణ ధ్వనులు వినిపించలేదు. మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ బీజేపీ నేతలు ఆమోదించారు. 75 సంవత్సరాలు దాటాయన్న పేరుతో అడ్వాణీ, మురళీమనోహర్ జోషి వంటి వారిని మార్గదర్శక మండలిలో చేర్చినా ఎవరూ ప్రశ్నించలేదు. ఆనందీబెన్, సుమిత్రా మహాజన్ వంటి వారిని విశ్రాంతి తీసుకొమ్మని చెప్పినా అలా ఎందుకు అని అడిగినవారు లేరు. ముఖ్యమంత్రులుగా ఉన్న సీనియర్లను తప్పించి అనామకులను నియమించినా మోదీని ధిక్కరించినవారు కనపడలేదు. మోదీ–షా ప్రవేశపెట్టిన అధిష్ఠాన సంస్కృతి అంతకంతకూ బలోపేతమవుతోంది.



మోదీనీ, ఆయన మూలంగా విస్తరిస్తోన్న భావజాలాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ సైద్ధాంతిక శక్తిని కాంగ్రెస్ కానీ, ఇతర ప్రతిపక్షాలు కానీ, వామపక్ష మేధావులు కానీ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉన్నది. భారతదేశంలో ఏ ప్రభంజనమూ శాశ్వతంగా కొనసాగిన దాఖలాలు లేవు. ఆవశ్యకత, ఉపయుక్తత ఉన్నంతకాలమూ మోదీ కొనసాగుతారనడంలో సందేహం లేదు. భవిష్యత్తును ఆయన వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు నిర్ణయిస్తారు.

అంతేకాక, వయసు పెరిగిందన్న పేరుతో మోదీని పక్కకు తప్పిస్తే ఆయన కంటే బలమైన నేత లభిస్తారన్న గ్యారంటీ ఏమిటి? మోదీ వారసుడిని సంఘ్ మాత్రమే నిర్ణయిస్తుందన్న విషయంలో రెండో ఆలోచనకు తావు లేదు. లాల్‌కృష్ణ అడ్వాణీ కరాచీ వెళ్లి దేశ విభజనకు కారకుడైన పాకిస్థాన్ సంస్థాపకుడు మహమ్మదాలీ జిన్నాను ప్రశంసిస్తే ఆయనను పక్కకు తప్పించింది సంఘ్ కాదా? వాజపేయి తర్వాత రెండుసార్లు అవకాశం లభించినా బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు అడ్వాణీ విఫలమైతే, ఆయన స్థానంలో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోదీని రంగంలోకి దించింది సంఘ్ కాదా? ఒకసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ రోజువారీ నిర్ణయాల్లో సంఘ్ కలుగచేసుకోకపోవచ్చు. అయినా ఇవాళ ప్రతి మంత్రిత్వశాఖలోను, విభాగాల్లోను, అనుబంధ సంస్థల్లోనూ సంఘ్‌కు సంబంధించినవారు రకరకాల పదవుల్లో నియమితులవుతున్నారన్న విషయాన్ని కాదనగలమా? ఇంతెందుకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో బీజేపీ గెలుపొందేందుకు రకరకాల సంస్థల ద్వారా సంఘ్ తనవంతు ప్రయత్నాలు చేయడం, లబ్ధిదారుల వద్దకు వెళ్లడం నిజం కాదా? సంఘ్ పెద్దల్ని మచ్చిక చేసుకుంటే తమ పనులు సులభంగా అవుతాయని, ఏ పదవి రావాలన్నా సంఘ్ ఆశీర్వాదాలు అవసరమని బీజేపీ నేతలు కూడా భావిస్తున్నారు. అందువల్ల సంఘ్ లేనిది బీజేపీ లేదు, బీజేపీ లేనిది సంఘ్ లేదనేది కఠోర వాస్తవం. ఆర్‌ఎస్‌ఎస్‌ను బలహీనం చేయకుండా బీజేపీని దెబ్బతీయలేమని ఇటీవల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఒకరు అంగీకరించారు. రాహుల్‌గాంధీ కూడా తన ప్రధాన దాడిని సంఘ్‌పై ఎక్కుపెడుతున్నారు.

మోదీ స్థానంలో మరో నేత ఇప్పట్లో అధికారం చేపట్టే అవకాశాలు అనుమానమే. సంఘ్ ఇప్పటికే మోదీకి ప్రత్యామ్నాయంగా మరో నేతను సిద్ధం చేసిందని చెప్పడానికి ఆధారాలు ఏమీ లేవు. నిజానికి సంఘ్ ఎప్పుడూ వ్యక్తుల ఆధారంగా ఆలోచన జరపదని ఆ సంస్థ పెద్దలు అనేకసార్లు సూచించారు. వ్యక్తుల ఆధారంగా పార్టీలు అధికారంలోకి రావని, ఆ నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల ఆధారంగా పార్టీలు అధికారంలోకి వచ్చే వాతావరణం ఏర్పడుతుందని, ఆ సమయంలో క్రియాశీలంగా ఉన్న ఒక వ్యక్తి అవకాశాలు అందిపుచ్చుకుంటారని సమాజ చలన సూత్రాలు చెబుతున్నాయి. అందువల్ల మోదీ స్థానంలో నితిన్ గడ్కరి, యోగి ఆదిత్యనాథ్‌ల గురించి చర్చ జరుగుతున్నా అది కేవలం ఊహాగానాలపై ఆధారపడిన చర్చ మాత్రమే. కాకపోతే బీజేపీపై ఆర్‌ఎస్‌ఎస్ పట్టు మరింత బిగుస్తోందని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకంలో సంఘ్ పాత్ర స్పష్టంగా కనపడుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం విషయంలో కూడా బీజేపీ, సంఘ్ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ఎందుకంటే బీజేపీ ఇప్పటికే పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నది. ఈ పదేళ్ల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలు, ఫలితాలపై అంతటా చర్చ జరుగుతోంది. రానున్న సంవత్సరాల్లో భారత రాజకీయాల్లో, సామాజిక జీవనంలో బీజేపీ, సంఘ్ ప్రభావాన్ని కొనసాగించడం అనేది చాలా కీలకమైన విషయం. బీజేపీని మరింత చైతన్యవంతం చేయగల, పటిష్ఠపరచగల పార్టీ అధ్యక్షుడు ప్రస్తుతం అవసరం. ఈ కారణంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం ఇప్పుడు యాంత్రికంగా జరిగే నిర్ణయం కాకపోవచ్చని ఆ పార్టీ నేతలే ఊహిస్తున్నారు. హిందూత్వ ఆధారంగా బీజేపీ చేసిన ప్రచారం, దానికి తోడుగా అవలంబించిన రాజకీయాలు, ప్రతిపక్షాలను బలహీనం చేసేందుకు అనుసరించిన విధానాలు ఎల్లవేళలా విజయవంతం కాకపోవచ్చు. భారతదేశంలో ఏ ప్రభంజనమూ శాశ్వతంగా కొనసాగిన దాఖలాలు లేవు. మోదీ ఆవశ్యకత, ఉపయుక్తత ఉన్నంతకాలమూ ఆయన కొనసాగుతారనడంలో సందేహం లేదు. మోదీ భవిష్యత్తును ఆయన వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు నిర్ణయిస్తారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పద్యనాటకంలో పాలమూరు ఝరి

బస్సు చక్రాలు పల్లెలకు పరిచయం లేని కాలంలో ఎడ్లబండ్లపై నాటక సమాజాన్ని తరలించి గ్రామాలకు రంగస్థలాన్ని ఆయన పరిచయం చేశారు. నాటకమే జీవితంగా నడయాడి హార్మోనియం మెట్లపై పద్యరాగాలను శ్వాసిస్తూ అర్ధ శతాబ్ది పాటు దక్షిణ తెలంగాణ నాటక రంగాన్ని చకచ్చకితం చేసిన సరస్వతీ వరప్రసాదుడు వరకవుల నరహరిరాజు. నాటకాలు రాయడంతో పాటు, పద్యాలకు రాగాల సొబగులద్ది, ఎందరో నటులను రంగస్థలానికి పరిచయం చేసిన ఈ నాటక కళాకారుడు జూన్ 20న తన జీవన రంగస్థలం నుండి నిష్క్రమించారు.

నరహరిరాజు 1949లో వీరభద్రరాజు, సుగుణమ్మ దంపతులకు గద్వాలలో జన్మించారు. తండ్రి 1940వ దశకంలో రాయలసీమ ప్రాంతం, అనంతపురం నుండి గద్వాలకు వలస వచ్చి అక్కడి సంస్థానాధీశుల ప్రాపకంలో హరికథ కళాకారుడిగా రాణించారు. స్వాతంత్ర్యానంతరం గద్వాల సంస్థానంలోని కవుల, కళాకారుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిన రోజుల్లో వీరభద్రరాజు మరణించారు. కుటుంబ పోషణకు అన్న సత్యనారాయణరాజు హరికథలను ప్రదర్శిస్తూ తోడుగా తమ్ముడు నరహరిరాజును తీసుకువెళ్ళేవారు. ఇలా బాల్యంలోనే హరికథా కళ పరిచయం కావడంతో నరహరిరాజు తన విద్యాభ్యాసానికి 3వ తరగతిలోనే స్వస్తి చెప్పి హరికథ కళాకారుడిగా, హార్మోనియం వాదకుడిగా రూపొందారు. రెండవ అన్న జగన్నాథరాజు ప్రధాన కథకుడిగా, నరహరిరాజు సంగీతకారుడిగా హరికథలను ప్రదర్శించి వరకవుల ద్వయంగా గుర్తింపు పొందారు. నరహరిరాజు తరగతి గదుల్లో పెద్దగా చదవకపోయినా కవుల సహవాసంతో ప్రబంధకావ్యాలను, భారత, రామాయణాలను, చదివారు. హార్మోనియం సంగీత వాద్యంలో సాధన చేశారు. సాహిత్య అభినివేశం, సరిగమల నైపుణ్యం తదనంతర కాలంలో పద్యనాటకకర్తగా, నాటక సంగీత దర్శకుడిగా రంగస్థలంపై అడుగు మోపేందుకు విశేషంగా దోహదం చేశాయి. 1977లో తొలిసారి కొడంగల్ కేంద్రంగా స్థానిక ఉద్యోగులు పాత్రధారులుగా ‘కృష్ణాంజనేయ యుద్ధం’ నాటకాన్ని ప్రదర్శించారు. కొడంగల్‌లో కళాశాల అధ్యాపకులుగా ఉన్న కాతోజు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్ ఆయన వెన్నంటి నిలిచారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో నరహరిరాజు వెనుదిరిగి చూడలేదు.



ఉమ్మడి పాలమూరు జిల్లాలో పద్యనాటకానికి ప్రాణం పోసిన ఘనత వరకవుల నరహరిరాజుకు దక్కుతుంది. ఒకే పద్యానికి వివిధ రాగాలను సృష్టించడంలో ఆయన సిద్ధహస్తులు. కళాకారుల స్వర సామర్థ్యానికి తగ్గట్టుగా రాగాలను కూర్చి భావ ప్రాధాన్యం తగ్గకుండా నరహరిరాజు సంగీతాన్ని అందించేవారు.

మహబూబ్‌నగర్ జిల్లా డోకూరు గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ఎందరో ఔత్సాహికులకు పద్యనాటకాలలో శిక్షణనిచ్చి, తన సంగీత దర్శకత్వంలో పలు నాటకాలను ప్రదర్శించారు. ఆయన నిర్దేశకత్వంలో ‘మిత్ర కళానాట్యమండలి’ ప్రభవించి పాలమూరు నాటక రంగ వెలుగులకు పునాది వేసింది. భీమాచారి, వి.నారాయణ, రామలింగయ్య వంటి ఎందరినో పద్యనాటక రంగంలో ఉత్తమ శ్రేణి నటులుగా ఆయన తీర్చిదిద్దారు. ఇదే పరంపరలో వందలాది కళాకారులు ఆయన దగ్గర శిక్షణ పొంది రంగస్థలానికి పరిచయమయ్యారు.

నరహరిరాజు ఒకే పద్యానికి వివిధ రాగాలను సృష్టించడంలో సిద్ధహస్తులు. కళాకారుల స్వర సామర్థ్యానికి తగ్గట్టుగా రాగాలను కూర్చి భావ ప్రాధాన్యం తగ్గకుండా సంగీతాన్ని అందించేవారు. సరిగ్గా 25 సంవత్సరాల క్రితం మహబూబ్‌నగర్ టౌన్ హాలులో ‘కృష్ణాంజనేయ యుద్ధం’ నాటకాన్ని ప్రయోగాత్మకంగా అందించి తనదైన ముద్ర వేశారు. కాతోజు వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శంకర్‌గౌడ్ కృష్ణుడిగా, విరివింటి పరశురాం ఆంజనేయుడుగా నటిస్తే హృద్యమైన పద్యాలతో, అభినయ ప్రధానంగా సాగిన ఈ నాటకంలో నరహరిరాజు తన సంగీత విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే బలిజేపల్లి లక్ష్మీకాంతం వ్రాసిన ‘సత్యహరిశ్చంద్ర’ నాటకం ఆయన సంగీత దర్శకత్వంలో నాలుగు దశాబ్దాలపాటు వందలాది ప్రదర్శనలకు నోచుకున్నది. ఇది అతిశయోక్తి కాదు. గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, శ్రీకృష్ణరాయబారం, చింతామణి, బాలనాగమ్మ, మధుసేవ వంటి పలు ప్రసిద్ధ నాటకాలనూ ఆయన ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ వేదికగా 2000లో జనతా సేవా సమితి సంస్థను స్థాపించి, నాటక రంగంలో తన వారసుడిగా కుమారుడు దూర్వాసరాజును ‘విప్రనారాయణ’ నాటకం ద్వారా పరిచయం చేసి నూటయాభైకి పైగా ప్రదర్శనలిప్పించారు.

1985లో వచనంలో ఉన్న ‘బొబ్బిలియుద్ధం’ నాటకానికి నరహరిరాజు తొలిసారి పద్యాలు రాసి రచయితగా నాటక రంగానికి పరిచయమయ్యారు. తన సృజనకు మరింత పదునుపెట్టి తర్వాత కాలంలో ‘స్వామి వివేకానంద’, ‘భద్రాద్రి రామదాసు చరితం’, ‘వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర’, ‘అన్నమయ్య’, ‘ఏకాదశి మహత్యం’, ‘మహాకవి కాళిదాసు’, ‘సత్యాగ్రాహి’ వంటి 15కు పైగా పద్య, సాంఘిక నాటకాలు వ్రాసి నాటకకర్తగా గుర్తింపు పొందారు. అదేవిధంగా స్నేహసుధ, ప్రసన్నభారతి, కరుణాభారతి వంటి 10కి పైగా పద్యకావ్యాలను రచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి పూర్వమే తెలంగాణ మాండలికంలో వ్రాసిన ‘జర్రా ఇనుకోండ్రి మా నాయనా’ పద్య కవిత్వం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. నాటకకర్తగా, సంగీత దర్శకుడిగా నరహరిరాజు అర్ధశతాబ్దం పాటు తెలుగునాట అనేక వేదికలపై పద్య నాటకాలను ప్రదర్శించి నాటక రంగంలో తన కీర్తి పుటను సుస్థిరం చేసుకున్నారు. నాటక రంగానికి అందించిన సేవలకు గాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం, ‘కీర్తి పురస్కారం’తో నరహరిరాజును సత్కరించింది. 1986లో నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ‘కళానీరాజన’ పురస్కారం, జె.పి.ఎన్.సి. వారి ప్రతిభా నగదు పురస్కారం, ఇతర కళాసంస్థల సత్కారాలను ఆయన అందుకున్నారు.

ముఖ్యంగా పాలమూరు జిల్లాలో పద్యనాటకానికి ప్రాణం పోసిన ఘనత నరహరిరాజుకు దక్కుతుంది. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఆయన మునివేళ్ళు హార్మోనియం మెట్లపై నాట్యం చేస్తుంటే రంగస్థలం హోరెత్తిపోయేది. అలాంటి ప్రతిభామూర్తి లేని లోటు నేడు స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు పద్య నాటకం, నాటక రంగం ఓ పెద్ద దిక్కును కోల్పోయింది.

● డా. జే. విజయకుమార్ జీ
అధ్యక్షులు, తెలంగాణ థియేటర్ రీసెర్చ్ సెంటర్

ఒడిశాను ఒప్పిస్తే రెండు ప్రాజెక్టులకు మోక్షం

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది. గత ఐదేళ్లూ అంతులేని నిర్లక్ష్యానికి గురైన పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు ప్రస్తుతం ముందుకు సాగుతున్నాయి. బనకచర్ల వంటి కొత్త ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారిస్తున్నారు. ఇదే తరుణంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దాదాపు రెండున్నర లక్షల ఎకరాలకు సాగు నీరందించే నేరడి, ఝంఝావతి ప్రాజెక్టుల క్లియరెన్స్‌లపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి. ఝంఝావతి నదిపైనే ఈ రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. పొరుగునున్న ఒడిశా పాలకులతో మాట్లాడి, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోగలిగితే, ఈ రెండు జిల్లాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది.

వంశధార నదిలో లభ్యమయ్యే 115 టీఎంసీల్లో చెరి సగం వాడుకోడానికి 1962 సెప్టెంబరు 30న ఇరు రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో శ్రీకాకుళం జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలు, ఒడిశాలో సుమారు 30 వేల ఎకరాలకు సాగు నీరందించే నేరడి ప్రాజెక్టును ఏపీ అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళం జిల్లా భామిని మండలంలోని కాట్రగడ్డ వద్ద దీన్ని నిర్మించాలనుకున్నారు. ఒడిశా కూడా దీనికి తొలుత సుముఖత వ్యక్తం చేసింది. 1986లో అప్పటి సీఎంలు ఎన్టీ రామారావు, నవీన్ పట్నాయక్ నేరుగా చర్చలు కూడా జరిపారు. అనంతరం ఒడిశాలోని అప్పటి సంకీర్ణ ప్రభుత్వం మాట మార్చి, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా కేంద్రానికి లేఖ రాసింది. 2010లో కేంద్ర ప్రభుత్వం వంశధార ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను విన్న ట్రిబ్యునల్ 2017 సెప్టెంబరులో నేరడి ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతిచ్చింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన సుమారు 110 ఎకరాలను ఉమ్మడి సర్వే ద్వారా సేకరించి ఆంధ్రకు అప్పగించాలని కూడా ఒడిశాను ఆదేశించింది. కానీ నేటి వరకూ ఉమ్మడి సర్వేకు ఆ రాష్ట్రం సహకరించకపోవడంతో, ఈ ప్రాజెక్టు ఆదిలోనే ఆగిపోయింది. ఇక వంశధార నదిపై ఉన్న మరో పెండింగ్ ప్రాజెక్టు ఝంఝావతి. ఇది కూడా ఒడిశా సహకారం లేకపోవడం వల్ల నిలిచిపోయినదే. ఒడిశా సహకరించి, ప్రాజెక్టుకు అవసరమైన వెయ్యి ఎకరాల భూమిని అప్పగిస్తే, ఆ రాష్ట్రంలోని సుమారు పాతిక వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కూడా నిర్మాణ వ్యయం, పనుల నిర్వహణ, నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, రివర్ గ్యాప్ పనులు... వంటివి పరిష్కారం కాలేదు. గత పదేళ్లలో పలుమార్లు ఈ ప్రాజెక్టులకు సంబంధించి మంత్రులు, ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ పరిస్థితుల్లో ‘ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించాల’ని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించడం స్థానిక రైతులకు ఊరట కలిగించే విషయం. ఇటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా అటు కేంద్రంలోను రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి ఇదే మంచి సమయం.

– డొంకాడ గోపాల్

విలువల రాజకీయానికి రోల్ మోడల్!

అశోక్ గజపతిరాజు గారు ఆధునిక రాజకీయాల్లో విలువలు, ఆదర్శ నాయకత్వానికి ప్రతీక. జూన్ 26, 1951న జన్మించిన అశోక్ గజపతిరాజు గ్వాలియర్, హైదరాబాద్, విశాఖపట్నంలలో చదివారు. విద్యార్థి దశలోనే ప్రజా ఆందోళనల్లో పాల్గొన్నారు. పీవీజీ రాజుగా వాసికెక్కిన పూసపాటి విజయరామ గజపతిరాజు రెండో కుమారుడైన అశోక్ గజపతిరాజు 1978లో మొదటిసారి జనతా పార్టీ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత 1982లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటుతో ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశంలో చేరారు. ఆయన ఏడుసార్లు ఎమ్మెల్యేగా, 2014లో ఒకసారి ఎంపీగా గెలిచారు. పదమూడు ఏళ్ల పాటు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, శాసనసభ వ్యవహారాలు, ఆర్థిక, రెవెన్యూ వంటి పదవులు నిర్వహించారు. 2014–2018 వరకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా పనిచేశారు. గోవా గవర్నర్‌గా ఇప్పుడు దక్కిన అరుదైన గౌరవానికి ఆయన అన్నివిధాలా అర్హుడు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎక్కడా చిన్న మచ్చలేని సరైన వ్యక్తికి నేడు సరైన పదవి లభించింది.

ఆయన మితభాషి. మృదువైన వ్యక్తిత్వం కలవాడు. ప్రజల కోసం నిరంతరం పని చేసిన ఆదర్శవాది. పదవులకు అతీతంగా ప్రజల అభిమానాన్ని చూరగొన్న గొప్పనాయకుడు. అందరికీ అజాత శత్రువు. నేడు యువతరం, తెలుగుదేశం కార్యకర్తలు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే నిజమైన ప్రజాసేవకులుగా ఎదగగలుగుతారు. ఆయనకు ఈ పదవి దక్కడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో నిజాయితీకి, నిబద్ధతకు ప్రజాసేవకు, మానవతా విలువలకు దక్కిన గౌరవంగా చూడవచ్చు. ఆయన ఆదర్శ వ్యక్తిత్వమే ఆయనకు గవర్నర్ పదవి దక్కేలా చేసింది.

విజయనగరం రాజ కుటుంబానికి వారసుడిగా పేరున్న అశోక్ గజపతిరాజు తెలుగుదేశం పార్టీ స్థాపన కాలంలోనే పార్టీలో చేరారు. నాటి నుంచి నేటి దాకా పార్టీ పట్ల విధేయుడిగా నిలిచారు. పార్టీ సిద్ధాంతాలపట్ల అంకితభావంతో, నైతికతను కాపాడే విధంగా జీవితాన్ని కొనసాగించారు. ఎన్టీఆర్ గారికి అశోక్ గజపతిరాజుతో ప్రత్యేక అనుబంధం ఉంది. అశోక్ గజపతిరాజంటే ఎన్టీఆర్‌కు అమితమైన గౌరవం. నేడు అంతే సాన్నిహిత్యం ఆయనకు చంద్రబాబుతోనూ ఉంది. చంద్రబాబు కూడా రాజు గారి మాటకు విలువ ఇస్తారు.

అశోక్ గజపతిరాజు రాజ కుటుంబంలో పుట్టినా ఆయనలో రాజరిక ధోరణి ఏ మాత్రం కనిపించదు. వేలాది ఎకరాల భూములతో సహా వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ సాధారణ జీవితమే గడుపుతారు. రాజకీయాన్ని వ్యాపారంగా కాకుండా సేవా మార్గంగా చూసిన నేత. ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని తెలుగుదేశం పార్టీ విలువలకు కట్టుబడి, చంద్రబాబు నాయుడుకి అత్యంత విశ్వాసపాత్రుడుగా నిలిచారు. రాజకీయంలో విలువలు, విశ్వసనీయత, పారదర్శకత ఎంత ముఖ్యమో తన జీవితంతో చూపించారు. పాలన అంటే ప్రజల సమస్యలకు పరిష్కారం అని నమ్మారు. తన నియోజకవర్గమైన విజయనగరం అభివృద్ధికి ఎనలేని కృషి చేయడమే కాక, దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. విజయనగరం జిల్లాలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, అనాథ ఆశ్రమాలకు భూదానం, రోగులకు ఉచిత వైద్య శిబిరాలు ఇలా ఎన్నో కార్యక్రమాలతో ప్రజలకు మానవతా విలువలతో సేవలందించారు. ప్రభుత్వ, ప్రజా అవసరాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున భూములను ఉచితంగా ఇచ్చి ఉదారత చాటుకున్నారు. విదేశాల్లో రాజ కుటుంబానికి ఉన్న భూములు అక్కడ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. ఆయన అవినీతికి బద్ధ వ్యతిరేకి. పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తారు. పైలట్ అయి విమానాలను నడపాలని రాజు గారి కోరిక. కానీ 2014లో కేంద్ర విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విమానాలను నడిపించే స్థాయికి ఎదిగారు.

మిమ్మల్ని గవర్నర్‌గా నియమించాలని నిర్ణయించామని, అందుకు మీరు అంగీకరించాలని ప్రధానమంత్రి కోరగా అశోక్ గజపతిరాజు ఐదు నిమిషాల్లో చెబుతానంటూ ఫోన్ పెట్టేసి, పార్టీ అధినేత చంద్రబాబుకు ఈ విషయాన్ని తెలియజేసిన తర్వాతనే తన అంగీకారాన్ని ప్రధానమంత్రికి తెలియచేశారు. అశోక్ గజపతి ఎంతటి నిబద్ధతగల, ఆదర్శవంతమైన నాయకుడో అర్థం చేసుకోవచ్చు.



గవర్నర్‌గా నియమించేందుకు అశోక్ గజపతిరాజు గారికి మోదీ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. కానీ సిగ్నల్స్ లేక ఫోన్ కలవలేదు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి కార్యాలయం నుంచి వచ్చిన ఫోన్ కూడా కలవలేదు. చివరకు సింహాచలం అప్పన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న సమయంలో నాకు ఫోన్ చెయ్యగా నేను వారి సతీమణి నంబరు ఇచ్చాను. ఆ నంబరుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. మిమ్మల్ని గవర్నర్‌గా నియమించాలని నిర్ణయించామని, అందుకు మీరు అంగీకరించాలని కోరగా అశోక్ గజపతిరాజు ఐదు నిమిషాల్లో చెబుతానంటూ ఫోన్ పెట్టేసి, తర్వాత ఈ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబుకు తెలియజేసిన తర్వాతనే తన అంగీకారాన్ని ప్రధానమంత్రికి తెలియచేశారు. ఆయన ఎంతటి నిబద్ధతగల, ఆదర్శవంతమైన నాయకుడో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

ఆయన పదవుల కోసం ఏనాడూ పరితపించలేదు. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నా చేత దగ్గర ఉండి నామినేషన్ వేయించి నా గెలుపునకు విశేష కృషి చేశారు. మండుటెండలోనూ గ్రామాల్లో ప్రచారం చేసి నన్ను గెలిపించడంతో పాటు, విజయనగరం జిల్లాలో తెలుగుదేశం క్లీన్ స్వీప్ చెయ్యడానికి కృషి చేసారు. ఏది ఏమైనా అశోక్ గజపతిరాజును గవర్నర్ పదవి వరించడం అభినందనీయం. గోవా గవర్నర్ పదవి చేపట్టబోతున్న అశోక్ గజపతిరాజు గారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు.

■ కలిశెట్టి అప్పలనాయుడు
విజయనగరం పార్లమెంట్ సభ్యులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు


3

బుధవారం 16 జూలై 2025

భక్తుల కోర్కెలు తీర్చే కార్మెల్‌మాత

● బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య సందేశం
● రెండో రోజూ అంగరంగ వైభవంగా కార్మెల్‌మాత ఉత్సవాలు

ఫిరంగిపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే కార్మెల్‌మాతగా మరియమాత వెలుగొందుతుందని బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య తెలిపారు. ఫిరంగిపురంలో రెండో రోజు మంగళవారం కార్మెల్‌మాత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఫిరంగిపురంలోని ప్రసిద్ధ బాలఏసు చర్చి నుంచి కార్మెల్ మాత స్వరూపంతో విశ్వాసులు ప్రదర్శన నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా పేలుస్తూ గురువులు, వందలాది మంది కన్యాస్త్రీలు, భక్తులు వెంట రాగా ప్రదర్శన సాగింది. అనంతరం కొండ మెట్ల వద్ద ప్రదర్శనశాలలో కార్మెల్ మాత మహోత్సవ సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య భక్తులకు సందేశమిచ్చారు. కోర్కెలు తీర్చే మాతగా కార్మెలమాత ప్రతిష్ఠించబడిందన్నారు. లూర్దుమాత, ఆశీర్వాదమాత, మేరీమాత, మరియమాత, నిత్యసహాయమాత, గుణదలమాత, సాగర్‌మాతలనే పేర్లతో కార్మెల్‌మాతను భక్తులు ఇష్టంగా పిలుచుకుంటారన్నారు. మనసారా మాతను ప్రార్థిస్తే కోర్కెలను సిద్ధింప చేస్తుందన్నారు. గ్రామంలోని బాలఏసు చర్చిని, కొండపై కార్మెల్ మాత చర్చిని త్యాగధనులు నిర్మించారన్నారు. కష్టాల్లో నిరాశ చెందకుండా ఆ తల్లిని ప్రార్థించి దీవెనలు పొందాలని కోరారు. మానవులకు రక్షణ ప్రసాదించిన జీసెస్ మరియమాత కుమారుడన్నారు. కార్మెల్‌మాతను ప్రార్థించి గ్రామాలకు వెళ్లి పొలాల్లో విత్తనాలు వేసి సాగు మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో బాల ఏసు చర్చి ఫాదర్ మాలపాటి పాతిమారెడ్డి పాల్గొన్నారు.



కార్మెల్ మాతకు దూపం సమర్పిస్తున్న బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య



కార్మెల్ మాత స్వరూపంతో విశ్వాసుల ప్రదర్శన

తాగునీటి ఎద్దడి తీవ్రం



నల్లపాడు సాయినగర్లో ట్యాంకర్లతో నీటి అమ్మకాలు

● గుంటూరులో మూడో రోజూ నీటి సరఫరా బంద్ ● పంపింగ్ నిలిపివేతతో 12 రిజర్వాయర్లకు అందని నీరు

గుంటూరు కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మెతో గుంటూరు నగరంలో మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరుసగా మూడు రోజుల నుంచి తాగునీరు అందకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఓ పక్క ఎండలు మండిపోతుండగా.. మరోపక్క గుక్కెడు నీళ్లు అందక రిజర్వాయర్ల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్మికుల సమ్మెలో ఉండటంతో ఉండవల్లి, మంగళగిరి, తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో ఆశించిన స్థాయిలో పంపింగ్ జరగడం లేదు. ఈ కారణంగా నెహ్రూనగర్, బీఆర్‌స్టేడియం, నల్లచెరువు, హెచ్‌ఎల్‌ఆర్, నాజ్‌సెంటర్, హనుమయ్యనగర్, స్తంభాలగరువు, కోర్టుకాంపౌండ్, ఏటి అగ్రహారం, శారదాకాలనీ పరిధిలోని 12 రిజర్వాయర్లకు మంగళవారం తాగునీరు పంపింగ్ జరగ లేదు. దీంతో ఆయా రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా ఆగిపోవడంతో నగరంలో 80 శాతం పైగా ప్రజలకు నీరు అందలేదని సమాచారం. ప్రజలు వాటర్ క్యాన్లతో రిజర్వాయర్ల వద్ద బారులు తీరారు. అదేవిధంగా తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించారు.

ట్యాంకర్లతో నీటి అమ్మకాలు

నగరంలో ఒకపక్క నీరందక ప్రజలు అల్లాడుతుంటే.. ఇదే అవకాశంగా కొందరు అధికారులు నీటి అమ్మకాలపై దృష్టి సారించారు. ఓ అధికారి రిజర్వాయర్లలో ఉన్న అరకొర నీటిని ట్యాంకర్ల ద్వారా నిర్మాణ రంగానికి తరలిస్తున్నారు. నల్లపాడు, చుట్టుగుంట, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో నీటి అమ్మకాలు సాగుతున్నాయి.

సమ్మె తేలేవరకు ఇబ్బందులే..

కార్మికులు చేపట్టిన సమ్మె తేలేవరకు నగరంలో నీటికి ఇబ్బందులు తప్పేటట్లు లేవు. మేయర్ కోవెలమూడి రవీంద్ర స్వయంగా వెళ్లి అభ్యర్థించినా కొందరు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఇంకా 60 మందికి పైగా కార్మికులు సమ్మె లోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వారంతా సమ్మె విరమిస్తేనే నీటి సరఫరాకు ఇబ్బందులు తప్పేలా లేవు.



ఏటి అగ్రహారంలో నీళ్ల ట్యాంకుల వద్ద క్యాన్లతో ప్రజలు

దండం పెడుతున్నా.. సమ్మె విరమించండి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న మేయర్

మీకు దండం పెడుతున్నా.. దయచేసి సమ్మె విరమించండి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజనీరింగ్ కార్మికులను కోరారు. తక్కెళ్లపాడులోని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సమ్మెలో ఉన్న ఇంజనీరింగ్ కార్మికుల శిబిరం వద్దకు మంగళవారం మేయర్ వెళ్లి వారితో చర్చలు జరిపారు. సమ్మె కారణంగా నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలగకూడదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని, తాము కూడా కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మేయర్ హామీ మేరకు కొందరు కార్మికులు విధులకు హాజరయ్యారు. సమ్మె కారణంగా నీటి సరఫరాలో ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వెంట కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



కార్మికులకు దండం పెడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

4 హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి

● యూ ట్యూబ్‌లో విద్యార్థినులకు అసభ్యకర చిత్రాలు చూపిస్తుందని ఆరోపణ

రైతులకు చేరువయ్యేనా..!

6 ● తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ● రైతుల్లో అవగాహన లోపంతో సేవలు అంతంతమాత్రమే

కౌలు రుణాలపై శీతకన్ను

● సీసీఆర్‌సీ కార్డులున్నా బ్యాంకర్ల విముఖత ● జిల్లాలో కేవలం 3.50 శాతం మందికే పంపిణీ

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దు.. కౌలురైతుల విషయంలో కనికరం చూపండి.. అని ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు జిల్లా స్థాయి అధికారులు చేస్తోన్న సూచనలను, వినతులను బ్యాంకులు పట్టించుకోవడంలేదు. గతంలో సీసీఆర్‌సీ కార్డులు లేవన్న సాకుతో కౌలు రైతులను బ్యాంకుల గడప కూడా ఎక్కనిచ్చేవారు కాదు. ఈ ఏడు సీసీఆర్‌సీ కార్డులు ఉన్న వారికి కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదని కౌలు రైతులు వాపోతున్నారు. బ్యాంకుల శీతకన్నుతో జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యవసాయ రుణాల విషయంపై జిల్లా సమీక్ష మండలి వంటి సమావేశాల్లో ప్రజాప్రతినిధులు నిలదీస్తున్నా కుంటిసాకులతో బ్యాంకుల అధికారులు తప్పించుకొంటున్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) కూడా ఈ విషయంలో ఏమీ చేయలేకపోతున్నారు. కౌలు రైతులకు జిల్లాలో కేవలం 3.50 శాతం మందికి మాత్రమే రూ.19.09 కోట్లు మంజూరు చేశారు. జాయింట్ లయబిలిటీ(జేఎల్) గ్రూపులు 534కు రూ.20.48 కోట్లు, రైతుమిత్ర గ్రూపులు 216కు రూ.20.30 కోట్లు ఇచ్చారు. కౌలురైతులకు ఎన్ని రుణాలు ఇచ్చారని ఎవరైనా ప్రశ్నిస్తే ఇవన్నీ కలిపి 9509 మందికి రూ.60 కోట్లు ఇచ్చామని ఘనంగా చెబుతుంటారు. అసలు వ్యక్తిగత కౌలుదారులకు ఎంత ఇచ్చామనేది మాత్రం దాచి పెడుతున్నారు.

ప్రస్తుత సీజన్‌లో ఇలా..

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి కౌలుదారులకు 46400 కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటివరకు కేవలం 8661 మందికే ఇవ్వగలిగారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 12200కు 1015, మంగళగిరిలో 7500కు 1122, పొన్నూరులో 10800కు 2737, తాడికొండలో 8800కు 2558, తెనాలిలో 7100 మందికి 1229 కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడిచింది. అసలు కార్డులు ఇవ్వకపోవడంతో కౌలుదారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఏడాదికి 24 నుంచి 36 శాతం వడ్డీకి రుణం తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.లక్ష రుణం తీసుకొంటే ఏడాదిలో రూ.24 వేల నుంచి రూ.36 వేల వరకు చెల్లించాలి. ఇక అన్నదాత సుఖీభవ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇచ్చే రూ.20 వేల ఆర్థికసాయం భూయజమానులకే చేరుతుంది. అలానే పంటకు ఏదైనా నష్టం జరిగినా వారికే ఇస్తున్నారు. చాలామంది భూయజమానులు తమ వద్ద ఉన్న దస్తావేజులు, పట్టాదారు పాసుపుస్తకం, వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో ఉన్న పేర్లతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా సులభతరంగా పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల్లో జరగనున్న బ్యాంకర్ల సమావేశంలోనైనా తమ సమస్యలు చర్చించి మేలు చేసేలా చూడాలని కౌలు రైతులు మొర పెట్టుకుంటున్నారు.



సీఎస్ఈ.. కావాలి

సాఫ్ట్‌వేర్ బ్రాంచీలకే డిమాండ్



● కంప్యూటర్ సైన్స్‌లో పది ఉప బ్రాంచీల ఏర్పాటు
● వెబ్ కౌన్సెలింగ్‌లో ఎక్కువ మంది విద్యార్థుల ఆసక్తి
● సివిల్, మెకానికల్ బ్రాంచీలను ఎత్తేసిన సగం కాలేజీలు

గుంటూరు(విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీటెక్ అంటే నేటి తరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో సాఫ్ట్‌వేర్ సంబంధిత కంప్యూటర్ సైన్స్(సీఎస్సీ) ఒక్కటే అనే భావం నెలకొంది. పెద్ద యూనివర్సిటీల నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎక్కడైనా విద్యార్థులు సీఎస్సీ లేదంటే ఆ పేరుతో ఏర్పాటు చేస్తోన్న ఉప బ్రాంచ్‌లపైనే నూటికి 90 శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజుల నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఆదివారం నుంచి విద్యార్థులు కోర్సులు, కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఏఈపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో అత్యధికమంది సీఎస్ఈ లేదంటే దాని ఉప బ్రాంచ్‌ల్లో చేరేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గుంటూరు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర జిల్లాల విద్యార్థులు భారీ సంఖ్యలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈఏపీ సెట్‌లో 25 వేల మంది విద్యార్థులు అర్హత సాధించగా 30 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులతో పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాగార్జున యూనివర్సిటీ(గుంటూరు), జేఎన్‌టీ యూకే(నరసరావుపేట) క్యాంపస్‌లతో పాటు 36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. గతంలో ఆయా కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్ మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ తదితర బ్రాంచీలు ప్రధానంగా ఉండేవి. అయితే నాలుగైదేళ్ల నుంచి సీఎస్సీలో వచ్చిన సబ్ బ్రాంచీల కారణంగా సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఒక్క సీఎస్సీలోనే దాదాపు పది ఉప బ్రాంచీలు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో సీఎస్సీలో రెండు బ్రాంచ్‌లు

(మిగతా 4లో)

సా..గుతున్న పనులపై ఆగ్రహం

● గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు ● వినుకొండ రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

గుంటూరు, వినుకొండటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి పనులు చేస్తున్నా కొలిక్కిరాక పోవడం.. ప్రయాణికులకు అసౌకర్యంగా ఉండటం.. వినియోగిస్తున్న నిర్మాణ సామగ్రిలపై డీఆర్‌ఎం సుధేష్ణసేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో జరుగుతున్న అమృత్‌భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను డీఆర్‌ఎం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరుపై మండిపడ్డారు. ప్లాట్‌ఫారాలకు ఉపయోగిస్తున్న పాలీష్, మెటల్ రాళ్లను పరిశీలించి కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. మొదటి ప్లాట్‌ఫారం పైకప్పు కుంగి ట్రాక్‌పై పడటం, ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగించేలా సామగ్రి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పొరపాట్లు జరిగితే సహించేది లేదని అధికారులకు సూచించారు. నడికుడి నుంచి దర్శి వరకు రైలు రాకపోకలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



వినుకొండ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణసేన్

23 నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు

4

విసిరితే..వికసిస్తాయి!

● విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ ● విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి ● ఇప్పటికే 60 వేల విత్తనాల సేకరణ ● రోటరీక్లబ్‌ల సహకారంతో విత్తన బ్యాంకుల ఆలోచన

6

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

◆ రూ.37 లక్షల పురుగుమందులు, రూ.9.53 కోట్ల ఎరువులు సీజ్

గుంటూరు సిటీ, పొన్నూరుటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై రెండో రోజు మంగళవారం కూడా విజిలెన్స్ దాడులు జరిగాయి. గుంటూరు నగరంతో పాటు కొల్లిపర, తెనాలి, పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో దాడులు నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. దాడుల్లో రూ.9.53 కోట్ల ఎరువులు, రూ.46.16 లక్షల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రూ.2.64 లక్షల విలువైన 0.19 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని 6-ఏ కేసు నమోదు చేశామని తెలిపారు. పొన్నూరులోని సాయి కృప సీడ్స్‌లో రైతులకు విక్రయించే విత్తనాలు, పురుగు మందులపై బిల్లులు ఇవ్వకపోవడం, ధర పట్టిక సరిగ్గా లేకపోవడంతో రూ.37.91 లక్షల పురుగు మందులను సీజ్ చేశారు. దాడుల్లో పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల ఏడీఏలు మురళీకృష్ణ, సునీల్, విజిలెన్స్ సీఐలు వెంకటేశ్వర్లు, రవిబాబు, పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, విస్తరణ అధికారి శ్రీకాంత్ ఏవో సునీల్‌కుమార్, వ్యవసాయ అధికారి బుల్లా కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరు : పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కార్గిల్ అమర జవాను సేవలకు గుర్తింపు

● సేవా మెడల్‌తో కుటుంబ సభ్యులకు సన్మానం


జవాను కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేత

పిట్టలవానిపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ అమర వీరుడు, జవాను మహ్మద్ హాజీ బాషా కుటుంబ సభ్యులను ఆర్మీ అధికారులు మంగళవారం సన్మానించారు. కార్గిల్ ప్రాంతంలో 8 మౌంటెన్ డివిజనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఆర్మీ ప్రతినిధులు చందోలు గ్రామంలోని హాజీ బాషా నివాసానికి చేరుకున్నారు. కార్గిల్ యుద్ధంలో హాజీ బాషా సాహసానికి గుర్తింపుగా కేంద్రం సేవా మెడల్ ప్రదానం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రశంసా పత్రం, మెమెంటోను ఆర్మీ అధికారులు హాజీ బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అమర జవాను చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ.. 1990లో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం హాజీ బాషా తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. సంక్షేమ సంఘం తరుపున ఆర్మీ అధికారులకు ఈ సందర్భంగా స్వాగతం పలికారు. కార్గిల్ నుంచి విచ్చేసిన ఆర్మీ అధికారి ఎం.వెంకటరెడ్డి హాజీబాషా సేవలను కొనియాడారు. హవల్దార్ మేజర్ రాజేష్, కేకే హవల్దార్ చిరంజీవు బృందం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి

● విద్యార్థినుల పట్ల వ్యవహారశైలిపై ఆగ్రహం


వార్డెన్ సౌరిబాయిని చితకబాదుతున్న తల్లిదండ్రులు

కారంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఆదర్శ పాఠశాల వసతి గృహ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తోందని తల్లిదండ్రులు మంగళవారం వార్డెన్ సౌరిబాయిని చితకబాదారు. ఆమె విద్యార్థినులకు యూ ట్యూబ్‌లో బూతు బొమ్మలు చూపిస్తోందని ఆరోపించారు. విద్యార్థినులను బయటకు తీసుకెళ్లడమే కాకుండా.. బయట వ్యక్తులను లోపలికి తీసుకొస్తోందని, తను చెప్పింది చేయాల్సిందేనని హాస్టల్ విద్యార్థినులను బెదిరిస్తోందని తల్లిదండ్రులు వాపోయారు. అంతేకాకుండా వార్డెన్ సౌరిబాయి విద్యార్థినులు స్నానాలు చేసేటప్పుడు ఫొటోలు కూడా తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఆమె వ్యవహార శైలిపై ప్రిన్సిపల్ నయోమికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. సౌరిబాయిపై గతంలో పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. పాఠశాలలో సీటు వచ్చినా.. తమ పిల్లలను హాస్టల్‌లో చేర్చాలంటే భయమేస్తోందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మోడల్ స్కూల్ నుంచి సాయంత్రం విద్యార్థినులను బయటకు పంపే సమయంలో యువత బైకులపై చక్కర్లు గొడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నా.. స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

23 నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఈ నెల 23, 24 తేదీల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్లు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఏడేళ్లుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులకు జరుగుతున్న నష్టం, భవిష్యత్తు ప్రణాళికను ఈ మహా సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది కార్మికులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మహా సభలకు ఆహ్వాన సంఘం చైర్మన్‌గా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, వైస్ చైర్మన్‌గా నారెడ్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీ, సహాయ కార్యదర్శిగా ప్రముఖ ఆర్కిటెక్ కె.ఎస్ కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. సభలకు బిల్డర్లు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, దీవెనరావు, వలీ, సీతారామయ్య, నికల్సన్, అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెని క్రిస్టినా

గుంటూరు సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికైన మహిళా ప్రజా ప్రతిని. దులు నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా సూచించారు. మహిళా నాయ కత్వంలో మార్పు - స్థానిక స్వపరిపాలనలో సాధికారత అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జడ్పీ కార్యాలయంలో ప్రారంభించి, ప్రసంగించారు. మహిళ నాయకత్వంలోని ఆలోచనల మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యం అని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ ఎన్ సాయి కుమార్ మాట్లాడుతూ మహిళా జడ్పీటీసీలు, ఎంపీపీలను పాలన వ్యవహారాల్లో మరింత బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు.

రెండు నిమిషాల హాల్ట్.. సరిపోవడం లేదు

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం సాయంత్రం వేళ విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు మీదగా లింగంపల్లికి వెళ్లే 12795 ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌పై ప్రయాణికుల నుంచి రైల్వే ఉన్నతాధికారులకు తరచుగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ రైలుకు గుంటూరులో కేవలం రెండు నిమిషాల సమయం మాత్రమే హాల్టింగ్ ఉంది. సాయంత్రం 6.15 గంటలకు వచ్చి 6.17కి ఈ రైలు బయలుదేరుతుంది. ఈ రైలుకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ రైలు తర్వాత రాత్రి 11.15 గంటల సమయం దాటేంత వరకు మరో రైలు లేదు. దీంతో ఎక్కువ మంది ఇంటర్ సిటీలో ప్రయాణిస్తున్నారు. గుంటూరులో ఇచ్చిన రెండు నిమిషాల హాల్టింగ్ సమయం ప్రయాణికులు ఆ రైలులో బోర్డింగ్ చేయడానికి సరిపోవడం లేదు. దీంతో రైలు ఎక్కలేక పలువురు వెనుదిరుగుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో హాల్టింగ్ సమయం కనీసం ఐదు నిమిషాలకు పెంచేందుకు తాము ఉన్నతాధికారులకు నివేదిస్తామని కంట్రోల్ ఆఫీసు అధికారులు పేర్కొన్నారు.

విశ్రాంత రైల్వే గార్డు నకిలీ టీటీఈ అవతారం

● రైలు బోగీల్లో తనిఖీ చేస్తూ పట్టుబడిన వైనం..

నర్సరావుపేట లీగల్, జూలై 15,(ఆంధ్రజ్యోతి): నకిలీ టీటీఈని నరసరావుపేట రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈ నకిలీ టీటీఈ.. గుంటూరుకి చెందిన అసలు టీటీఈ జాన్ వెస్లీకి తారసపడ్డాడు. నకిలీ టీటీఈని గుర్తింపు కార్డు చూపాలని జాన్ వెస్లీ కోరగా.. వాదనకు దిగాడు. రైలు నరసరావుపేటకి రాగానే బయటకు దూకి పరారయ్యేందుకు యత్నించాడు. అప్పటికే.. అప్రమత్తమైన నరసరావుపేట రైల్వే పోలీసులు నకిలీ టీటీఈని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజులుగా టీటీఈగా చెలామణి అవుతూ.. రైళ్లలో తిరుగుతున్న అతన్ని.. అవినాష్ కృష్ణ గుప్తాగా రైల్వే పోలీసులు గుర్తించారు. అతను.. గతంలో బిలాస్ పూర్ పరిధిలో రైల్వే గార్డుగా పనిచేసి.. ప్రమాదం బారిన పడటంతో ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాడని తెలుసుకున్నారు.

సీఎస్ఈ.. కావాలి

(3వ పేజీ తరువాయి)

మాత్రమే ఉండగా ప్రస్తుతం ఏఐఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉప దాదాపు పది బ్రాంచ్‌లను ఏర్పాటు చేశారు. 36 కాలేజీల్లో సగం కాలేజీల్లో సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో సీట్లు భర్తీ కావడం లేదు. దీంతో క్రమంగా కళాశాలలు వీటిని ఎత్తివేసి కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన బ్రాంచ్‌లను ప్రవేశపెడు తున్నాయి.

భారీ ప్యాకేజీల మోజుతో..

ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ, ఐటీ బ్రాంచ్‌ల్లో అత్యధికంగా విద్యార్థులు చేరడానికి కారణం భారీ ప్యాకేజీలే కారణమని అధ్యాపకులు చెబుతున్నారు. సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ప్రారంభ జీతం రూ.15 వేల నుంచి 25 వేల లోపు ఉంటే కంప్యూటర్ బ్రాంచీల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకు ప్రారంభ జీతం ఉంటోంది. దీనికి తోడు వైట్ కలర్ ఉద్యోగుల మాదిరి ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయవచ్చు. దీనికి తోడు ఉద్యోగులకు ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఫలితంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే బ్రాంచీల వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉపాధి అవకాశాలు ఉన్నా...

తొలుత బీటెక్‌లో మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉండేవి. కంప్యూటర్ కోర్సు రావడం.. గత కొన్నేళ్లుగా విద్యార్థుల్లో నెలకొన్న పరిణామాలతో మెకానికల్, సివిల్, కెమికల్ బ్రాంచీల్లో నిరాదరణకు గురయ్యాయి. ప్రధానంగా ఆయా బ్రాంచీల్లో డిగ్రీలు చేస్తే ఉపాధి కష్టమన్న భావన విద్యార్థుల్లో నెలకొందని కళాశాలల ప్రిన్సిపాల్స్ చెప్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదంటున్నారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్మాణ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయి. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ప్లాంట్లలో అత్యధిక గంటలు నిల్చొని పనులు చేయాల్సి ఉంటుంది. ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయడానికి అవకాశాలు చాలా తక్కువ కావడంతో ఈ బ్రాంచ్‌లకు విద్యార్థుల నుంచి డిమాండ్ తగ్గింది.

తురకా కిశోర్‌కు రిమాండ్


మాచర్ల కోర్టు వద్ద తురకా కిశోర్

మాచర్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు తురకా కిశోర్‌కు హత్యాయత్నం కేసులో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం 14 రోజుల రిమాండ్ విధించింది. 2022 అక్టోబరు 7వ తేదీన వెల్దుర్తి మండలం బోదలవీడుకు చెందిన టీడీపీ నాయకుడు దారపనేని శ్రీనివాసరావును వైసీపీ పార్టీలోకి మారాలని దాడి చేశారనే కేసులో కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇప్పటికే కారంపూడి కేసులో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు పీటీ వారంట్ కింద మాచర్ల కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ ఈ మేరకు రిమాండ్ విధించారు. వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి ఎస్కార్ట్‌తో గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగించే వారికి అంబేడ్కర్ దేవుడు

● జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వడ్డేపల్లి రామ్‌చందర్

తాడేపల్లి (ఉండవల్లి) , జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించే ప్రతి వ్యక్తికి అంబేడ్కర్ దేవుడే అని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. మంగళవారం ఉండవల్లిలోని అంబేడ్కర్ సంస్థానంకు ఆయన విచ్చేశారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌చందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 338 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వర్తించాల్సిన అన్ని వనరులు, ఉద్యోగాలకు సంబంధించి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పర్యటించామని తెలిపారు. పలు సమస్యలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. ఉండవల్లి గుడిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహాన్ని సందర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో పోలీసులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. 2018 నుంచి గవర్నమెంట్ గెజిట్ ప్రకారం అట్రాసిటీ కేసులలో అరెస్టులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోతే పోలీసులపై ఎస్సీ కమిషన్ యాక్షన్ తీసుకుంటుందన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన దాడిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కానీ ఈ కేసును సుమోటాగా తీసుకోవడం జరిగిందన్నారు. పలువురు బుద్ధిస్టులు, అంబేడ్కర్ వాదులు ఈ సందర్భంగా రామ్‌చందర్‌ను ఘనంగా సత్కరించారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

● తనను రెండో పెళ్లి చేసుకున్నాడని ప్రచారం చేస్తుండటమే కారణం

● పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదపలకలూరు శివారు పొలాల్లో ఈ నెల 12న జరిగిన సత్తెనపల్లికి చెందిన మన్నెబోయిన పద్మావతి (50) హత్య కేసులో మిస్టరీ వీడింది. ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన ముండ్లమూరు సూర్యనారాయణరెడ్డి ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. తనను సూర్యనారాయణరెడ్డి రెండో పెళ్లి చేసుకున్నాడని ప్రచారం చేస్తుండడంతో.. విసుగు చెంది ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు సూర్యనారాయణరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాడీపేటకు చెందిన పద్మావతి భర్త బ్రహ్మం ఏడేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె కూతురుకు గతంలోనే వివాహమైంది. పద్మావతి కొద్ది సంవత్సరాలుగా సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటోంది. పద్మావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. ఇదిలా ఉంటే కొద్ది సంవత్సరాలుగా పీసపాడు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డితో పద్మావతికి వివాహేతర సంబంధం ఉంది. కాగా సూర్యనారాయణ రెడ్డి గుంటూరులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్ లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే తరచూ పద్మావతి సూర్యనారాయణ రెడ్డి కోసం హాస్టల్ వద్దకు వెళుతూ ఉండేది. అంతేగాక సూర్యనారాయణరెడ్డి తల్లికి ఫోన్ చేసి అత్తయ్య అని పిలిచేది. అదేవిధంగా సూర్యనారాయణ రెడ్డి తనను రెండో పెళ్లి చేసుకున్నాడని అందరికీ ప్రచారం చేస్తూ ఉండేది. దీంతో పద్మావతి ప్రవర్తనతో విసుగు చెందిన సూర్యనారాయణరెడ్డి నమ్మకంగా ఆమెకు ఫోన్ చేసి పెదపలకలూరు పొలాల వద్దకు పిలిపించి ఆమె మెడకు పైట చెంగుతో మెడకు బిగించి.. హత్య చేశాడు. ఈ మేరకు నమోదు అయిన కేసులో నల్లపాడు పోలీసులు సూర్య నారాయణ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచా రిస్తున్నారు.

సమస్యల వెల్లువ..!

● విద్యుత్ అదాలత్‌కు పోటెత్తిన వినియోగదారులు

● అధికారుల తీరుపై పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఆగ్రహం

● అర్జీల నమోదు తీరుపై వినియోగదారుల అసంతృప్తి


సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేలు

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు మంగళవారం బాపట్ల పట్టణంలోని శ్రీ సాయి ప్యాలెస్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేలు ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలు తీసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపించారు. అయితే.. కొన్ని అర్జీలు నమోదు చేయకపోవడంపై వినియోగదారులు ఆసంతృప్తి వ్యక్తం చేశారు. కర్లపాలెం మండలం నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఏఈ బాష, సిబ్బందిపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పట్టణంలోని పటేల్ నగర్‌కు చెందిన యు.శ్రీనివాసరావు సోలార్ విద్యుత్ బిల్లులు 2022 జనవరి నుంచి జూన్ వరకు రూ.13,600 చెల్లించారని.. ఆ తర్వాత ఇప్పటి వరకు మిగులు విద్యుత్‌కు బిల్లులు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు.

● కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన గూడూరు మురళీకృష్ణ, హరిప్రసాద్‌రెడ్డి, బి.తిరుమలరావు, అంకిరెడ్డి అంకమ్మ 2019లో కిచెన్ గార్డెన్ సర్వీస్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు 2020లో రూ.1.62లక్షలు చెల్లించినా.. సర్వీస్‌లు ఇవ్వలేదని 2023లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని రూ.3.60లక్షలు చెల్లించాలని చెప్పారని ఫిర్యాదు చేశారు.

● పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు చెందిన శ్రీ జయలక్ష్మీ ఇండస్ట్రీకి సంబంధించి అధికారులు స్మార్ట్ బిగించారని అయితే దీనికి కెపాసిటర్ బ్యాంక్ పెట్టాలన్న విషయం చెప్పకపోవటంతో గతంలో నెలకు రూ.17 వేలు బిల్లు వచ్చేదని ప్రస్తుతం రూ. 48 వేలు వస్తుందని ఇండస్ట్రీ నిర్వాహకులు శంకర్ ఫిర్యాదు చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కెపాసిటర్ బ్యాంక్ పెట్టుకొమని ఇప్పుడు చెప్పడం వల్ల తాను లక్షలాది రూపాయలు నష్టపోతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల ఎస్ఈ జి.ఆంజనేయులు, ఈఈ జి.భాస్కరరావు, విద్యుత్ అదాలత్ సభ్యులు ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు, ఎ. సునీత, ఎస్.శ్రీనివాసరావు, ఏడీఈలు, ఏఈలు తది తరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్తకు.. శ్రీగురు పురస్కారం


గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్

గుంటూరు (విద్య)జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ విద్యాసం స్థల సమన్వయకర్త, ప్రముఖ ప్రవచకులు, సంస్కృత అధ్యాపకులు గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌కు మంగళ వారం శ్రీ గురు పురస్కారం లభించింది. ఆంధ్రప్ర దేశ్ అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం వారు సాహిత్య రంగంలో విశేష కృషి చేయడంతో పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, బ్రాహ్మణ ధర్మములను సంరక్షించి వ్యాప్తి గావించినందుకు గాను " రామాయణ ప్రవాచక కంఠీరవ" అనే బిరుదుతో సత్కరించారు. నేటి యువతకు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని వెల్లడించారు. శ్రీ గురు పురస్కారం పొందిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌ను విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళ వారం నాటికి 556.60 అడుగులు ఉంది. ఇది 224.55 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1,650, మొత్తం ఔట్‌ఫ్లో 1,650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 64,789 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 15.12 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4,600, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం ఐదు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	98, 107, 118
చికెన్ విత్ స్కిన్(కిలో)	190.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	200.00

52,228 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,761 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,228 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	----	---	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13600	తేజ	10000	13500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4600	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే నసీర్

జగన్.. ఎమ్మెల్యేకి కూడా అనర్హుడే

- ప్రజా ఆశీర్వాదమే ప్రభుత్వానికి బలం
- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా చేసేందుకు కూడా జగన్మోహన్ రెడ్డికి అర్హత లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్‌తో కలిసి 54వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ సైన్యం మాటలు వింటుంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ ముఠా దోచుకున్న సొమ్మును దుబాయ్ వంటి ప్రాంతాల్లో దాచుకున్నారని విమర్శించారు. ఇలాంటి వారితో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్ ప్రజా జీవితంలో ఉండటానికి అనర్హుడని, ఎమ్మెల్యే పదవికి కూడా పనికిరాడని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే అన్ని వర్గాలకు మేలు చేసేలా పాలన సాగించిందని తెలిపారు. గుంటూరులో గత ఐదేళ్ల కాలంలో ఎక్కడా తట్టమట్టి కూడా వేయలేదని, ప్రజలు అష్టకష్టాలు పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో ఈస్ట్ అబ్జర్వర్ గంజం రాఘవేంద్ర, మ్యాని, చిట్టిబాబు, రాజా మాస్టర్, డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, పోతురాజు సమత, ఎల్లావుల అశోక్, గొళ్ల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాస్, ఆనంద్, సింధు, గుంటి నరసింహారావు, దయారత్నం, కిరణ్, పీరా, రెహమాన్, శ్రీనివాసరావు, వెంకటాద్రి, రాజేష్, మురళి, ప్రసన్నకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు రూ.2 లక్షల కార్యకర్తల నిధి అందజేత

నగరంలోని 57వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ అక్బర్ బాషాకు ఎమ్మెల్యే నసీర్ రూ.2 లక్షల కార్యకర్తల నిధి చెక్కును అందజేశారు. ఆటో నడిపితే తప్ప పూట గడవని అక్బర్‌కు షుగరు కారణంగా కాలు తొలగించారు. దీంతో ఆ కుటుంబానికి పూట గడవడమే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో పార్టీ ఆయనకు రూ.2 లక్షల కార్యకర్తల నిధిని మంజూరు చేసింది. ఆ నిధిని తన కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ బాధితుడికి అందజేశారు.

రోడ్ల వెంట ఆక్రమణలను తొలగించాలి


- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంట ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నల్లచెరువు మెయిన్ రోడ్, అరండల్ పేట 1, 4 లైన్లను పరిశీలించి, డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణలపై మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసి, ఆయా ప్రాంతాల్లోని ముగ్గురు పట్టణ ప్రణాళిక సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ నల్లచెరువు మెయిన్ రోడ్‌లో మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై ఆక్రమణల వలన పూడికతీయడం వీలుకాలేదని, ఆయా ఆక్రమణలు తొలగించడంలో నిర్లక్ష్యంగా ఉన్న 57, 58 సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, ఆక్రమణలను తక్షణం తొలగించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. అనంతరం అరండల్‌పేట 1, 4 లైన్లను పరిశీలించి, త్వరలో శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రోడ్లలో నూరు శాతం ఆక్రమణలు తొలగించుకోవాలన్నారు. అరండల్‌పేట 4వ లైన్‌లో పార్క్ ఎదురు ప్రధాన రోడ్డుని ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి 142 సచివాలయ ప్లానింగ్ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేసి, సదరు ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. అనంతరం తక్కెళ్లపాడు రోడ్డులోని నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్సుని పరిశీలించి, కార్మికుల సమ్మె వలన తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు పూర్తి స్థాయిలో ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. ఉండవల్లి నుంచి సరఫరాకి, ఫిల్టరేషన్‌కి సమస్య రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, ఎం.శ్రీవల్లి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్చకులను బయోమెట్రిక్ నుంచి మినహాయించాలి

- కమిషనర్‌కు జేఏసీ నేతల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులను బయోమెట్రిక్ నుంచి మినహాయించాలని అర్చక జేఏసీ నేతలు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు అర్చక జేఏసీ రాష్ట్ర నాయకులు జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి, ఎం. ఏ.శేషాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి గుంటూరులో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత అర్చకుల సమస్యలు నూరు శాతం పరిష్కరించిందని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలు, ధూప దీప నైవేద్యం పథకానికి రూ.10 వేలు, వేద పండితుల నిరుద్యోగ భృతికి రూ.3 వేలు ఇవ్వటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వేతన అర్చకులకు ట్రెజరీ శాలరీ అమలుకు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు ప్రయత్నాన్ని చేస్తామని కమిషనర్ తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కిరణ్ కుమార్, కొత్తలంక మురళీకృష్ణ, నారాయణం వేణుగోపాల్, పి.జగన్మోహన్, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, ఆమంచి రవికుమార్, నందివెలుగు శేషగిరిరావు, బృందావనం గోపీచంద్, యనమదల ఆంజనేయులు, దీవి రఘురాం, చెంగోళం శేషాచార్యులు, వి.రమణాచార్యులు, సీహెచ్ మల్లికార్జునశర్మ, డి.వాసుదేవా చార్యులు, వేదాంతం కిరణ్, దీవి దశరథరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి, ఎంఏ శేషాచార్యులు తదితరులు

తెలుగు ప్రజల మదిలో శాశ్వత ముద్ర కోట శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల హృదయాల్లో సినీ నటుడు కోట శ్రీనివాసరావు శాశ్వత ముద్ర వేసుకున్నారని అవగాహన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ బిల్లా అశోక్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సినీ నటుడు కోట శ్రీనివాసరావు సంస్మరణ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ విలక్షణ నటనతో సినీ ప్రేమికులను మెప్పించి చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన నట దిగ్గజం కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. తెలుగు సినీ తెరపై ప్రతి నాయకుడిగా, సహాయ నటుడు, హాస్య నటుడిగా ఇలా ఏ పాత్రలోనైనా అవలీలగా ఒదిగిపోగల ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్న కోట ఇక లేరు అనే వార్త సినీ ప్రియులు జీర్ణంచుకోలేక పోతున్నారన్నారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, యార్లగడ్డ లక్ష్మీ, మల్లేశ్వరరావు, రాజశేఖర్ తదితరులున్నారు.

శాంతినగర్‌లో సమస్యల తిష్ట

- అధ్వానపు కాల్వలు, రహదారులు
- అష్టకష్టాలు పడుతోన్న కాలనీ వాసులు



పగిలిపోయి అధ్వానంగా ఉన్న రహదారి

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చుట్టుగుంట పక్కనున్న శాంతినగర్‌లో సమస్యలు తిష్టవేసుకున్నాయి. అధ్వానపు కాల్వలు, రహదారులతో కాలనీ వాసులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. ఇక వర్షాలు కురిస్తే ఇళ్లలోకి నీరు చేరుతున్నాయి. అలాగే రహదారులు చిన్నపాటి తటాకాలను తలపిస్తున్నాయి. ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించిన సీసీ రోడ్లు ఇప్పుడు అధ్వానంగా తయారయ్యాయి. ఇక కాల్వలు అయితే మురుగునీరు ముందుకు కదలక రోడ్డుపైకి చేరుతోంది. దాంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాంతి నగర్‌లో మొత్తం ఐదు వీధుల్లో ఏ ఒక్క వీధిలోనూ కాల్వలు సరిగా లేక మురుగునీరు ముందుకు పారటం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టు పక్కన ప్రాంతాలు సీసీ రోడ్లు, కాల్వలతో అభివృద్ధి చెందుతోన్నా తమ కాలనీ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థితి మారిందని వాపోన్నారు. పారిశుధ్య కార్మికులు మాత్రం కనీసం చుట్టంచూపుగా కూడా రావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలకులు, అధికారులు పర్యటనకు వచ్చినప్పుడు పలుమార్లు తమ గోడు వెళ్ళబోసుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మురుగు ముందుకు కదలని కాల్వలు



పాఠశాలల్లో తనిఖీ చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

బాలల హక్కుల్ని కాలరాస్తే కఠిన చర్యలు

- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి
- ప్రైవేట్ పాఠశాలల్లో విస్తృత తనిఖీలు

గుంటూరు (విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో బాలల హక్కుల్ని కాలరాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. నగరంలోని ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఆమె తనిఖీ చేశారు. స్థానిక రెడ్డిపాలెంలోని శ్రీ చైతన్య స్కూల్లో తనిఖీ సందర్భంగా సెల్లార్లో తరగతులు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా యూకేజీ, ఎల్‌కేజీ క్లాసులు ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఫీజుల వివరాలు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అందిస్తున్న ఆహారంపై కూడా ఆమె అసహనం వ్యక్తం చేశారు. బాలల సంరక్షణ కోసం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనుమతి లేకుండా హాస్టల్ నిర్వహించడం, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన అందించడం తదితర అంశాలను పరిశీలించి సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పాఠశాలలో ఫిర్యాదులు బాక్సు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఒక గదిలో 20 మంది విద్యార్థులను ఉంచడం తగదని ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని కమిషన్ సభ్యులు పద్మావతి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు ఆర్ఐవో జి.సునీత, మహిళా సంక్షేమ శాఖ అధికారి పి ప్రసన్న, ఐసీడీఎస్ సీడీపీవో జి.అరుణ, బి.వాసంతి, డిప్యూటీ డీఈవో ఏసురత్నం, ఎంఈఓ ఎస్ఎంఎస్ జ్యోతి కిరణ్ నాగేంద్రమ్మ, నీలిమా తదితరులు పాల్గొన్నారు



అరండల్‌పేటలోని టిఫిన్ సెంటర్‌లో గృహావసర వంట గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసిన అధికారులు

23 గృహావసర వంట గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న గృహావసర వంట గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాల శాఖ నగర అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ సీఎస్‌డీటీ బేగ్ ఆధ్వర్యంలో అరండల్‌పేట పరిసర ప్రాంతాల్లోని కల్యాణి, శ్రీ వినాయక టీ, సత్యనాగ టిఫిన్ సెంటర్లలో సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 23 గృహావసర సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటన్నింటిని స్వాధీనపరుచుకొన్నారు. ఆయా టిఫిన్ సెంటర్ల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు డీటీ బేగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను ఇళ్లల్లో వంట చేసుకోవడానికే వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, మెస్‌లు, టీ స్టాల్స్, కర్రీ పాయింట్లు వంటి వాటిల్లో వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

20న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గుంటూరు(తూర్పు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన గుంటూరు ఎన్జీవో క్లబ్‌లో సబ్ జూనియర్, సీనియర్ మహిళలు, పురుషులు విభాగాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు ఈ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ప్రకాశం జిల్లా, చేవూరులో ఆగస్టులో జరిగే అంతర జిల్లాల పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని అదే రోజున ఉదయం 8 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాలకు 93477 85888 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

వాళ్లు జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కాదు : సీఈవో

గుంటూరు సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : 22 నెలలుగా తమకు జీతాలు చెల్లించటం లేదని జిల్లా పరిషత్ ఎదుట ధర్నా నిర్వహించిన వాళ్లు జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కాదని సీఈఓ వి.జ్యోతి బసు వెల్లడించారు. జిల్లా పరిషత్ నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించలేదని తెలిపారు. గతంలో కొందరిని రోజు వారీ వేతనం ఇచ్చి కాపలాదారులుగా నియమించారని, వారికి ఇవ్వాల్సిన జీతాలు చెల్లించామని చెప్పారు.

ఆగస్టు 15న రాష్ట్ర స్థాయి పౌరాణిక ఏకపాత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు, అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఆగస్టు 15న రాష్ట్ర స్థాయి పౌరాణిక ఏకపాత్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, ప్రత్యేక బహుమతుల కింద రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అంతేగాక జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. పేర్లు నమోదుకు 94401 09795 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్త మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి నరసింహారావు మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించి కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెలో పాల్గొన్న వారిలో బి ముత్యాలరావు, పి శ్రీనివాసరావు, భాషా, యాసిర్ ఖాన్, మహేష్, బాలకృష్ణ, లీక్ వర్కర్స్ వాల్ ఆఫ్ రైటర్స్ పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న తాడికొండ నరసింహారావు

జిల్లా గ్రంథాలయ బడ్జెట్‌కు ఆమోదం

గుంటూరు(తూర్పు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ భార్గవతేజ అధ్యక్షతన మంగళవారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులు, విద్యా, పంచాయతీ వయోజన విద్య, ఉప సంచాలకులు, పౌర సంబంధాల శాఖ విభాగపు అధికారులు హాజరై అజెండాలో మొత్తం 14 అంశాలను చర్చించారు. అనంతరం 2025-26 సంవత్సరానికి బడ్జెట్లో వివిధ పద్దులకు కేటాయించిన సొమ్ము రూ.45,88,43,609లను ఖర్చు చేసుకునేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు.

నేడు ఎస్‌వీఎన్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్‌వీఎన్ కాలనీ, తారకరామనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వెస్ట్ పరిధిలో డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్

- పర్యవేక్షించిన డీఎస్పీ, సీఐలు

గుంటూరు. జులై 15 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం పోలీసులు డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయా విద్యాసంస్థల వద్ద వాహన తనిఖీలతో పాటు సమీప ప్రాంతాల్లోని దుకాణాల్లో డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో ఆయా తనిఖీలు జరిగాయి. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కళాశాల వద్ద సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు ఆయా దుకాణాల్లో గంజాయి వంటి విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు చేశారు. అదేవిధంగా నగరంపాలెం సీఐ నజీర్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ కళాశాల వద్ద, అలాగే బ్రాడీపేట, నాలుగో లైన్‌లో ఆరోగ్య రాజు ఆధ్వర్యంలో మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆయా విద్యాసంస్థల వద్ద విద్యార్థులతో మహిళా పోలీసులు మాట్లాడి ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టుబడిన ఆకతాయిలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.



జేకేసీ కళాశాల వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళ ఎస్ఐ, పర్యవేక్షిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు

యువతి పెళ్లికి అంగీకరించలేదని యువకుడి ఆత్మహత్య



సాయి సందీప్(ఫైల్)

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతితో పెళ్లి జరగడం లేదని మనస్థాపానికి గురైన భీమవరపు సాయి సందీప్ (25) ఎలుకలు ముందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వసంతరాయపురంకు చెందిన భీమవరపు సాయి సందీప్ తల్లిదండ్రులు గతంలో అనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి సాయి సందీప్ వసంతరాయపురం లోని మేనత్త ఈశ్వరి వద్ద నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కాగా సాయి సందీప్‌కు నల్లచెరువుకు చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. ఇరువురు ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. అయితే తాను ప్రేమిస్తున్న యువతిని సాయి సందీప్ ఇటీవల అనుమానిస్తుండడంతో ఆమె సాయి సందీప్ ఫోన్ నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టింది. దీంతో ప్రేమించిన యువతితో పెళ్లి జరగడం లేదని సాయి సందీప్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఈనెల 13న సాయి సందీప్ ఎలుకల పేస్ట్ తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. జీజీహెచ్‌కు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని బాబాయి భీమవరపు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతి పథంలో దూసుకెళ్తున్న నియోజకవర్గం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- రూ.2.21 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందుతూ ప్రగతి పథంలో దూసుకువెళుతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని)తో కలిసి మంగళవారం ఆమె చంద్రమౌళినగర్లో 2.21 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లు, కల్వర్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కొరిటెపాడు, చంద్రమౌళినగర్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, కొన్ని రోజుల క్రితం రోడ్లు పూర్తి చేశామని, ఇప్పుడు సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, నెల రోజుల లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. గడిచిన 5 ఏళ్ళ కాలంలో ఎక్కడ కూడా అభివృద్ధి అనే మాట వినిపించకుండా వైసీపీ నేతలు కక్ష రాజకీయాలు, దాడులకు పాల్పడ్డారన్నారు. టీడీపీ కార్పొరేటర్లు గెలిచిన చోట కక్షపూరితంగా వ్యవహరించి, నేడు 11 సీట్లకు పరిమితం అయినా కూడా ఒక మాజీ ఎమ్మెల్యే 'జగన్ అధికారంలోకి వస్తే మా గన్నులు, లాఠీలు బలంగా పని చేస్తాయని' ఎస్పీ ఆఫీస్ ఎదుట వ్యాఖ్యలు చేయడాన్ని బట్టి వారి మానసిక స్థితి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ రెడ్డి అండ్ కో ఇలాంటి చేష్టలు మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో కూడా తిరిగే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని రాజేష్, ఆర్‌వీ నారాయణ, మొవ్వ వేణు, పానకాల వెంకట మహాలక్ష్మి, మానం రవీంద్ర, లంకా మాధవి, మోపర్తి అవినాష్, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర

ఏటీ అగ్రహారం ప్రధాన రోడ్డును పూర్తి చేసిన ఘనత మాదే

- పశ్చిమ ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఏటీ అగ్రహారం ప్రధాన రోడ్డు పనులను పూర్తి చేసిన ఘనత తమదేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గుంటూరు 31వ డివిజన్ ఏటీ అగ్రహారం బోరింగ్ పంపు సెంటర్లో మంగళవారం ఆమె 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోందని ప్రజలు ఎన్డీయే కూటమి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు అనేక సమస్యలు గుర్తించామన్నారు. రోడ్లు, డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉండగా, నేడు వాటన్నిటిని పరిష్కరిస్తూ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని అన్నారు. ప్రథమంగా ఏటి అగ్రహారం ప్రజలు ప్రధాన రహదారి నిర్మాణ పనులు జరగకపోవడంతో గడిచిన ఐదేళ్లు నరకం చూశారని, తాము అధికారంలో వచ్చిన వెంటనే పనులు వేగవంతం చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వర్షాకాలంలో డ్రెయిన్‌లలో పూడిక పేరుకుపోవడంతో వరదలు వచ్చేవని, వాటన్నిటిని గుర్తించి సిల్టేషన్ పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, మల్లె ఈశ్వరరావు, దాసరి జ్యోతి, సాయి, దాసరి రమణ, దుర్గారావు, నాగ జ్యోతి, నషీదా షేక్, వినయ్ బాబు, రావి కృష్ణారావు, గొర్ల శ్రీనివాసరావు, సుభాని షేక్, మొక్కల శ్రీనివాసరావు, మరియన్న కొణతం, బండేల కృష్ణారావు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుతోనే పేదల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్థానిక మారుతినగర్‌లో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుస్తుం బాబు ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పీ4 స్ఫూర్తితో సామాజిక సేవలు చేసేందుకు దాతలు మరింతగా ముందుకురావాలని కోరారు. దాతలకు అన్ని విధాలుగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రుస్తుం బాబు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సవరణ బిల్లుతో పెన్షనర్లకు తీవ్ర నష్టం

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు(తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్‌కు చేసిన సవరణతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసనల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వాలిడేషన్ అమెండ్‌మెంట్‌ను నిలువరించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లే గాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. కార్యదర్శి జి ప్రభుదాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌లను విడుదల చేయాలని కోరారు. పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్స్‌కు అన్ని రైళ్లలో రాయితీలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో పెన్షనర్లకు ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డీఆర్వో ఖాజావలీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కే కృష్ణయ్య, సీహెచ్ మాధవరావు, ఇర్ఫాన్, బ్రహ్మం పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి : సీఐటీయూ

గుంటూరు(తూర్పు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కలుగజేసుకొని సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ గత ఆరు ఏళ్ల నుంచి జీతాలు పెంచకపోవటం అన్యాయమని అన్నారు. కార్మికుల సమస్యలపై ప్రకటనలు ఇస్తున్న ప్రభుత్వం ఎందుకని సమస్య పరిష్కరించలేదని నిలదీశారు. పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి సమ్మెలోకి దిగుతున్న నేపథ్యంలో ఇకనైన ప్రభుత్వం స్పందించి చర్చలు జరపాలని అన్నారు. సమావేశానికి కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, కే.అజయ్, చిష్టి, సలీం, ఎం.రాజేశ్వరరావు, బాబు, యశ్వంత్, బైరగాని శ్రీనివాసరావు, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై పెను భారం

గుంటూరు(తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపిందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. కొత్తపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలుగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన మంత్రి లోకేశ్ ఇప్పుడు ఆ మీటర్లను ఏర్పాటు చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేఖంగా బుధవారం మల్లయ్యలింగం భవన్లో వామపక్ష పార్టీల, ప్రజా సంఘాలతో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు పాల్గొన్నారు.



సీడ్ రోడ్డు పక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ కోసం ఏర్పాటు చేస్తున్న పైపులు

స్పీడందుకున్న.. రాజధాని నిర్మాణ పనులు

● సంవత్సరంలోనే అందుబాటులోకి ప్రధాన రహదారులు

తుళ్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులు స్పీడందుకున్నాయి. సంవత్సరంలోనే ప్రధాన రహదారులు అందుబాటులోకి వస్తాయని టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు కంపెనీలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి నగరం మాస్టర్ ప్లాన్ ప్రకారం 217 చదరపు కిలోమీటర్లుంటుంది. అందులో 360 కిలోమీటర్లు రహదారులుంటాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు. రైతుల ప్లాట్లలో రోడ్లు కాక ప్రధాన రహదారులు.. ఈస్ట్ నుంచి వెస్ట్ 16 రహదారులు .. నార్త్ నార్త్ నుంచి సౌత్‌కు 16 రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, తాగు నీటి సరఫరా వర్షపు నీరు నిర్వహణ, విద్యుత్ కేబుల్ ఏర్పాట్లు రోడ్ల వెంబడి జరుగుతున్నాయి. రహదారుల కింద స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి బెటర్ ప్యాకేజీ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసీయా అభివృద్ధి బ్యాంకు రాజధాని నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని నిర్మాణానికి భుజం కలుపుతాదని.. ప్రధాని మోదీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఇప్పటికే దాదాపు రూ.49 వేల కోట్ల విలువ కలిగిన నిర్మాణ పనులకు సీఆర్డీఏ పది కంపెనీలకు టెండర్లు కేటాయించింది.

నిర్మాణాలపైనే దృష్టి..

రెండవ విడత ల్యాండు పూలింగ్ విషయంపై హడావుడి వద్దని సీఎం చంద్రబాబు నాయుడు సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలిచ్చారు. రాజధాని నిర్మాణ పనులు వేగవంతంపై దృష్టి సారించాలని చెప్పినట్టు తెలిసింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ ఎప్పటికప్పుడు రాజధాని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ప్రధాన రహదారులు పూర్తి అయితే రాజధాని అమరావతి అభివృద్ధి 80శాతం జరిగినట్లేనని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని 150 నుంచి 165 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారుల నిర్మాణం జరుగుతోంది. అవసరమైతే ఇంకా పెంచుకోవాలంటే పక్కన స్థలం రిజర్వు చేసి ఉంచారు. ల్యాండు పూలింగ్‌లో రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాలలో 30 శాతం రహదారుల నిర్మాణానికి వాడుతున్నారు. ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి నిర్మాణానికి రోడ్డు వ్యవస్థే కీలకంగా ఉంది. రవాణా వ్యవస్థ సరిగా ఉంటే ఆ నగరం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ప్రపంచంలో కొన్ని మహా నగాలను పరిశీలిస్తే తెలుస్తుంది. సీఎం చంద్రబాబు నాయుడు పలు దేశాలు పర్యటించి రోడ్డు వ్యవస్థను అద్భుతంగా అమరావతిలో రూపొందించారు.



ఎన్ 14 రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ డెక్‌లు

విసిరితే..వికసిస్తాయి!

● విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ
● విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి
● ఇప్పటికే 60 వేల విత్తనాల సేకరణ
● రోటరీక్లబ్‌ల సహకారంతో విత్తన బ్యాంకుల ఆలోచన



విత్తనాలు సేకరిస్తున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, చిలకలూరిపేట)

పర్యావరణ పరిరక్షణ స్పృహ ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోంది. ప్రకృతిని కాపాడుకునేందుకు పర్యావరణ ప్రేమికులు విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తున్నారు. ఇందుకు అనువైన మార్గాల వైపు వారిని నడిపిస్తున్నారు. అందులో ముఖ్యంగా పచ్చదనం పెంపునకు విత్తన బంతుల తయారీ పద్ధతిని వారికి వివరిస్తున్నారు. ప్రత్యేకంగా సంరక్షణ అవసరం లేకుండా ప్రకృతి సిద్ధంగా త్వరగా పెరిగే మొక్కల విత్తనాలను సేకరిస్తున్నారు. వర్షాలు కురిసే ముందుగానే విత్తన బంతులను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు బాగా కురిసి నేల చల్లబడిన అనంతరం ఈ విత్తన బంతులను కందకాలు, గుట్టలు, కొండలు, సాగుకు పనికిరాని భూముల్లో విసిరేస్తారు. బంతుల్లో ఉన్న విత్తనాలు మట్టిలో కలిసిపోయి మెలకెత్తుతాయి.

సాధారణంగా విత్తనాల సేకరణ..

మన చుట్టూ ఉండే ప్రాంతాల్లోని చెట్ల కింద వాటి విత్తనాలు లభిస్తాయి. పార్కులు, రోడ్ల వెంబడి, మార్కెట్ యార్డులు, విద్యాసంస్థలు, ఖాళీ స్థలాలు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో చెట్లకిందపడి ఉండే విత్తనాలను ఆసక్తిగల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు సేకరిస్తున్నారు. అనంతరం వాటిని శుభ్రం చేసి ఆరబెట్టి.. ఎర్రమట్టి, వర్మీకంపోస్ట్ కలిపి సిద్ధంగా ఉంచుకుంటారు. ఖాళీ సమయాల్లో విత్తన బం తులను తయారు చేస్తున్నారు. ఒక బంతిలో రెండేసి చొప్పున విత్తనాలను పెట్టి.. ఆరబెడతారు. వర్షాలు కురిసి వాతావరణం అనుకూలంగా ఉన్న సమయాల్లో ఈ బంతులను నిర్దిష్ట ప్రదేశాల్లో చల్లుతారు. మొక్కలు మొలవని సందర్భాల్లో అవి మట్టిలో కలిసిపోయి బంతుల్లోని ఎరువు భూమిలో కలిసిపోతుంది.



దండా లక్ష్మీనారాయణ

చిలకలూరిపేటలో విశ్రాంత అధ్యాపకుడి కృషి..

చిలకలూరిపేటలోని కొన్ని విద్యా సంస్థల విద్యార్థులు, రోటేరియన్లు, విశ్రాంత అధ్యాపకులు విత్తన బంతుల తయారీకి సంసిద్ధమవుతున్నారు. రోటరీ క్లబ్ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు దండా లక్ష్మీనారాయణ స్వతహాగా పర్యావరణ ప్రేమికుడు. విత్తన బంతుల తయారీ కోసం.. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమాచారం సేకరించారు. పర్యావరణ ప్రేమికుడు, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సలహాదారు అంకారావుతో మాట్లాడి మరి కొన్ని విషయాలను తెలుసుకున్నారు. స్థానిక సీఆర్ కాలనీ వాకర్స్, గణపవరం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి విత్తనాల సేకరణ, విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు 45 మందితో కలిసి బస్సులో కోటప్పకొండకు వెళ్లి.. చుట్టూ ఉన్న చెట్ల కింద ఉన్న విత్తనాలను సేకరించారు. కొంతకాలంగా వివిధ చోట్ల వేప, తురాయి, రాగి, గానుగ, నేరేడు, నక్కెరు చెట్ల విత్తనాలను సేకరించారు. ఆయన ఇప్పటికే సుమారు 60 వేల విత్తనాలను సేకరించి స్థానిక రోటరీ క్లబ్‌లో ఉంచారు. ఈ వారంలో పలు విద్యాసంస్థల సహకారంతో సుమారు 30 వేల విత్తన బంతులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విద్యార్థులను చైతన్య పరిచి విత్తన బ్యాంకులను నెలకొల్పితే ప్రయోజనం ఉంటుందని, ఇందుకు రోటరీ క్లబ్‌ల సహకారంతో విద్యా సంస్థల్లో ప్రచారం చేసి అవగాహన కల్పించేందుకు.. ఆసక్తిగా ఉన్నట్లు ఆయన తెలిపారు.



విత్తనాల సేకరణకు కోటప్పకొండ వెళ్లిన విద్యార్థులు

రైతులకు చేరువయ్యేనా..!

● తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● రైతుల్లో అవగాహన లోపంతో సేవలు అంతంతమాత్రమే
● ఉచితంగా విత్తన, ఎరువు, పురుగుమందు పరీక్షలు
● నాణ్యతను గుర్తిస్తే పంటలను రక్షించుకునే అవకాశం
● మట్టి నమూనా పరీక్షలకు గుంటూరు పంపాల్సిందే



తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో అగ్రిటెస్టింగ్‌ల్యాబ్



ల్యాబ్ ద్వారా పరీక్షించిన విత్తనాలకు వచ్చిన మొలకలు

తెనాలి రూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ప్రధాన భూమిక పోషించేది విత్తన ఎంపిక. విత్తనం మంచిదైతే చీడపీడలు తట్టుకుని పంటలు సంమృద్ధిగా పండటంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. ఆరుగాలం శ్రమించిన రైతుకు తగిన ఫలితం దక్కుతుంది. విత్తన ఎంపికలో అధిక శాతం రైతులు విత్తన డీలర్లనే నమ్ముతారు. వారు చెప్పిన మాటలు విని..మంచి దిగుబడి వస్తాయన్న ఆశతో విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. వాస్తవానికి భూమిని అనుసరించి దానికి అనువైన విత్తనాన్నే ఎంపిక చేసుకోవాలి. కొందరు డీలర్లు ఈ విషయాన్ని విస్మరించి, తక్కువ ధరలకు కొనుగోలు చేసిన నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతుంటారు. ధర తక్కువని రైతులు కూడా రసీదులు పొందకుండా కల్తీ, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతుంటారు.

అగ్రి ల్యాబ్‌లతో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అగ్రి ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందు, ఎరువులను గుర్తించి.. రైతును నష్టపోకుండా చేయడమే లక్ష్యంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఈ ల్యాబ్‌లలో పరీక్షించి వాటి నాణ్యతను తెలుస్తారు. ఇందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పూర్తి ఉచితం గానే పరీక్షలు చేసి నాణ్యతను కేవలం 15 రోజుల్లోనే సిబ్బంది రైతులకు వెల్లడిస్తారు. సాగుకు ముందే రైతులు వారు ఎంపిక

చే సు

కున్న విత్త

నాల్లో కేజీ

వంతున శాంపిల్ తీసుకుని, ల్యాబ్ సిబ్బందిని సంప్రదించాలి. ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరు చెబితే పూర్తి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మొలక శాతం చెబుతారు. ఎరువులు, పురుగు మందుల వాడే విషయంలో కూడా తప్పనిసరిగా ల్యాబ్ సేవలు సద్వినియోగం చేసుకుంటే అన్నదాతలు కల్తీలకు ఆస్కారం లేకుండా మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

అవగాహన పెంచాలి

అగ్రి ల్యాబ్ ప్రారంభించిన నాటి నుంచి వీటి సేవలు పొందేవారు నామ మాత్రం గానే ఉన్నారు. ఖరీఫ్,

ఓ‌ బీ

సీజ

న్లలో వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలను రైతులు సాగుచేస్తుంటారు. సాగుకు ముందు వ్యవసాయశాఖ, ఇతర శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి, విత్తన పరీక్షలపై అవగాహన కల్పించడంలో ఆశించినంత ఫలితాలు సాధించలేకపోయారన్న ఆరోపణలున్నాయి.

భూసార పరీక్షలు అందుబాటులో లేవు

సాగు చేపట్టే ముందు.. భూసారం ప్రతి ఒక్క రైతు తెలుసుకోవాలి. సాగు ప్రారంభంలోనే మట్టి పరీక్షలు జరిపి, ఫలితాల ఆధారంగా పోషక లోపాలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవచ్చు. విత్తనం మంచిది ఎంచుకున్నా భూమిలో పోషకలోపాలు ఉంటే సకాలంలో ఎదుగుదల లేక దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. తెనాలి నియోజవర్గంలో మట్టి పరీక్షకంటూ ప్రత్యేక కేంద్రాలు లేవు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది.. పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి.. వారి భూముల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వాటిని గుంటూరు పంపి ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఇందుకు సమయం కూడా ఎక్కువగా ఉండటంతో సకాలంలో లోపాలు గుర్తించే అవకాశం లేకుంది. దీంతో రైతులు ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జింకు లోపం ఉన్న భూముల్లో పంటలు ఎదుగుదల తగ్గి రైతాంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి. మట్టి పరీక్షలపై ప్రభుత్వం దృష్టిపెట్టి ఈ సౌకర్యాన్ని అగ్రి ల్యాబ్ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఏడీఏల నిరీక్షణ

● పోస్టింగ్ కోసం నలుగురు ఎదురు చూపులు
● 40 రోజులు దాటినా అధికారుల కటాక్షం కరువే

గుంటూరు సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)ల భవిష్యత్తు ఏమిటో ఎవరికీ అంతు పట్టకుండా ఉంది. బదిలీల ప్రక్రియ అధికారికంగా ముగిసి 40 రోజులు దాటినా ఈ నలుగురు ఏడీఏ లకు ఇంకా పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఫలితంగా నలుగురు అధికారులు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. వినుకొండలో పనిచేస్తున్న బోయపాటి రవిబాబు మొన్నటి బదిలీల్లో సత్తెనపల్లి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు సత్తెనపల్లి వస్తుందన్న ఆశతో ఉండగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఆపేశారు. ఆయన అప్పటికే పనిచేస్తున్న వినుకొండకు మాత్రం రవి కుమార్‌ను ఏడీఏగా నియమించడంతో బోయపాటి రవిబాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో ఏడీఏ మస్తానమ్మ విషయంలో కూడా అదే జరిగింది. ఆమె నరసరావుపేటలో పనిచేస్తున్నారు. ఆమె స్థానంలో కేవీ శ్రీనివాసరావును నియమించారు. మస్తానమ్మకు మరో చోట పోస్టింగ్ వేసి రద్దు చేశారు. ప్రస్తుతం మస్తానమ్మ నరసరావుపేట జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. క్రోసూరు ఏడీఏ వి.హనుమంతురావు వేరే చోటికి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు కూడా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో పాత స్థానంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్న రమాదేవిని బాపట్ల రైతు శిక్షణా కేంద్రంలో తొలత నియమించారు. ఆ తర్వాత ఆ పోస్టింగ్ రద్దు చేశారు. ఇలా ఎందుకు పోస్టింగ్‌లు ఇచ్చారో.. ఎందుకు రద్దు చేశారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి వ్యవసాయ శాఖలో నెలకొంది.

సత్తెనపల్లిలో షాడో ఏడీఏ?

సత్తెనపల్లి ఏడీఏ నియామకం విషయంలో గత కొన్ని సంవత్సరాల నుంచి పెద్ద హై డ్రామా నడుస్తోంది. అక్కడకు ఎవరి నైనా నియమించినా రాకుండా అడ్డుకునే పరిస్థితి నెలకొంది. చివరికి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు ఇచ్చినా కూడా ఆ ఏడీఏ ను అక్కడ జాయిన్ కాకుండా అడ్డుకోవడం జరిగింది. ఆ స్థానంలో ఒక ఏఓ ఇంచార్జి బాధ్యతలు నిర్వహించడం వ్యవసాయ శాఖ లో అప్పటికీ ఇప్పటికీ చర్చనీయాంశమే. ప్రస్తుతం జరిగిన బదిలీ లలో మొదట సత్తెనపల్లి కి ఒక ఏడీఏ ను నియమించారు. తదుపరి ఇచ్చిన సవరణ ఉత్తర్వుల్లో మాత్రం ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. అక్కడ గతం లో మాదిరిగా ఎవరినైనా ఇంచార్జి గా నియమిస్తారా అన్న చర్చ జరుగుతుంది.

నాటి పాపం.. విద్యార్థులకు శాపం

● పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణంలో వైసీపీ జిమ్మిక్కులు..
● ఎమ్మెల్యే యరపతినేని పరిశీలనలో అసలు నిజం..
● మరో రెండున్నరేళ్ల వరకు పనులు కొనసాగే అవకాశం..
● ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్లు దాదాపుగా లేనట్లే..

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తూ రాష్ట్రంలో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మెడికల్ కళాశాల భవనాలను మంజూరు చేశారు. పిడుగురాళ్లలో 2021 మేలో ఆనాటి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాతో కలిపి మెడికల్ కళాశాల, హాస్పిటల్ భవనాలను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు మొదట్లోనే మందగించి ఆరు నెలలపాటు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఆ తరువాత కాస్త పనులు పుంజుకున్నా మూడేళ్ల వరకు నిదానంగా కొనసా



మెడికల్ కళాశాల భవనాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు (ఫైల్‌ఫొటో)

గుతూ వచ్చాయి. అనుకున్న గడువులోగా పని పూర్తికాక పోవడంతో.. మరికొంత గడువు కావాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం కోరింది. గత ఎన్నికల నాటికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.500 కోట్లలో సుమారు రూ.250 కోట్లనే ఖర్చు చేసిందే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన వాటిలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఫలితంగా గతేడాది మార్చి నాటికి మొత్తం పనుల్లో ఆసుపత్రి భవనాలు 70 శాతం, వైద్య కళాశాల భవనాలు 50 శాతం, విద్యార్థుల వసతి గృహాలు 40 శాతం కలిపి మొత్తంలో సుమారు 40 శాతం ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేశారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు మాత్రం 80 నుంచి 90 శాతం పనులు పూర్తిచేశామని గొప్పలు చెప్పుకుంటూ ఎన్నికల ముందు ఓ బ్లాక్‌కు రంగులు వేసి, మెడికల్ కళాశాలను ప్రారంభించినట్లు శిలాఫలకం వేయించారు.

యరపతినేని పర్యటనతో

కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాల పనులు ఎంతవరకు పూర్తయ్యాయని తెలుసుకునేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని గత నెల చివరి వారంలో మెడికల్ కళాశాల భవనాలను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 10శాతం పనులు పూర్తయ్యాయని, మొత్తం భవనాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మరో రెండున్నర సంవత్సరాలు పట్టే అవకాశం ఉంటుందని మెడికల్‌కళాశాల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాదికి అడ్మిషన్లు లేనట్లే..

కేంద్ర ప్రాయోజిత పథకం కింద కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరైనా వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వీలుగా పనులు పూర్తి కాలేదు. ఈ ఏడాది అడ్మిషన్లు పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జరగాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు నవంబరు నాటికి దరఖాస్తుచేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టు తరగతి గదులు, ఆసుపత్రిలో సౌకర్యాలు కూడా పూర్తి కావాల్సి ఉంది. వైసీపీ నేతలు 80 శాతానిపైగా పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లకు డోకా లేదని గొప్ప ప్రకటన ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. ఆనాటి పాలకుల పాపం, నిర్లక్ష్యం ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరిగేందుకు వీలులేకుండా పోయింది.

మూసివేత దిశగా మాచవరం రైల్వే స్టేషన్

● స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటు
● కేవలం ఏడు ప్యాసింజర్ రైళ్లే ఆగేది
● సౌకర్యాలు లేక నిరుపయోగంగా స్టేషన్
● అవరోధాలు అధిగమించేనా?



మాచవరం రైల్వే స్టేషన్ భవనం

పొన్నూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ అవరోధాలను అధిగమించలేకపోతోంది. ఈ రైల్వే స్టేషన్ స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడింది. అనేక దశాబ్దాల పాటు ఎంతో మందికి ప్రయాణ సౌకర్యం కల్పించిన మాచవరం రైల్వే స్టేషన్ క్రమేణ మూసివేత దిశగా సాగుతోంది. రైలు సర్వీసులు తగ్గిపోవడం, ప్యాసింజర్ రైళ్లకు ఆదరణ తగ్గిపోవడం, సమీపంలో నిడుబ్రోలు, బాపట్ల స్టేషన్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ సౌకర్యం ఉండటంతో ఈ స్టేషన్‌కు ప్రయాణికుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఆదాయంలేని స్టేషన్లపై రైల్వే శాఖ శీతకన్ను వేయడంతో స్టేషన్ ఆలనా పాలన చూసేవారు కరువయ్యారు. దీంతో ఈ స్టేషన్లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికుల సంఖ్య రోజుకు 100లోపే ఉండటంతో టికెట్ బుకింగ్ కార్యాలయంలో సైతం రైల్వేశాఖ అవుట్సోర్సింగ్‌కు అప్పగించి చేతులు దులుపుకుంది.

ఏడు సర్వీసులతో సరి...

గతంలో విజయవాడ - చెన్నై ప్రధాన రైలు మార్గంలో ఉన్న మాచవరం రైల్వే స్టేషన్‌లో ఈ మార్గం నుంచి ప్రయాణించే ప్రతి ప్యాసింజర్ రైలు ఆగేది. ప్యాసింజర్ రైళ్లన్నీ ఈ స్టేషన్లో ఆగటంతో పొన్నూరు, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం వంటి గ్రామీణ మండలాలలో ఉన్న పలు గ్రామాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలకు సాగించేవారు. విజయవాడ, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి వంటి సుదూర ప్రాంతాలకు కూడా రైలు సౌకర్యం ఉండడంతో ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగించుకునేవారు. క్రమేపీ రైల్వే శాఖ ప్యాసింజర్ రైళ్లను తగ్గించివేస్తుండటంతో ప్రయాణికులు తగ్గారు. ప్యాసింజర్ రైళ్ల లేకపోవడం ఈ స్టేషన్లో హాల్టుల సౌకర్యం లేకపోవడంతో స్టేషన్ వైపు ప్రయాణికులు రావడం తగ్గిపోయింది. అంతే కాకుండా సమీపంలో ఉన్న నిడుబ్రోలు, బాపట్ల రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు ఉండటంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఆ స్టేషన్లకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లడం ప్రారంభించారు. మాచవరం రైల్వే స్టేషన్లో కేవలం విజయవాడ, ఒంగోలు, గూడూరు ప్రాంతాల నడుమ రోజు వారి ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లు మాత్రమే రోజు ఆగుతున్నాయి.



స్టేషన్ లెవెల్‌లో ఉన్న ప్లాట్ ఫామ్

గ్రామాల నుంచి ఈ ప్రాంతాలకు రోజువారి పనులపై వెళ్లేవారు, షటిల్ సర్వీసులు చేసే ఉద్యోగులు మాత్రమే ఈ ప్యాసింజర్ రైళ్లను వినియోగించుకుంటున్నారు. ఈ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లకు హాల్టు సౌకర్యం మాచవరం స్టేషన్లో కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతుందని పలు గ్రామాల వాసులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల తిష్ట

మాచవరం రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. స్టేషన్ ఆదాయం తగ్గిపోవడంతో రైల్వే శాఖ ఈ స్టేషన్ వైపు దృష్టి సారించడంలేదు. దీంతో స్టేషనుకు వెళ్లే ప్రధాన మార్గం కూడా మట్టిరోడ్డుగా మారిపోయి స్టేషన్‌కు వెళ్లే మార్గమంతా పిచ్చిచెట్లు మొలిచి ఈ మార్గం చిట్టడవిని తలపిస్తోంది. స్టేషన్లో ఆలనా పాలన లేకపోవడంతో ప్లాట్‌ఫాంపై పిచ్చి మొక్కలు మొలిచాయి. ప్లాట్‌ఫాం కూడా లోలెవెల్‌లో ఉండడంతో ప్రయాణికులు రైలు ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే శాఖ రెండో ప్లాట్ ఫామ్ ఎత్తు పెంచినప్పటికి ఆ వైపు వెళ్లడానికి నిర్మించిన బ్రిడ్జి కూడా సరైన మార్గంలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్లో తాగునీరు లేకపోవడం, ప్రయాణికులు వేచి ఉండే షెడ్లు ఏర్పాటు చేయకపోవడం వంటి సమస్యలు ప్రయాణికుల రాకపోకలను తగ్గిస్తున్నాయి. అంతేకాకుండా రాత్రివేళ వీధి దీపాలు లేకపోవడంతో స్టేషన్ ప్రాంతం నిర్మానుష్యంగా మారిపోతోంది. దీంతో కొందరు స్టేషన్ వేదికగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రైల్వేశాఖ అవరోధాలు అన్నింటిని అధిగమించి స్టేషనుకు పునర్ వైభవం లభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ మాచవరం రైల్వే స్టేషన్ కనుమరుగైపోయే ప్రమాదం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న స్టేషన్ మార్గం



ఆలయశుద్ధి కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇతర అధికారులు

శాస్త్రోక్తంగా తిరుమలలో ఆలయశుద్ధి

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) శాస్త్రోక్తంగా జరిగింది. బుధవారం ఆణివార ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయశుద్ధి కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

19న శ్రీవారి సేవల అక్టోబరు కోటా విడుదల

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన అక్టోబరు నెలా లక్కీ డిప్ కోటాను టీటీడీ ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి కోసం భక్తులు 21వ తేదీ ఉదయం 10 గంటలకు వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ టికెట్లను విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. ఇక, 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి టోకెన్లు జారీ చేస్తారు. అలాగే 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలోని వసతి గదుల కోటాను విడుదల చేస్తారు.

'వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో భాగస్వామిగా ఏపీ

▸▸ సెప్టెంబరు 25 నుంచి 28 వరకు ఢిల్లీలో మెగా ఈవెంట్

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 25 నుంచి 28 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో ఏపీ భాగస్వామిగా పాల్గొంటుంది. ఈ మేరకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ముడి పదార్థాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, సహాయక మౌలిక సదుపాయాలను 'వరల్డ్ ఫుడ్ ఇండియా-2025'లో ప్రదర్శించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున సుమారు రూ.1.271 కోట్ల బడ్జెట్‌ను భరించడానికి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని నోడల్ ఏజెన్సీగా నియమించింది.

డిక్లరేషన్ ఇస్తే టీటీడీలో కొనసాగించే అంశంపై పరిశీలిస్తాం

▸▸ టీటీడీలో అన్యమత ఉద్యోగులకు బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ సూచన

తిరుమల, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'టీటీడీలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులకు ఓ ఆఫర్ ఇస్తున్నాం. ఏసు కావాలా..! వేంకటేశ్వరస్వామి కావాలా..? నిర్ణయం తీసుకోండి' అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'తిరిగి హిందూ మతాన్ని స్వీకరించి హిందూ దేవుళ్లను పూజిస్తామని డిక్లరేషన్ ఇస్తే మీ తప్పును మన్నించి టీటీడీలో కొనసాగించే అవకాశముందా? అనే అంశంపై రానున్న ధర్మకర్తల మండలి బోర్డులో చర్చించి పరిశీలన చేస్తాం. అన్యమత ఉద్యోగుల విషయంలో రాజీ పడేదే లేదు. చివరి అన్యమత ఉద్యోగిని తొలగించే వరకు చర్యలు తీసుకుంటాం' అని భానుప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

సీఎం ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రామకృష్ణ


అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది కాలంలో 21 సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఆయన పర్యటనల వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో స్పష్టమైన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విజయవాడలోని దాసరి భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

ఏపీఈఏపీ సెట్ జీవోను సవరించండి

ఏపీఈఏపీ సెట్ కోసం తీసుకువచ్చిన జీవోను సవరించాలని రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవో కారణంగా మెరిట్ విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో పదో తరగతి వరకు మన రాష్ట్రంలో చదివి, ఇంటర్ ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను నాన్ లోకల్ కింద పరిగణిస్తున్నారని రామకృష్ణ తెలిపారు. పదో తరగతి వరకు ఏపీలో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని ఆయన కోరారు.

అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్

▸▸ 18, 19 తేదీల్లో ఎస్ఆర్ఎం వర్సిటీ వేదికగా నిర్వహణ
▸▸ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పలు సంస్థల భాగస్వామ్యం
▸▸ సమ్మిట్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
▸▸ కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, గొట్టిపాటి నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్ కూడా హాజరు
▸▸ దక్షిణ భారతంలో తొలిసారి నిర్వహణ... పలు అంశాలపై చర్చ



గుంటూరు/విజయవాడ (లబ్బీపేట), జూలై 15(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 జరగనుంది. ఈనెల 18, 19 తేదీల్లో జరిగే సమ్మిట్‌కు నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదిక కానుంది. ఇందుకోసం చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమం నిర్వహణలో ఎస్ఆర్ఎం వర్సిటీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, ఎన్ఆర్ఈడీసీఏపీ, ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతి, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖలు భాగస్వామ్యం కానున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో మొట్టమొదటసారిగా జరుగుతున్న ఈ సమ్మిట్‌ను ఎన్‌టీపీసీ, భారత్ పెట్రోలియం, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సినర్జెన్ గ్రీన్ ఎనర్జీ, ఏసీఎంఈ, కేపీ, యమ్నా, ఈవీఆర్ఈఎన్ వంటి సంస్థలు స్పాన్సర్ చేయనున్నాయి. రెండు రోజులు జరిగే సమ్మిట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(రీసెర్చ్) డి.నారాయణ రావు తెలిపారు. సదస్సులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సారస్వత్‌లతో పాటు రాష్ట్ర సీఎస్ విజయానంద్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇక సమ్మిట్‌లోని టెక్నికల్ సెషన్స్‌లో పలు సమస్యలపై చర్చించనున్నారు. సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

అతి త్వరలో హైడ్రోజన్ కారు

విశాఖను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్షను నెరవేర్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న సదస్సుకు ఐఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని ఎస్ఆర్ఎం గ్రూప్ ఈడీ(రీసెర్చ్) ఆచార్య డి.నారాయణరావు చెప్పారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో తమ వర్సిటీలో ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తామని, హైడ్రోజన్ శక్తితో నడిచే కారును రూపొందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ ఎం.కమలాకరబాబు మాట్లాడుతూ, ఈ సదస్సుకు కార్పొరేషన్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో 160 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి జరగాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ప్రో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సతీష్‌కుమార్, సమ్మిట్ కన్వీనర్లు డాక్టర్ మారం పార్థసారథి, డాక్టర్ సుజిత్ కల్లూరి పాల్గొన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్‌కు కొత్త షెడ్యూలు

ఐసెట్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 16 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని పేర్కొంటూ ఉన్నత విద్యాశాఖ కొత్త షెడ్యూలు ప్రకటించింది. 22న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుంది. 25న సీట్లు కేటాయిస్తారు. 26 నుంచి 28 వరకు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలి.

మిట్స్‌కు డీమ్డ్ యూనివర్సిటీ హోదా

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(మిట్స్)కు డీమ్డ్ యూనివర్సిటీ హోదా లభించింది. ప్రస్తుతం ప్రైవేటు కాలేజీగా ఉన్న ఆ విద్యా సంస్థను డీమ్డ్ టూబి యూనివర్సిటీగా మారుస్తూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

ఏపీఈఆర్‌సీ సభ్యుని ఎంపిక దరఖాస్తు గడువు పెంపు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యుని నియామకం కోసం గడువును ఈ నెల 18వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ వరకు పొడిగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు ఇంధనశాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

విశాఖ నుంచి ముంబై, పోర్టు బ్లెయిర్‌కు కొత్త విమాన సర్వీస్‌లు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి ముంబై, పోర్టు బ్లెయిర్‌కు ఆగస్టు ఒకటో తేదీ నుంచి కొత్త విమాన సర్వీస్‌లు ప్రారంభం కానున్నాయని ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరేశ్‌కుమార్, విజయమోహన్ మంగళవారం తెలిపారు. ఎయిర్ ఇండియా విమానం ప్రతి రోజు ముంబైలో ఉదయం 7 గంటలకు బయలుదేరి 9.05 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరిగి ఇక్కడి నుంచి 9.40 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ముంబై వెళుతుంది. అలాగే విశాఖపట్నం నుంచి పోర్టు బ్లెయిర్‌కు ప్రతి సోమ, శుక్ర, శనివారాల్లో ఉదయం 8 గంటలకు విశాఖలో బయలుదేరి 10 గంటలకు పోర్టు బ్లెయిర్ చేరుతుంది. అక్కడ 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.25 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.

శ్రీశైలం జలాశయం గేట్లు మూసివేత

నంద్యాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గడంతో నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయం క్రస్ట్‌గేట్లను మంగళవారం మూసివేశారు. జూరాల నుంచి 22,497 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 28,448 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. దీంతో శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ ఉత్పాదన కింద 68,539 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 882.20 అడుగులు ఉండగా.. నీటి నిల్వ 200.1971 టీఎంసీలుగా ఉంది.

గోదావరికి మరింత తగ్గిన వరద

పోలవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి నీటి మట్టం మంగళవారం మరింత తగ్గింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 2,27,066 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేశారు. గోదావరి నీటిమట్టం తగ్గడంతో కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నుంచి బయటపడ్డాయి.

సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత అధికారిపై సీబీఐ కేసు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఎ.జగన్నాథప్రసాద్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో తిరుపతి డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు జగన్నాథప్రసాద్ ఆదాయానికి మించిన ఆస్తులు కూడగట్టారనే అభియోగంపై సీబీఐ అధికారులు ఈనెల 14న ఆయనతోపాటు బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.5.73 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

పీవీ భారత డెంగ్ జియావోపింగ్

ఆర్థిక సంస్కరణలతో దేశం రూపురేఖలను మార్చారు

▸▸ ఆయన రాజకీయ పరిపక్వతకు, సమతుల్యతకు ప్రతీక
▸▸ దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు.. తెలుగు జాతి గర్వించదగ్గ మేధావి
▸▸ విదేశీ పెట్టుబడులు ఆహ్వానించారు.. ఐటీ విప్లవానికి నాంది పలికారు
▸▸ ఢిల్లీలో సీఎం చంద్రబాబు పీవీ స్మారకోపన్యాసం



ఢిల్లీలో జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లైఫ్ అండ్ లెగసీ కార్యక్రమంలో భాగంగా చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశం రూపురేఖలు మార్చిన మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు.. ఒకప్పటి చైనా అధినేత డెంగ్ జియావోపింగ్ లాంటి నాయకుడని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. మంగళవారం ఢిల్లీలోని ప్రధానమంత్రి సంగ్రహాలయంలో ఆయన పీవీ స్మారకోపన్యాసం చేశారు. మైనారిటీ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కార్పొరేట్లు అందరినీ కలుపుకుని పోయి సమర్థ నాయకత్వాన్ని అందించిన పీవీ నిజమైన తెలుగుబిడ్డ అని చెప్పారు. హిందీ నేర్చుకోవడాన్ని వివాదాస్పదం చేస్తున్న ప్రస్తుత తరుణంలో 17 భాషలు తెలిసిన ఆయన దేశానికి మార్గదర్శకుడని కొనియాడారు. పీవీ ప్రారంభించిన సంస్కరణలను వాజపేయి కొనసాగించారని, 1995లో సీఎం అయిన తర్వాత తాను రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టానని గుర్తుచేశారు. లైసెన్స్ రాజ్‌ను అంతం చేసిన పీవీ సంస్కరణల ప్రభావాన్ని మనం నేడు అనుభవిస్తున్నామని తెలిపారు. పీవీ దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడని, రాజకీయ పరిపక్వతకు, సమతుల్యతకు ప్రతీక అని అన్నారు. భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని జీర్ణించుకున్న ఆయన మొత్తం తెలుగుజాతి గర్వించదగ్గ మేధావి అని, ఆయన జీవితం అందరికీ ప్రేరణ దాయకమని పేర్కొన్నారు. 1991లో అసాధారణమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న భారత్... బంగారాన్ని కూడా తాకట్టు పెట్టాల్సివచ్చిందని, అలాంటి పరిస్థితుల నుంచి పీవీ దేశాన్ని గట్టెక్కించారని, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించారని, ఐటీ విప్లవానికి నాంది పలికారని సీఎం గుర్తు చేశారు.

జనాభా ఒక వరం

భారత దేశానికి జనాభా ఒక వరమని, ఆర్థిక సంస్కరణలు, ఐటీ రంగంలో విజయాలు దేశాన్ని అగ్రగామిగా మార్చాయని చంద్రబాబు తెలిపారు. వాజపేయి హయాంలో జాతీయ రహదారి విధానాన్ని, అందులో తన పాత్రను ఆయన ఆసక్తికరంగా వివరించారు. దేశంలో అప్పట్లో రహదారులు అస్తవ్యస్తంగా, గుంతలతో ఉండేవని, తాను మలేసియా వెళ్లినప్పుడు అక్కడ సముద్రతీరంలో 8 లేన్ల రహదారుల్ని చూసిన తర్వాత వాజపేయికి వచ్చి వివరించానని చెప్పారు. వాజపేయి తన సూచనలను ఆమోదించడంతో నెల్లూరు- చెన్నై జాతీయ రహదారితో స్వర్ణ చతుర్భుజి ప్రారంభమైందని చెప్పారు. టెలికమ్యూనికేషన్ విధానంపై తాను సమర్పించిన కమిటీ నివేదిక తర్వాతే దేశంలో సెల్ ఫోన్ విప్లవం ప్రారంభమైందని, అందరికీ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో భార్యాభర్తలు ఒకరినొకరు చూడకుండా ఉండగలరు కానీ, సెల్‌ఫోన్ లేకుండా మాత్రం ఉండలేరని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. దేశాభిమానం, అంతర్జాతీయ గౌరవం, బలమైన విదేశాంగ సంబంధాలు ప్రధాని మోదీ సాధించిన విజయాలుగా పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందడం కాదు, ప్రతి పౌరుడూ, ప్రతి ప్రాంతం, ప్రతి రంగం సమానంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తెలిపారు. సమస్యల పరిష్కారం, నాయకత్వం కోసం ప్రపంచం ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, స్వర్ణాంధ్రప్రదేశ్ తన లక్ష్యాలని చంద్రబాబు ప్రకటించారు. ఆరోగ్యకరమైన, సుసంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా ఏపీని మారుస్తామని తెలిపారు. సమాజంలో అగ్రస్థానంలో ఉన్న పది శాతం సంపన్నులు అట్టడుగు స్థానంలో ఉన్న 10 శాతం పేదలకు చేయూతనివ్వాలని కోరారు. తన సంపదలో 75శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం చేస్తున్న బిల్ గేట్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పీవీ కుమారుడు ప్రభాకర్ రావు, మనుమడు సుభాశ్‌ను చంద్రబాబు ఈ సందర్భంగా సన్మానించారు. చంద్రబాబు ఆధునిక హైదరాబాద్ నిర్మాత అని, ఐటీ, టెలికమ్యూనికేషన్ల విప్లవానికి, జాతీయ స్వర్ణ చతుర్భుజికి కారకుడని ప్రధానమంత్రి సంగ్రహాలయ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి నృపేన్ మిశ్రా ప్రశంసించారు.



లోకేశ్ తన బైక్‌పై బాలికను గండికోటకు తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం



వైష్ణవి



రెండు గంటల తర్వాత లోకేశ్ ఒక్కడే బైక్‌పై గండికోట నుంచి బయటికి వస్తున్న దృశ్యం

బైక్‌పై తీసుకెళ్లాడు.. ఒంటరిగా తిరిగొచ్చాడు!

▸▸ గండికోటలో బాలిక దారుణ హత్య
▸▸ ముళ్లపొదల్లో ఇంటర్ విద్యార్థిని మృతదేహం
▸▸ పోలీసుల అదుపులో అనుమానితుడు లోకేశ్?

జమ్మలమడుగు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా ఎంతో ప్రత్యేకత ఉన్న గండికోటలో ఓ బాలిక దారుణ హత్యకు గురైంది. ఓ యువకుడు బైక్‌పై ఆమెను తీసుకెళ్లి, వచ్చేటప్పుడు ఒక్కడే రావడంతో అతడే చంపేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి జమ్మలమడుగు పోలీసులు, బాధితుల కథనం ఇలా ఉంది. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తికి చెందిన పసుపులేటి కొండయ్య, దస్తగిరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. వీరు పిల్లల చదువులకోసం ప్రొద్దుటూరు గాంధీరోడ్డులోని సాల్వకట్ట వీధిలో ఉంటున్నారు. వీరి కుమార్తె పసుపులేటి వైష్ణవి (17) ప్రొద్దుటూరులో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం కాలేజీకని ఇంటి నుంచి బయలుదేరింది. బాలిక కాలేజీకి రాలేదని అధ్యాపకులు వైష్ణవి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వెంటనే వారు కాలేజీకి వెళ్లి వైష్ణవి స్నేహితులను ఆరా తీశారు. గట్టిగా ప్రశ్నించగా.. గండికోటకు వెళ్లిందని కొందరు, కడపకు వెళ్లిందని కొందరు చెప్పారు. కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరులో సాయంత్రం వరకు వెతికి.. ఆచూకీ తెలియకపోవడంతో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం గండికోటలోని రంగనాథస్వామి ఆలయం వెనుక భాగంలోని ముళ్లపొదల్లో బాలిక మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, బాధితులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఆ మృతదేహం వైష్ణవిదిగా గుర్తించి, జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టి కొన్ని ఆధారాలు సేకరించింది.

వెంటపడిన వాడే చంపేశాడా?

గతంలో యర్రగుంట్ల మండలం హనుమనగుత్తికి చెందిన లోకేశ్ అనే యువకుడు ప్రేమ పేరుతో వైష్ణవి వెంటపడేవాడు. అతడిని బాలిక కుటుంబ సభ్యులు మందలించారని తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం వీరిద్దరూ కలసి ప్రొద్దుటూరు నుంచి ద్విచక్రవాహనంలో గండికోటకు వెళ్లారు. వీరిద్దరూ గండికోటలో గేటు వసూళ్లు చేసేచోట ఉన్న సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అక్కడకు చేరుకున్నారని గుర్తించారు. తిరిగి ఉదయం 10.47 గంటలకు లోకేశ్ ఒక్కడే ద్విచక్ర వాహనంపై గండికోట నుంచి బయటకు వచ్చినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. దీన్నిబట్టి లోకేశే వైష్ణవిని హత్య చేశాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై గండికోట హరిత హోటల్ వద్ద ఎస్పీ అశోక్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. పోస్టుమార్టం నివేదిక వస్తే కానీ ఏం జరిగిందో తెలీదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని చెప్పారు. ఇదిలా ఉంటే పోలీసులు లోకేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది. ఇతడు హనుమనగుత్తిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, జులాయిగా తిరుగుతుంటాడని సమాచారం.

గోదావరిలో దూకిన మహిళ

▸▸ కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో ఆత్మహత్యాయత్నం
▸▸ కాపాడిన పోలీసులు, బంధువులకు అప్పగింత

కొవ్వూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భర్త వదిలేశాడు.. ఉన్న ఒక్క కుమార్తెను ఎంతో ప్రేమగా పెంచింది. అయితే ఆ కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో తట్టుకోలేక ఒక మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన చిలకలపల్లి నాగమణికి శ్రీకాకుళం జిల్లా రాజాంకు చెందిన చిన్నారావుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పదేళ్ల కిందట భార్యాభర్తలు విడిపోయారు. అప్పటి నుంచి ఒక కుమార్తెను తీసుకుని దుద్దుకూరులో అమ్మగారింట్లో ఉంటోంది. మరో కుమార్తె తండ్రి వద్ద ఉంటుంది. అయితే ఇటీవల తన వద్ద ఉన్న కుమార్తె వైజాగ్‌కు చెందిన అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో నాగమణి మానసికంగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వచ్చిన నాగమణి ఆత్మహత్య చేసుకోవాలని రాత్రి 1 గంట నుంచి కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి చివరనున్న ఐరన్ గడ్డర్‌పై కూర్చుంది. ఆమెను గమనించిన రైల్వేగార్డులు అర్ధరాత్రి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పట్టణ సీఐ విశ్వం, పోలీస్, ఫైర్ సిబ్బందితో అర్ధరాత్రి 1:30 సమయానికి అక్కడికి చేరుకుని లైఫ్ జాకెట్లతో సిద్ధమయ్యారు. మంగళవారం ఉదయం 7:30 గంటల సమయంలో నాగమణి గోదావరిలో దూకేసింది. సిద్ధంగా ఉన్న పోలీసులు నాగమణిని కాపాడి, చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించారు.

ఫ్లిప్‌కార్ట్, ఇ-కార్ట్, మీషో గోడౌన్లపై బీఐఎస్ దాడులు

▸▸ 25 రకాల ఉత్పత్తులు స్వాధీనం

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలోని ముస్తాబాద్ గ్రామంలో ఉన్న ఫ్లిప్‌కార్ట్, ఈ-కార్ట్, మీషో వ్యాపార గోడౌన్లపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అధికారులు మంగళవారం దాడులు చేశారు. క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్స్ నిబంధనలను ఉల్లంఘించి విక్రయిస్తున్న 25 రకాల ప్రమాదకర ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. బీఐఎస్ సర్టిఫికేషన్, సీఆర్ఎస్ మార్క్‌లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వీటిని విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ ఉల్లంఘనలకు మూడేళ్ల వరకు జైలుశిక్ష, 2 నుంచి 10 లక్షల వరకు లేదా ఆయా వస్తువుల విలువకు 10 రెట్లు జరిమానా విధించవచ్చని బీఐఎస్ విజయవాడ డైరెక్టర్ ప్రేమ్ సజని పట్నాల తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం ● 16 జూలై 2025

జీన్స్ వేసుకుని నిద్రిస్తున్నారా..?

సౌకర్యవంతంగా ఉంటుందనే భావనతో ఇప్పుడు ప్రతిఒక్కరూ జీన్స్ ధరిస్తున్నారు. పని ఒత్తిడి వల్ల అలసిపోయి ఇంటికి వచ్చినప్పుడు, ప్రయాణాల్లో, బంధు మిత్రుల ఇళ్లకు వెళ్లినప్పుడు... ఇలా కొన్ని సందర్భాల్లో జీన్స్‌తోనే నిద్రపోవడం పరిపాటి అవుతోంది. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. జీన్స్ ధరించి నిద్రపోవడం వల్ల కలిగే నష్టాలు ఇవే...



- సాధారణంగా జీన్స్‌ని డెనిమ్ వస్త్రంతో తయారు చేస్తారు. ఇది చెమటను త్వరగా పీల్చుకోలేదు. ఇలా గంటలపాటు జీన్స్ ధరించి ఉండడం వల్ల జననేంద్రియాల వద్ద చెమట కారణంగా ఇన్ఫెక్షన్ సోకవచ్చు. దురద, దద్దుర్లు, చర్మం ఎరుపెక్కడం లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. అధికంగా చెమట పట్టే స్వభావం ఉన్నవారు జీన్స్ ఎక్కువగా ధరించకపోవడమే మంచిది.
- గాఢంగా నిద్రపోతున్నప్పుడు శరీర ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంటుంది. కానీ జీన్స్ ధరించినప్పుడు శరీరానికి గాలి తగలక వేడిగా అనిపిస్తుంది. అధికంగా చెమటపట్టి అసౌకర్యంగా ఉంటుంది. దీనితో నిద్రాభంగం అవుతుంది. అందుకే ఇంటికి రాగానే డ్రెస్ మార్చుకోవడం అలవాటు చేసుకోవాలి.
- జీన్స్ దుస్తులు బిగుతుగా ఉంటాయి. వాటిని ధరించినప్పుడు గర్భాశయం, పొత్తికడుపు, నడుము భాగాల మీద ఒత్తిడి పడుతుంది. రక్తప్రసరణ కూడా సరిగా జరగదు. దీంతో నడుంనొప్పి, కడుపు ఉబ్బరం, నెలసరి సమస్యలు వస్తాయి.
- జీన్స్ దుస్తులు చర్మాన్ని పట్టి ఉంచుతాయి. దీనివల్ల నడుము, మోకాళ్ల దగ్గర చర్మం ఒరుసుకుపోయి వాపులు వస్తాయి.
- జీన్స్ వేసుకుని పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ప్రభావితమవుతుంది. అజీర్తి, మలబద్ధకం రావచ్చు.
- కేవలం రాత్రిపూట మాత్రమే కాదు పగలు కూడా మరీ బిగుతుగా ఉండే జీన్స్ వేసుకోకూడదు. కాస్త వదులుగా ఉండేవి, కాటన్‌తో రూపొందించినవి ఎంపిక చేసుకోవడం మంచిది.



కరువును గెలిచి... ఒక్కటై నిలిచి..!

కరువును ఎదుర్కోవడం కోసం సంఘటితమైన మహిళలు చిన్న స్థాయిలో ప్రారంభించిన ముల్కనూరు మహిళా సహకార డెయిరీ... ఇప్పుడు 205 గ్రామాలకు చెందిన 23 వేల మంది సభ్యులతో రూ.125 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరింది. 20కి పైగా ఉత్పత్తులతో రాష్ట్ర స్థాయికి విస్తరించిన ఈ డెయిరీ గ్రామీణ మహిళాశక్తికి ప్రతీకగా నిలుస్తోంది.

పాతికేళ్ల క్రితం... 1999లో హనుమకొండ (అప్పటి వరంగల్) జిల్లాలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూరును, ఆ పరిసర ప్రాంతాలను తీవ్రమైన కరువు అతలాకుతలం చేసింది. ప్రజలు ఉపాధి కోసం వరంగల్‌కు వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ ఉన్న ఊర్లను వదిలి వెళ్లడానికి చాలామంది మహిళలు ఇష్టపడలేదు. ఈ నేపథ్యంలో... అక్కడక్కడ ఉన్న మహిళా సంఘాలు సంఘటితమయ్యాయి. ప్రతి ఇంట్లో గేదెలు ఉండడంతో పాల ఉత్పత్తులను జీవనోపాధిగా చేసుకోవాలని ముల్కనూరు, చంటయ్యపల్లి, రంగయ్యపల్లి గ్రామాలకు చెందిన మహిళలు నిర్ణయించుకున్నారు. 150 మంది మహిళలు కలిసి 2002లో 'ముల్కనూరు మహిళా సహకార డెయిరీ'ని ఏర్పాటు చేశారు.

3 వేల లీటర్లతో మొదలై...

మొదట్లో మూడు గ్రామాల నుంచి రోజుకు మూడు వేల లీటర్ల పాల సేకరణలో ఈ డెయిరీ ప్రస్థానం మొదలయింది. ఆ పాలను వరంగల్ నగరానికి, ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఆ పాల నాణ్యతపై వినియోగదారులకు నమ్మకం పెరిగింది. క్రమంగా వ్యాపారం కూడా పెరిగింది. దీంతో కొన్నేళ్ళ తరువాత ప్యాకెట్లలో పాల సరఫరా ద్వారా వ్యాపారాన్ని విస్తరించాలనే ఆలోచన కలిగింది. 25 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాల ఉత్పత్తుల ప్రాజెక్ట్ కోసం 2021లో ఢిల్లీలోని జాతీయ పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ)ను సంప్రదించారు. అయితే కనీసం లక్ష లీటర్ల సామర్థ్యం ఉంటేనే తాము డీపీఆర్ ఇస్తామని అధికారులు చెప్పారు. తాము గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మహిళా సంఘాల ప్రతినిధులమంటూ తమ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల గురించి సంఘం సభ్యులు చెప్పారు. దీంతో ఎన్‌డీడీబీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ముల్కనూరుకు వచ్చి, పాల ఉత్పత్తిని, మహిళల ఆసక్తిని గమనించారు. వారు ఇచ్చిన డీపీఆర్‌కు అనుకూలంగా పరిసర ప్రాంతాల్లో ఉండే 74 గ్రామాల నుంచి మహిళలను సంఘంలో చేర్చుకున్నారు. ముల్కనూరు సమీపంలో ఎనిమిది ఎకరాలను కొనుగోలు చేయడంతో పాటు ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన ఎక్విప్‌మెంట్ కోసం రూ.3 కోట్లు డిపాజిట్ చేశారు. ఇలా సభ్యులు తమ వాటా ధనంతో పాటు కొంత అప్పు చేసి మరీ ఈ డెయిరీకి గట్టి పునాది వేశారు. వారి కృషితో 2022 ఆగస్టు 15న ముల్కనూరు పాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. దీంతో క్రమక్రమంగా డెయిరీ విస్తరించింది.

అన్నింటా ఆసరాగా...

గత 23 ఏళ్ల కాలంలో... 205 గ్రామాలకు చెందిన 23,045 మంది ఈ డెయిరీలో సభ్యులుగా చేరారు. రోజుకు 90 వేల నుంచి లక్షా 10 వేల లీటర్లవరకూ పాలు సేకరిస్తున్నారు. డెయిరీ టర్నోవర్ రూ.125 కోట్లకు చేరింది. ప్రతి నెలా సభ్యులకు పాల బిల్లుల కింద రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకూ చెల్లిస్తున్నారు. డెయిరీలో ఉన్న 100 మంది ఉద్యోగులు ఇందులో సభ్యత్వం ఉన్న మహిళల పిల్లలే. మహిళా సభ్యుల భర్తలకు, కుటుంబ సభ్యులకు కూడా డెయిరీ అండగా నిలుస్తోంది. వివిధ అంశాల్లో సాయం చేస్తోంది. పశువులను పెంచుకోవాలనే ఆసక్తి ఉన్న మహిళలకు బ్యాంకు నుంచి రుణం ఇప్పించటంతో పాటు ఉచితంగా వైద్య చికిత్స కూడా డెయిరీ ద్వారానే అందిస్తున్నారు. అలాగే సగం ధరకు మందులు, పశువులకు ఉచితంగా బీమా, గ్రాసం అందిస్తూ... పశు సంపద పెరుగుదలను ప్రోత్సహిస్తున్నారు.



సంఘటిత శక్తికి నిదర్శనం...



ముల్కనూరు మహిళా సహకార డెయిరీ మహిళా రైతుల సంఘటిత శక్తికి నిదర్శనం. ఒక చిన్న గ్రామంలో మొదలైన పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని తెలంగాణ మొత్తం విస్తరిస్తున్నాం. ప్రస్తుతం పూర్వ వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో మా ఉత్పత్తులకు డిమాండ్ ఉంది. ఇటీవలే హైదరాబాద్‌లో బోడుప్పల్, అల్వాల్ ప్రాంతాల్లో అవుట్‌లెట్లను ఏర్పాటు చేశాం. మరో ఐదారు చోట్ల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. స్వచ్ఛమైన పాలతో పాల ప్యాకెట్లు, పెరుగు, మజ్జిగ, పన్నీరు, నెయ్యి, పాల పదార్థాలతో 20 రకాల స్వీట్లు, దూద్‌పేడ, మిల్క్ కేక్, బాసుంది, మ్యాంగో లస్సీ, స్వీట్ లస్సీ, బాదం పాలు, చాక్లెట్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. త్వరలోనే ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

- డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనుశ్రీ

జాతీయస్థాయిలో పురస్కారాలు

గ్రామీణ మహిళల నేతృత్వంలో విజయవంతంగా సాగుతున్న ఈ డెయిరీ సేవలను గుర్తించి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) 2012లో దీన్ని జాతీయ స్థాయి సహకార ఉత్తమ పురస్కారానికి ఎంపిక చేసింది. ఢిల్లీలో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని డెయిరీ ప్రతినిధులు అందుకున్నారు. అలాగే దేశంలో మహిళల నిర్వహణలోని మొదటి సహకార డెయిరీగా దీనికి గుర్తింపు లభించింది. జాతీయ పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) నుంచి 2017 ఉత్తమ సహకార డెయిరీగా జాతీయ అవార్డును కూడా అందుకుంది.

సారథ్యం మహిళలదే...

డెయిరీ సారథ్యం అంతా మహిళలదే. 205గ్రామాల్లో ప్రతి గ్రామంలో ఓ కమిటీని ఎన్నుకుంటారు. వాటికి ఇద్దరు ఉద్యోగులు ఉంటారు. ఈ 205 గ్రామాలను 12 బ్లాకులుగా విభజించారు. ఈ బ్లాకుల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళా సంఘాల అధ్యక్షులు కలిసి తమలో ఒకరిని డైరెక్టర్‌గా ఎన్నుకుంటారు. 12 బ్లాకులకు 12మంది డైరెక్టర్లను ఎన్నుకున్న తరువాత... వారిలో ఒకరిని అధ్యక్షురాలిగా ఎన్నుకుంటారు. ఎన్నిక ఏకగ్రీవం కాకపోతే అధ్యక్షులు, డైరెక్టర్ల ఎన్నికకు ఓటింగ్ జరుగుతుంది. అధ్యక్షురాలి పదవీకాలం నాలుగేళ్లు ఉంటుంది. అయితే తన గ్రామంలో ప్రతి ఏడాది అధ్యక్షురాలిగా ఎన్నిక కావటంతో పాటు తన బ్లాకులో డైరెక్టర్‌గా ఎన్నిక కావాల్సి ఉంది. అలాగైతేనే నాలుగేళ్లు అధ్యక్ష స్థానంలో ఉంటారు. లేదంటే మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తారు.

● తడుక రాజనారాయణ
ఫొటోలు: వీరగోని హరీష్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పాట రాసిన రామ్ పోతినేని




ఇప్పటి వరకు తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన యువతరం కథానాయకుడు రామ్ పోతినేని తొలిసారిగా గీత రచనలోనూ ప్రావీణ్యాన్ని చాటుకున్నారు. ఆయన హీరోగా మహేశ్ బాబు.పి దర్శకత్వంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో రామ్ పోతినేని సినిమా అంటే పిచ్చి ఉన్న కుర్రోడి పాత్రలో కనిపించబోతున్నారు. అంతేకాదు ఈ సినిమా కోసం రామ్ అద్భుతమైన పాటను రాశారు. ఈ పాటకు సంగీత ద్వయం వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఇప్పటి వరకూ అనిరుధ్ పాడిన పాటలన్నీ హిట్ అవడంతో ఈ పాటపై అంచనాలు పెరిగాయి. కాగా, ఈ సినిమాలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో...



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందించిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. మంతా కృష్ణచైతన్య కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తాజాగా ఈ సినిమాలోని పాటను మంద కృష్ణమాదిగ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అంబేద్కర్ అభిమానులంతా ఈ సినిమాను చూడాలి" అని కోరారు. మంతా కృష్ణచైతన్య మాట్లాడుతూ "అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా ఈ సినిమాను తీశాం" అని చెప్పారు.

ప్రేమలో రెండోసారి



రమణ సాకే, వనిత గౌడ జంటగా నటించిన 'ప్రేమలో రెండోసారి' చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ నిర్మాత సి.కల్యాణ్ విడుదల చేశారు. సత్య మార్క దర్శకత్వంలో సాకే నీరజ లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రం గురించి హీరో రమణ సాకే మాట్లాడుతూ 'నేటి యువతకు బాగా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా బాగా వచ్చింది. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగా దర్శకుడు రూపొందించారు' అని చెప్పారు. ఈ సినిమాను ఆదరించాలని నిర్మాత నీరజ లక్ష్మి ప్రేక్షకులను కోరారు.

ఎన్టీఆర్‌ను అలా చూపించాలనుకుంటున్నా

- నాగవంశీ



ఎన్టీఆర్, హృతిక్ నటించిన బాలీవుడ్ చిత్రం 'వార్ 2'ను తెలుగులో సూర్యదేవర నాగవంశీ విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రచారంలో భాగంగా, 'వార్ 2' గురించి, ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన నిర్మించనున్న చిత్రం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "వార్ 2'లో ఎన్టీఆర్ పరిచయ సన్నివేశం సినిమాకే హైలైట్. హృతిక్, ఆయన మధ్య వచ్చే ఆ పోరాట ఘట్టాన్ని చూసే తెలుగులో చిత్రాన్ని నేనే విడుదల చేయాలని నిర్ణయించుకున్నాను. హృతిక్, ఎన్టీఆర్ పాత్రలకు సమప్రాధాన్యం ఉంటుంది. 'రామాయణ'ను ప్రకటించిన తర్వాత దేశమంతా ఆ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుకుంది. త్రివిక్రమ్-ఎన్టీఆర్ సినిమాను 'రామాయణ' కంటే భారీ స్థాయిలో ప్రకటించాలనుకుంటున్నాం. త్రివిక్రమ్ చేస్తున్న మొదటి మైథలాజికల్ ఇది. సీనియర్ ఎన్టీఆర్‌ను రాముడిగా, కృష్ణుడిగా చూశారు. ఇప్పుడు తారక్‌ను నేను అలా చూపించనున్నాను. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితియార్థంలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్రివిక్రమ్-వెంకటేశ్ సినిమా ఆగస్టులో ప్రారంభమవుతుంది. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్ ప్రాజెక్ట్ పనులు మొదలవుతాయి" అని పేర్కొన్నారు.

ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నా

- జెనీలియా



'నా కెరీర్ ఆరంభం నుంచి ఎప్పటికప్పుడు కొత్త తరహా పాత్రలే చేస్తూ వచ్చాను. 'జూనియర్' చిత్రంలోనూ నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ తరహా పాత్రను నేను ఇప్పటివరకూ చేయలేదు. అందుకే ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని నటి జెనీలియా అన్నారు. గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ శుక్రవారం ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన జెనీలియా మీడియాతో ముచ్చటించారు.

- దర్శకుడు కథను, నా పాత్రను గురించి వవరించిన తీరు నాకు బాగా నచ్చింది. తప్పకుండా ఇలాంటి సినిమా చేయాలి అనిపించింది. కథలో నా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. భావోద్వేగాలను పలికించే తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.
- నేను ఇప్పటివరకూ చాలామంది కొత్తవారితో కలసి నటించాను. కిరీటిలో కొత్తగా ప్రయత్నించాలనే తపన ఎక్కువ. తను మంచి డాన్సర్. సినిమా కోసం ఆయన చాలా కష్టపడ్డారు. దేవిశ్రీప్రసాద్, సెంథిల్‌కుమార్‌తో పనిచేయడం పాత రోజుల్ని గుర్తు చేసింది. శ్రీలీలతో కలసి నటించడం బావుంది.
- జీవితం అన్నాక అన్నీ ఉండాలి. అందుకే కెరీర్ మంచి స్థాయిలో ఉన్నప్పుడే సినిమాలకు బ్రేక్ ఇచ్చి పెళ్లి చేసుకున్నాను. చిన్న పాత్రయినా ప్రేక్షకులకు గుర్తుండిపోవాలని కోరుకుంటాను. ఈ మధ్యన సినిమాలు చేయకపోయినా 'బొమ్మరిల్లు' హాసిని, 'హ్యాపీ'లో మధుమతి పాత్రలతోనే ప్రేక్షకులకు ఇప్పటికీ నన్ను గుర్తుంచుకోవడం సంతోషం కలిగిస్తోంది.

కర్ణాటకలో టికెట్ గరిష్ఠ ధర రూ.200



కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ ఏదైనా సరే టికెట్ గరిష్ఠ ధర(వినోదపు పన్ను కలిపి) రూ.200 దాటొద్దంటూ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధన కర్ణాటకలో విడుదలయ్యే అన్ని భాషల చిత్రాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ముసాయిదాపై అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు 15 రోజులు గడువు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆ తర్వాత ఫైనల్ జీవోను గెజిట్‌లో ప్రచురించి అమల్లోకి తీసుకొస్తామని స్పష్టం చేసింది. ప్రభుత్వ వ్యవహారంతో రాష్ట్రంలోని ఎగ్జిబిటర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కర్ణాటకలో ఇప్పటి వరకూ అమల్లో ఉన్న ఫ్లెక్సీ ప్రైసింగ్ పద్ధతిని ఉపయోగించుకొని బెంగళూరులోని కొన్ని మల్టీప్లెక్స్‌లు టికెట్ రేట్లను ఇష్టారాజ్యంగా పెంచేవి. ఇప్పుడు వారికి ఆ అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ ఎగ్జిబిటర్లు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు శాండిల్‌వుడ్‌లో టాక్ వినిపిస్తోంది. కొత్త జీవోతో బి, సి సెంటర్లలో సమస్య కాకపోవచ్చు. కానీ, బెంగళూరులో అధికంగా మల్టీప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిలో గరిష్ఠ టికెట్ ధర 200 రూపాయలే అంటే ఎగ్జిబిటర్లు జీర్ణించుకోవడం లేదు. కాగా, ప్రభుత్వ నిర్ణయం ఉన్నపళంగా తీసుకున్నదేమీ కాదని, 2025-26 బడ్జెట్‌లోనే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రస్తావించారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏది ఏమైనా సగటు ప్రేక్షకుడికి మాత్రం ఇది శుభవార్తే అని చెప్పవచ్చు.

రామాయణ బడ్జెట్.. అవతార్‌ను మించి!



భారతీయులు ఎంతగానో అభిమానించే ఇతిహాసం రామాయణం. ఇంతవరకూ ఎంతో మంది తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రామాయణ గాథను తెరకెక్కించారు. ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ఇప్పుడు మరో సారి దర్శకుడు నితిశ్ తివారీ 'అంతకుమించి' అనే రీతిలో, భారీ స్థాయిలో రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ప్రకటించిన రోజు నుంచే అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ సినిమా ప్రపంచ ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతి కలిగించాలని, నిర్మాణపరంగా రాజీ పడకూడదనీ నిర్మాత నమిత్ మల్హోత్రా తపన. 'రామాయణ' మొదటి భాగం రూ.900 కోట్లని, రెండు భాగాలకూ కలిపి రూ.1600 కోట్లు అవుతాయని ప్రచారం జరిగింది. అయితే తమ సినిమా బడ్జెట్ 'అంతకుమించి' అంటూ అసలు బడ్జెట్ రూ.4000 కోట్ల రూపాయలు అని అధికారంగా వెల్లడించి అందరినీ ఆశ్చర్య పరిచారు. భారతీయ సినిమా కనీవినీ ఎరుగని భారీ బడ్జెట్ అది! 'భారతీయ ఇతిహాస గ్రంథం రామాయణానికి దృశ్యరూపమివ్వాలన్న ఈ ప్రయాణం ఐదారేళ్ల క్రితం మొదలైంది. 'రామాయణ'ను తీయాలనుకుంటున్నప్పుడు దీని బడ్జెట్ విని అందరూ నన్ను పిచ్చోడనుకున్నారు. ఎందుకంటే ఈ సినిమా రెండు భాగాల బడ్జెట్ చిత్రీకరణ పూర్తయ్యే సమయానికి 500 మిలియన్ డాలర్లు (రూ.4000 కోట్లు) దాటిపోతుంది. ప్రపంచంలోనే అతిగొప్ప కథను అందరికీ అందించడానికి చేస్తున్న ప్రయత్నమిది. ప్రపంచమంతా చూడాల్సిన ఓ అతిపెద్ద చిత్రాన్ని హాలీవుడ్ చిత్రాలకు వెచ్చించే దాని కంటే తక్కువ ఖర్చుతోనే తీస్తున్నామన్న భావన నాకుంది" అని చెప్పారు.

పలు హాలీవుడ్ చిత్రాల కంటే ఎక్కువ



ఇప్పుడు ఈ బడ్జెట్ గురించి విన్న వారంతా 'వామ్మో ఓ భారతీయ సినిమాకు ఇంత బడ్జెట్టా' అని నోరెళ్లబెడుతున్నారు. ఇప్పటి వరకూ హాలీవుడ్ చిత్రాలనే వేల కోట్ల రూపాయలతో తీస్తున్నారు. 'అవతార్' సినిమా బడ్జెట్ 237 మిలియన్ డాలర్లు (రూ.2000 కోట్లు). 'అవెంజర్స్' తొలి రెండు భాగాలకు అయిన ఖర్చు 300 మిలియన్ డాలర్లు (రూ.2500 కోట్లు). మూడు, నాలుగు భాగాలకు కలిపి దాదాపు 700 మిలియన్ డాలర్లు (రూ.6000 కోట్లు). ఇక 'హాబిట్' ట్రయాలజీ బడ్జెట్ 623 మిలియన్ డాలర్లు (రూ.5500 కోట్లు). ప్రస్తుతానికి అవెంజర్స్ 3, 4, 'హాబిట్' ట్రయాలజీ చిత్రాలు మాత్రమే 'రామాయణ' బడ్జెట్ కంటే ఎక్కువ ఖర్చుతో నిర్మితమయ్యాయి.

ఆ మూడు భారతీయ చిత్రాల కంటే..

ఇప్పటివరకూ దేశంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రాలంటే 'కల్కి 2898 ఏడీ' (రూ.600 కోట్లు), 'ఆదిపురుష్' (రూ.550 కోట్లు), 'ఆర్‌ఆర్‌ఆర్' (రూ.500 కోట్లు) స్ఫురిస్తాయి. అయితే వీటన్నింటి బడ్జెట్ కలిపినా 'రామాయణ'లోని ఓ భాగానికి అయ్యే ఖర్చు కంటే తక్కువే. రెండు భాగాలుగా తెరకెక్కిన 'బాహుబలి' (రూ.430 కోట్లు) బడ్జెట్.. 'రామాయణ' కంటే పదిరెట్లు తక్కువగానే ఉండడం గమనార్హం. కాగా, ఈ చిత్రంలో రామునిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటించనున్నారు.

ఇలాంటి సినిమాలు చాలా అవసరం

- సీఎం రేవంత్ రెడ్డి



సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఆకాశ్ సాగర్ చోప్రా నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'శ్రీమద్ భాగవతం పార్ట్-1'. సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించే ఒక గొప్ప ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ చిత్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'తరం మారుతున్న ఈ సమయంలో 'శ్రీమద్ భాగవతం' లాంటి సినిమాలు చాలా అవసరం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. రాబోయే రోజుల్లో హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ చేసే స్థాయికి ఎదగాలని మా ఆకాంక్ష' అని అన్నారు. కాగా, ఈ సినిమా మొదటి భాగం 2026లో బహుళ భాషలలో విడుదల కానుంది.



మానసిక వైద్యశాలలో నూతన భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్.. పక్కన ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

ఆరోగ్య రంగం బలోపేతానికి కృషి

- సైకియాట్రీలో ఎమ్మెస్సీ, డిప్లమో కోర్సులు
- క్లినికల్ సైకాలజీలో 30 సీట్లతో ఎంఫిల్
- విమ్స్‌ను నిమ్స్ స్థాయికి తీసుకెళ్తా: మంత్రి సత్యకుమార్

విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు విశేషంగా కృషిచేస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చెప్పారు. పెదవాల్తేరులోని మానసిక వైద్యశాల ఆవరణలో రూ.29.7 కోట్లతో నిర్మించిన భవనాలను, భానోజీనగర్‌లో రూ.1.38 కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (యూపీహెచ్‌సీ)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీ విభాగంలో ఎమ్మెస్సీ లేదా డిప్లమో, క్లినికల్ సైకాలజీలో 30 సీట్లతో ఎంఫిల్ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. విమ్స్‌ను నిమ్స్ స్థాయికి తీసుకువెళతామన్నారు. దేశంలో ప్రతి లక్ష మందికి ముగ్గురు మానసిక వైద్యులు కావాల్సి ఉండగా, 0.7 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే విష్ణు సూచన మేరకు మానసిక వైద్యశాల పేరు మార్పుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ మానసిక వైద్యంలో నాణ్యత పెరగాలన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈహెచ్‌ఎస్ సమస్యలు పరిష్కరిస్తాం

- ఉద్యోగ సంఘాలతో ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో దినేష్‌కుమార్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఈహెచ్‌ఎస్ ద్వారా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో దినేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం ఈహెచ్‌ఎస్ మేనేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు, ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్, పీటీడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ తదితరులు ఉద్యోగుల సమస్యలను ఈ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హెల్త్ స్కీమ్ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామని హామీలే తప్ప 2013 నుంచి అమలుకు నోచుకోవడం లేదన్నారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, రిటైరైనవారికి ఈహెచ్‌ఎస్ కార్డు ఉపయోగపడటం లేదని చెప్పారు. ఈహెచ్‌ఎస్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో పునఃసమీక్షించి నగదు రహిత చికిత్స అందించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులనూ ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని రెండు నుంచి ఐదు లక్షలకు పెంచాలని కోరారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులకూ ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని ట్రస్ట్ సీఈవో హామీ ఇచ్చారు. సీఎస్ నేతృత్వంలో ఈహెచ్‌ఎస్ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగేలా చూస్తామన్నారు.

మాకూ 14% కాంట్రిబ్యూషన్ జమ చేయండి

- ఏపీసీపీఎస్‌ఈఏ డిమాండ్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్, ఎన్‌పీఎస్‌లో విధానంలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఆల్‌ఇండియా సర్వీసెస్ అధికారులకు ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ 10 శాతం నుంచి 14 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, అదేవిధంగా రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ అమలు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సతీష్, సీఎం.దాస్ డిమాండ్ చేశారు. లేదా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులకు కేంద్రం ఇచ్చిన మెమో నంబర్ 57 ప్రకారం వారికి పాతపెన్షన్ అమలు చేసిందని తెలిపారు. ఆ మెమో ప్రకారం రాష్ట్రంలో ఉన్న 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు మాత్రం ఇప్పటికీ ఓపీఎస్ అమలు చేయలేదని పేర్కొన్నారు. ఆ మెమో పరిధిలోకి వచ్చే సీపీఎస్ ఉద్యోగులకూ ఓపీఎస్ అమలు చేయాలని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థుల విద్య, ఆరోగ్య భద్రతల్లో రాజీపడం

- మిగిలిపోయిన గురుకులాలు, వసతి గృహాల సీట్లు భర్తీ చేయండి
- కొత్త హాస్టళ్ల భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
- సాంఘిక సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి డోలా

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రత అంశాల్లో కూటమి ప్రభుత్వం రాజీపడే ప్రసక్తేలేదని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలు, ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులు, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, ఎస్సీ కాంపోనెంట్, లిడ్‌క్యాప్ పైనా మంత్రి సమీక్షించారు. గురుకులాలు, వసతి గృహాల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ముందుగానే స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని సూచించారు. పీఎం అజయ్ కింద నిర్మిస్తున్న నూతన హాస్టళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, గురుకులాలు, హాస్టళ్లలో మరమ్మత్తుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పరిశుభ్రత పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, గ్రామ, వార్డ్ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ తప్పనిసరిగా గ్రామంలోని గురుకులం, సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేయాలన్నారు. అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబానికి సాంత్వన పథకంతో రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేశ్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి తదితరులు పాల్గొన్నారు.

క్యాప్టివ్ పోర్టుల రవాణా చార్జీలు ఖరారు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలోని క్యాప్టివ్ పోర్టుల నీటి రాయల్టీల చార్జీలను, సరుకు రవాణా చార్జీలను షెడ్యూల్ ఆఫ్ స్టాండర్డ్ (ఎస్‌ఓఎస్) మేరకు అమలు చేయాలని రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వును జారీ చేసింది. ఎరువులు మెట్రిక్ టన్నుకు రూ. 33, రాక్ ఫాస్ఫేట్ బ్యాగులు టన్నుకు రూ. 33, సిమెంట్ బ్యాగు టన్నుకు రూ. 26, బియ్యం, పంచదార టన్నుకు రూ. 33, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ క్యూబిక్ మీటరుకు రూ. 152 ఇలా వివిధ సరుకుల రవాణా చార్జీలను ఖరారు చేస్తూ మౌలిక సదుపాయాల కల్పనా శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎండ.. వడగాడ్పులతో జనం ఉక్కిరిబిక్కిరి

విశాఖపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం తీవ్రమైన ఎండ, వేడి వాతావరణం కొనసాగాయి. మధ్యాహ్నం సమయంలో వడగాడ్పులు వీచాయి. నరసాపురంలో అత్యధికంగా 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం కూడా కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల వేడి వాతావరణం కొనసాగనుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరోజు నుంచి వర్షాలు మొదలవుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 17 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో, 18 నుంచి ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.





కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశమైన టీడీపీ నేతలు జ్యోత్స్న, శబరి, లావు, పల్లా శ్రీనివాసరావు, కూన రవికుమార్, దగ్గుమళ్ల ప్రసాద్

ఒక్క ఓటరుకూ

అన్యాయం జరగొద్దు!

- జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి
- యూనిక్ ఓటరు ఐడెంటిటీతో నకిలీలకు చెక్
- కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ సూచనలు

అమరావతి/ఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఏ ఒక్క ఓటరుకు అన్యాయం జరగకుండా ఓటర్ల జాబితా సవరణలో న్యాయమైన, పారదర్శక విధానాలను అమలు చేయాలని టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానంలో సంస్కరణలు, ఓటర్ల జాబితా సవరణలపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్‌సింగ్ సంధు మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశానికి టీడీపీ తరఫున పల్లాతోపాటు ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, బైరెడ్డి శబరి, దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే కూన రవికుమార్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి టి.జ్యోత్స్న హాజరయ్యారు. పల్లా మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని, క్షేత్రస్థాయి అధికారుల నియామకంలో పారదర్శకతను పాటించాలని సూచించారు. బీఎల్‌వోలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.250 ప్రోత్సాహకాన్ని పెంచాలని కోరారు. నకిలీ ఓటర్లను తొలగించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలన్నారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబరు కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటరు ఐడెంటిటీని సృష్టించవచ్చని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో బూత్ స్థాయి ప్రతినిధులను అన్ని దశల్లో భాగస్వామ్యం చేయాలని కోరారు.

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) చేపట్టాలని ఎన్నికల సంఘానికి పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. 2029 వరకు ఎన్నికలు లేకపోవడంతో ఏపీలో త్వరలోనే ఎస్‌ఐఆర్ ప్రారంభించి, ఎన్నికలకు కనీసం 6 నెలల ముందు పూర్తి చేయాలని కోరారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.అపోహలకు తావులేకుండా సంస్కరణలు అమలు చేయాలన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలన్నారు.

ఎన్నికల సంఘానికి టీడీపీ సూచనలు

- ఓటర్ల జాబితాపై కాగ్ ఆధ్వర్యంలో ఏటా థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి.
- జాబితాలో తప్పులు సరిదిద్దేందుకు బూత్‌స్థాయి లేదా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.
- ఆధార్ సాయంతో నకిలీ ఎపిక్ నంబర్లను గుర్తించాలి.
- పునరావృతం కానీ ఎపిక్ నంబర్ల జారీని వేగవంతం చేయాలి.
- ఇంక్‌కు బదులు బయోమెట్రిక్ ధ్రువీకరణను అమలు చేయాలి.
- బూత్ స్థాయి ఏజెంట్లకు ముందుగా ముసాయిదా జాబితాలు ఇవ్వాలి
- జిల్లాల వారీగా ఓటర్ల చేర్పులు, తొలగింపుల డేటాను ఈసీఐ పోర్టల్‌లో ఉంచాలి.
- ఓటర్ల ఫిర్యాదులు, పరిష్కారాలను తెలుసుకునేందుకు రియల్‌టైం డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలి.
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈఆర్‌వోలు, జిల్లా ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలి. జరిమానాలను విధించాలి.
- ఎన్నికలపై ప్రభావం పడకుండా బీఎల్‌వోలు, ఈఆర్‌వోలను మార్చాలి.
- ఫిర్యాదులను పరిష్కారానికి రాష్ట్రస్థాయి అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి.
- వలసదారులు, గిరిజనులు, వృద్ధులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి.
- సంచారజాతులు ఓటు హక్కు కోల్పోకుండా ప్రాథమిక పత్రాలు అనుమతించాలి.
- ఓటర్ల జాబితాపై ప్రతి నెలా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి.

ఇచ్చంపల్లి నుంచి కాదు..
పోలవరం నుంచి కావేరి అనుసంధానం!

- ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ సూచన

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జాతీయ నదుల అనుసంధాన ప్రక్రియలో భాగంగా తెలంగాణలోని ఇచ్చంపల్లి నుంచి కర్ణాటకలోని కావేరి అనుసంధాన పథకానికి బదులు ఆంధ్రప్రదేశ్ జీవన రేఖ పోలవరం నుంచి గోదావరిని కావేరి నదికి అనుసంధానించాలని రాష్ట్ర జలవనరుల శాఖ సూచించింది. గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై మంగళవారం జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) గోదావరి పరివాహక రాష్ట్రాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఏపీ జల వనరుల శాఖ తరఫున అంతర్రాష్ట్ర నదీజలాల విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ధవళేశ్వరం-కావేరి అనుసంధానంపై చర్చ జరిగింది. ధవళేశ్వరం ఆనకట్ట చాలా పురాతనమైపోయిందని.. నదుల అనుసంధాన ప్రవాహ వేగాన్ని తట్టుకునే పరిస్థితిలో లేదని రాష్ట్రం వివరించింది. పైగా ఈ ప్రాంతంలో కాలువల తవ్వకం కోసం భూసేకరణ కష్ట సాధ్యమని కూడా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సమీపంలోనే ఉన్న పోలవరం ప్రాజెక్టు నుంచి కావేరికి అనుసంధానం చేపట్టాలని ప్రతిపాదించింది. తెలంగాణలోని ఇచ్చంపల్లి వద్ద గోదావరి జలాల్లో 300 టీఎంసీల లోటు ఉన్నందున.. అక్కడి నుంచి కావేరికి అనుసంధాన ప్రక్రియ చేపడితే కేంద్రం ఆశించిన ప్రయోజనాలు నెరవేరవని రాష్ట్రం అభిప్రాయపడింది. ఈ పథకాన్ని ఇచ్చంపల్లి నుంచి అమలు చేయాలంటే 147 టీఎంసీలు అవసరమని కేంద్రం ఈ భేటీలో వెల్లడించింది. ఇందులో సగం నీటిని వ్యవసాయానికి వినియోగించాల్సి ఉంటుందని తెలిపింది. ఛత్తీస్‌గఢ్ ఇప్పటిదాకా వినియోగించని 127 టీఎంసీల మిగులు జలాలను ఈ పథకం కోసం వాడతామని ప్రతిపాదించింది. అయితే.. కేంద్ర జల సంఘం గణాంకాలను పరిశీలిస్తే.. ఇచ్చంపల్లి-కావేరి అనుసంధానానికి 75 శాతం నికర జలాలు లేవని ఎన్‌డబ్ల్యూడీఏ తేల్చింది. ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్ తన వాటా 127 టీఎంసీలను పూర్తిగా వాడుకుంటే.. ఇప్పటికే ఇచ్చంపల్లి వద్ద గోదావరి జలాల్లో 300 టీఎంసీల లోటు ఉన్నందున.. ఇక్కడి నుంచి కావేరికి అనుసంధానం వీలు కాదని తెలిపింది. ఈ నేపథ్యంలో పోలవరం నుంచి కావేరికి నదుల అనుసంధానం చేపట్టాలని సుగుణాకరరావు బృందం ప్రతిపాదించింది. 2023లో జరిగిన సమావేశంలో.. గోదావరి అవార్డుకు లోబడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి జలాల్లో అధిక వాటా ఉన్నట్లు ఆమోద ముద్ర వేయడాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ తాజా భేటీలో గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో పోలవరం-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియను చేపట్టడమే మంచిదన్న ఆలోచనకు వచ్చింది. ఈ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

అమరజీవి ట్రస్టుకు అమరావతిలో స్థలం



అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక ట్రస్టుకు అమరావతిలో స్థలం కేటాయిస్తూ సీఆర్‌డీఏ ఆదేశాలిచ్చింది. సీఎం చంద్రబాబు హామీ మేరకు శాకమూరు పార్కులో 6.8 ఎకరాలు కేటాయించారు. మంత్రి నారాయణ చేతుల మీదుగా భూమి కేటాయింపు పత్రాలను అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు డూండీ రాకేశ్ స్వీకరించారు. 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంతో పాటు స్మృతి వనంను ట్రస్టు ఏర్పాటు చేయనుంది. మార్చి 2026లోగా స్మృతి వనం ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ ట్రస్టుకు సూచించారు.

అర్హత, శిక్షణ ఉంటేనే డిప్యుటేషన్

- పీఆర్, రెవెన్యూ, స్టేట్ ఆడిట్, సచివాలయ శాఖల వారికి మాత్రమే
- కొత్త మార్గదర్శకాలతో మున్సిపల్ శాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తగిన అర్హత, శిక్షణ ఉంటేనే ఇకపై మున్సిపల్ శాఖలో కమిషనర్, అడిషనల్ కమిషనర్‌గా పని చేసేందుకు అవకాశం ఇస్తారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీటి ప్రకారం.. పట్టణ పాలన, సమస్యలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉన్న సంబంధిత మున్సిపల్ సంస్థ గ్రేడ్‌కు అనుగుణంగా జీతభత్యాలు పొందే అధికారులు మాత్రమే అర్హులవుతారు. పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, డిప్యూటీ సీఈవోలు, జిల్లా పరిషత్ సీఈవోలను వివిధ గ్రేడ్‌ల మున్సిపాలిటీలకు నియమిస్తారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, స్టేట్ ఆడిట్ శాఖ నుంచి అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు, జిల్లా ఆడిట్ ఆఫీసర్లు, సచివాలయ శాఖ నుంచి సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చే అధికారులకు ప్రొబేషన్, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసి, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. విజిలెన్స్ క్లియరెన్స్, మాతృ శాఖ అనుమతి ఉండాలి. డిప్యుటేషన్‌పై వచ్చేవారికి శాఖాపరమైన శిక్షణ ఇస్తారు.

పెళ్లే వ్యాపారం!



- డబ్బు కోసం 11 మందిని పెళ్లాడిన యువతి
- 'తాజా వరుడి' ఆత్మహత్యతో వెలుగులోకి..

చెన్నై, జూలై 15(ఆంధ్రజ్యోతి): వివాహ బంధాన్ని వ్యాపారంగా మార్చుకుందో యువతి!. నగలు, నగదు కోసం ఏకంగా 11 మందిని పెళ్లి చేసుకుంది. ఈమె పెళ్లి చేసుకుని మోసగించిందన్న మనస్తాపంతో తాజా వరుడు ఆత్మహత్యకు పాల్పడడంతో ఈ పెళ్లిళ్ల గుట్టు వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులో నామక్కల్ జిల్లాకు చెందిన శివషణ్ముగం (37).. భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా తన తల్లితో కలిసి ఉంటున్నాడు. రెండో వివాహం కోసం పెళ్లిళ్ల బ్రోకర్లు తమిళ్ సెల్వి (45), కస్తూరి (38), ముత్తులక్ష్మి (45), వేల్ మురుగన్ (55), నారాయణన్ (56)లను సంప్రదించగా, వారంతా కలిసి మదురైకు చెందిన జ్యోతి అలియాస్ జ్యోతిలక్ష్మి (23)ని దీప అనే వధువుగా చూపించారు. పెళ్లి కుదిర్చితే రూ.4 లక్షలు కమిషన్ ఇచ్చేలా శివషణ్ముగంతో ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.1.20 లక్షలు పుచ్చుకున్నారు. ఈ నెల 7న ఓ ఆలయంలో వివాహం జరిపించారు. తర్వాత భార్యను తీసుకుని శివషణ్ముగం తన ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు దీప నగలు, నగదు, వెండి వస్తువులతో ఉడాయించింది. కంగుతిన్న వరుడు.. దీప, మధ్యవర్తులకు ఫోన్ చేయగా, వారి మొబైల్ ఫోన్లు స్విచాఫ్ చేసి ఉన్నాయి. దీంతో మోసపోయానని తెలుసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రూ.30 వేల నగదు కోసం దీప ఈ పెళ్లికి అంగీకరించినట్టు తేలింది. దీపతో పాటు ఈ కేసుతో సంబంధం ఉన్న ఐదుగురు బ్రోకర్లను పోలీసులు అరెస్టు చేశారు. గతంలో ఇదే విధంగా 10 మందిని పెళ్లి చేసుకుని మోసగించినట్లు విచారణలో దీప వెల్లడించింది.

23 రోజులు.. 2 పెళ్లిళ్లు!

విజయవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏడడుగులు, మూడు ముళ్లు.. ఇది పెళ్లి సంప్రదాయం! 23 రోజులు, ఆరు ముడులు, 14 అడుగులు.. ఇది 'ఆమె' సంప్రదాయం!! ఈవెంట్ నిర్వాహకురాలిగా పనిచేస్తూ ప్రముఖులకు గాలం వేస్తున్న ఓ మాయలేడి చేసిన ఘనకార్యాలు నెమ్మదిగా వెలుగులోకి వస్తున్నాయి. గత నెల 5న ఓ వ్యక్తిని సింహాచలంలో హిందూ సంప్రదాయం ప్రకారం ఆమె వివాహం చేసుకుంది. తర్వాత 23 రోజులకు అంటే.. గత 27న బెజవాడ దుర్గ గుడిలో మరో వివాహం చేసుకుంది. మొదటిసారి పెళ్లాడిన వ్యక్తికి అప్పటికే వివాహమైంది. అతడి మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ 'ఈవెంట్' వెనుక ఉన్న చీకటి కోణాలు బయటకొస్తున్నాయి. సదరు కిలేడీ ఇచ్చిన ఝలక్‌లతో షాక్‌లో ఉన్న బాధితులు ఇప్పుడు బయటకు వస్తున్నారు. ఎక్కడైనా ఈవెంట్ నిర్వహిస్తే చాలు.. అందులో ప్రముఖులు కనిపించగానే వారితో ఆమె పరిచయాలు పెంచుకుంటుంది. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖలో పనిచేసిన ఓ ఉన్నతాధికారిని అడ్డుపెట్టుకుని.. తనకు శత్రువులుగా భావించిన యువతులపై ప్రతీకారాలు తీర్చుకున్నట్టు సమాచారం. కొంతమంది యువతులతో ఒక గ్రూపును నిర్వహిస్తూ తరకూ బెజవాడలో వివిధ పబ్‌లకు వెళ్తూ..వ్యవహారాలు నడుపుతోంది. పబ్‌లో జరిగిన ఒక కేసు విషయంలో కృష్ణలంక పోలీసులు ఆమెను స్టేషన్‌కు పిలిపించారు. ఆ సమయంలోనే ఆమె రెండు పెళ్లిళ్ల వ్యవహారాన్ని గుర్తించారు.

రేపు హంద్రీ-నీవాకు నీరు

- స్వయంగా విడుదల చేయనున్న సీఎం
- మల్యాల ఎత్తిపోతల నుంచి 2 పంపుల ద్వారా హంద్రీ-నీవా కాలువకు నీరు విడుదల

నంద్యాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మూడు ఉమ్మడి రాయలసీమ జిల్లాలకు నీరందరించే హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో మల్యాల ఎత్తిపోతల నుంచి నీటి విడుదలకు సీఎం చంద్రబాబు గురువారం నంద్యాల జిల్లాకు రానున్నారు. ఈ నెల 8న శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తేందుకు శ్రీశైలం పర్యటనకు వచ్చినప్పుడు.. సీమ జిల్లాలకు నెలాఖరుకల్లా కృష్ణా జలాలను తరలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నీరు విడుదల చేయనున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా గురువారం ఉదయం 11 గంటలకు కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టరులో నంద్యాల జిల్లా నందికొట్కూరు వస్తారు. ఆ తర్వాత మల్యాల ఎత్తిపోతల నుంచి రెండు పంపుల ద్వారా హంద్రీ-నీవా కాలువలోకి 700 క్యూసెక్కులు విడుదల చేస్తారు. రాయలసీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.2,647 కోట్లతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను చేపట్టిన విషయం తెలిసిందే. వీటిలో 80% పనులు పూర్తయ్యాయి. ఇంకోవైపు.. శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. 200 టీఎంసీలకుపైగా నీటి నిల్వలు చేరాయి. గతంలో ఎన్నడూలేని విధంగా జూన్‌లోనే వరద నీరు చేరడంతో జలవనరుల శాఖ అధికారులు నీటి విడుదల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత ఏడాది ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీరు విడుదల చేయగా.. ఈ ఏడాది మాత్రం సీఎం స్వయంగా వచ్చి నెల రోజుల ముందే విడుదల చేస్తుండడంతో సీమ రైతుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. తొలుత జలహారతి ఇచ్చాక ఎత్తిపోతల నుంచి ఆయన నీటిని విడుదల చేస్తారు. తర్వాత రైతులతో సమావేశం కానున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో నంద్యాల జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. 10 రోజుల వ్యవధిలో సీఎం రెండోసారి జిల్లా పర్యటనకు వస్తుండడం గమనార్హం.

'ఫోన్ ట్యాపింగ్'లో లిక్కర్ స్కామ్ తీగ!

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి వస్తూ శంషాబాద్‌లో సిట్ అధికారులకు దొరికిపోయారు. లిక్కర్ స్కామ్ కేసులో నిందితులు కిరణ్‌కుమార్, చాణక్య దుబాయ్‌లోని శ్రవణ్‌రావుకు చెందిన ఫ్లాట్‌లో తల దాచుకున్నట్టు తెలిసింది. శ్రవణ్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు. లిక్కర్ స్కామ్ బయటపడిన తర్వాతే 29 సార్లు కిరణ్‌కుమార్ దుబాయ్‌కు వెళ్లి వచ్చారని చెబుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే..శ్రవణ్‌రావు కుటుంబసభ్యులకు దుబాయ్‌లో అత్యంత ఖరీదైన ఫ్లాట్ ఉంది. దాని అద్దె నెలకు సుమారు రూ.5 లక్షలు వస్తుంది. కానీ... శ్రవణ్‌రావు కొంతకాలంగా ఆ ఫ్లాట్‌ను అద్దెకు ఇవ్వలేదు. ఆ ఫ్లాట్‌లోనే మద్యం కుంభకోణం కేసులో నిందితులు కిరణ్‌కుమార్, చాణక్యతోపాటు మరికొందరు ఉంటున్నట్లు తాజా సమాచారం. మద్యం కుంభకోణంపై విచారణ ప్రారంభమైనకాలం నుంచి, అంటే సుమారు 2024 డిసెంబరు నుంచి, ఆ కేసులోని కొందరు నిందితులకు ఆ ఫ్లాటే ఆవాసంగా మారింది. శ్రవణ్‌రావుకు మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి మధ్య సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని చెబుతున్నారు. దానివల్లే లిక్కర్ నిందితులకు శ్రవణ్ కుమార్ తన ఫ్లాట్‌లో ఆశ్రయం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరి మధ్య ఇంకా ఏవైనా ఇతర లావాదేవీలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. కాగా దుబాయ్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో శ్రవణ్ రావు ఫ్లాట్ ఎలా కొనుగోలు చేశారు, ఏపీ లిక్కర్ స్కాం డబ్బులు ఏమైనా చేతులు మారాయా అని మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరా తీస్తోంది.

దుబాయ్‌కు హవాలా..

గత ప్రభుత్వ హయాంలో ప్రముఖ మద్యం బ్రాండ్లను నిలిపివేసి, తక్కువ పేరున్న బ్రాండ్లను ప్రోత్సహించడంలో రూ. 3,200 కోట్ల స్కామ్ జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో నిగ్గు తేల్చింది. అయితే ఈ స్కాంకు సంబంధించిన కథ మొత్తం దుబాయ్ కేంద్రంగానే నడిచినట్లు తెలుస్తోంది. రూ.కోట్ల లిక్కర్ స్కామ్ నిధులను హవాలా ఏజెంట్ల ద్వారా తరలించినట్లు సిట్ గుర్తించింది. దుబాయ్ లింకుల్ని పూర్తి స్థాయిలో విశ్లేషించడంపై అటు ఈడీ, ఇటు సిట్ దృష్టి సారించాయి.

లిక్కర్ మనీతో భూముల కొనుగోలు

లిక్కర్ కుంభకోణంతో సంపాదించిన వేల కోట్ల రూపాయల్ని తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. రాజ్ కసిరెడ్డి హైదరాబాద్ సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లో ఏకంగా రూ. 150 కోట్లతో 90 ఎకరాలు భూమి కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. మనీ రూటింగ్‌లో భాగంగా లిక్కర్ స్కాంలో సంపాదించిన మొత్తంతో భూములు కొని, ఆ భూముల్ని మరింత ఎక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయించినట్లు తేలింది. 90 ఎకరాల్లో 60 ఎకరాలు విక్రయించారు. మిగిలిన 30 ఎకరాలు రాజ్ కసిరెడ్డికి సంబంధించిన సంస్థల పేర్లతో ఉన్నట్లు సిట్ కనుగొంది. అసలు భూములు ఎలా కొనుగోలు చేశారు ? విక్రయంతో వచ్చిన సొమ్ము ఎక్కడికి దారిమళ్లించారు ? అనే కోణంలో సిట్ ఆరా తీస్తుంది. హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలోనూ రాజ్ కెసిరెడ్డి స్థలం కొనుగోలు చేసినట్లు తేలింది. కాగా ఏపీ లిక్కర్ స్కాం డబ్బులతో కొనుగోలు చేసిన ఆస్తుల్ని దర్యాప్తులో భాగంగా జప్తు చేయడంపై సిట్ దృష్టి సారించింది.

డిగ్రీలో సింగిల్ మేజరే

- 126 క్రెడిట్లతో కొత్త ఫ్రేమ్‌వర్క్
- దాదాపు గతం మాదిరే కొత్త పాలసీ.. వ్యతిరేకత

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సులపై ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో ప్రవేశ పెట్టిన సింగిల్ మేజర్ డిగ్రీనే కొనసాగిస్తూ కొత్త పాలసీ తీసుకొచ్చింది. ఉన్నత విద్యాశాఖ కొత్త క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ రూపొందించింది. ప్రస్తుతం మూడేళ్ల డిగ్రీలో 136 క్రెడిట్లు ఉండగా, కొత్త సింగిల్ మేజర్‌లో 126 ఉంటాయి. మేజర్ కోర్ సబ్జెక్టుకు 44, మేజర్ ఎలక్టివ్ సబ్జెక్టుకు 16 కలిపి మొత్తం 60 క్రెడిట్లతో మేజర్ సబ్జెక్టు ఉంటుంది. 24 క్రెడిట్లతో మైనర్ సబ్జెక్టు ఉంటుంది. మల్టీ డిసిప్లినరీ కోర్సులకు 6, ఎబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సుల(భాషా)కు 18, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సులకు 12, వాల్యూ యాడెడ్ కోర్సులకు 2, ఇంటర్న్‌షిప్‌కు 4 క్రెడిట్లు కేటాయించింది. మూడేళ్ల డిగ్రీ మొత్తం 126 క్రెడిట్లతో పూర్తమవుతుంది. అయితే, ప్రస్తుత విధానంలో నాలుగో ఏడాది డిగ్రీ చదివితే 160 క్రెడిట్లు వస్తాయి. కాగా.. మేజర్, మైనర్ సబ్జెక్టు, మల్టీ డిసిప్లినరీ, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్, వాల్యూ యాడెడ్ క్రెడిట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు.ప్రస్తుతం ఇంటర్న్‌షిప్‌కు 20 క్రెడిట్లు ఉంటే వాటిని 4కు తగ్గించింది. 4 క్రెడిట్లతో ఇంటర్న్‌షిప్ అంటే విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భాషా సబ్జెక్టులకు పెంపు

భాషా సబ్జెక్టులకు ప్రస్తుతం 12 క్రెడిట్లు ఉంటే వాటిని 18కి పెంచారు. సింగిల్ మేజర్ డిగ్రీ విధానంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సింగిల్ మేజర్ ప్రవేశ పెట్టింది. దీనివల్ల పలు కాలేజీల్లో అనేక కోర్సులు మాయమయ్యాయి. దీంతో డ్యూయెల్ మేజర్ తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. దీనిలో భాగంగా 150 క్రెడిట్లతో రెండు మేజర్ సబ్జెక్టులు ఉండేలా కొత్త ఫ్రేమ్‌వర్క్ రూపొందించి విద్యామండలి నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. కానీ ఉన్నతాధికారులు సింగిల్ మేజర్ కొనసాగించేలా మార్పులు చేశారు. విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సింగిల్ మేజర్‌ను వ్యతిరేకిస్తున్నారు.

కీచక లెక్చరర్లు


నరేంద్ర, సందీప్, అనూప్

- విద్యార్థినిపై ఇద్దరు అధ్యాపకుల అత్యాచారం
- ఆ వీడియోలతో వారి స్నేహితుడి బ్లాక్ మెయిలింగ్
- కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో దారుణం


బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్లు, వారి మిత్రుడు అత్యాచారానికి పాల్పడి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిదరెలో ఈ దారుణం జరిగింది. బాధితురాలు తల్లిదండ్రుల సాయంతో మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో నిందితులపై పోలీసులు చర్యలు చేపట్టారు. మూడబిదరెలోని ఓ ప్రతిష్ఠాత్మక కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ నరేంద్ర, బయాలజీ లెక్చరర్ సందీప్‌లతోపాటు వారి మిత్రుడు అనూప్‌ను మంగళవారం బెంగళూరు మారతహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫిజిక్స్ లెక్చరర్ నరేంద్ర బాధిత విద్యార్థినికి నోట్స్ ఇచ్చే విషయంలో సహకరించాడు. ఈ క్రమంలో ఫోన్ ద్వారా ఆమెతో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. తర్వాత విద్యార్థినిని మూడబిదరె నుంచి బెంగళూరు మారతహళ్లిలోని తన మిత్రుడు అనూప్ గదికి తీసుకువచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. కొన్ని రోజుల తర్వాత బయాలజీ లెక్చరర్ సందీప్ కూడా ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె వ్యతిరేకించడంతో నరేంద్రతో కలసి ఉన్న ఫొటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని బెదిరించాడు. అతను కూడా బాధితురాలిని అనూప్ గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. కొన్ని రోజుల తర్వాత అనూప్ కూడా.. నరేంద్ర, సందీప్‌లతో తన గదిలోకి వచ్చినప్పుడు రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని బయటపెడతానంటూ బాధితురాలిని బెదిరించి అనూప్ కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ముగ్గురి నుంచి వేధింపులు తీవ్రం కావడంతో బాధితురాలు విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సూచన మేరకు మారతహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

ప్రొఫెసర్ వేధింపులతో విద్యార్థిని ఆత్మాహుతి

- ఒడిసాలోని బాలాసోర్‌లో ఘటన
- నలుగురు సభ్యులతో యూజీసీ కమిటీ

న్యూఢిల్లీ, జూలై 15: ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తట్టుకోలేక బీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కాలేజీ క్యాంపస్‌లోనే ఆత్మాహుతికి పాల్పడ్డారు. ఒడిసాలోని బాలాసోర్‌లో ఉన్న ఫకీర్ మోహన్(అటానమస్) కాలేజీలో జరిగిందీ దారుణం. కాలేజీలోని విద్యా విభాగాధిపతి సమీరా కుమార్ సాహు తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు ఆరోపించారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో కాలేజీ క్యాంపస్‌లోనే శనివారం ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. బాధితురాలిని ఎయిమ్స్-భువనేశ్వర్‌కు తరలించగా సోమవారం రాత్రి మృతి చెందారు. ఘటనపై యూజీసీ స్పందించింది. వాస్తవాలు గుర్తించేందుకు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ ప్రొఫెసర్, యూజీసీ సభ్యుడు రాజ్‌కుమార్ మిట్టల్ నేతృత్వంలోని ఈ కమిటీలో యూజీసీ మాజీ సభ్యురాలు సుష్మా యాదవ్, గుజరాత్ యూనివర్సిటీ మాజీ వీసీ నీరజా గుప్తా, యూజీసీ సంయుక్త కార్యదర్శి అషిమా మంగ్లా సభ్యులుగా ఉన్నారు.

లోకం తీరు



అణు, జీవ, రసాయన

దాడులపైనా నిఘా!

- 6 రక్షణ వ్యవస్థలను నౌకాదళానికి అందించిన డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, జూలై 15: భారత నౌకాదళం అమ్ముల పొదిలో అణు, జీవ, రసాయన ప్రమాదాలను సైతం గుర్తించి, అరికట్టే వ్యవస్థలు వచ్చి చేరాయి. స్వదేశీ పరిజ్ఞానంతో అత్యంత ఆధునిక సాంకేతికతను వినియోగించి రూపొందించిన ఆరు రక్షణ వ్యవస్థలను నౌకాదళానికి డీఆర్‌డీవో అందించింది. వీటిలో అణు, జీవ, రసాయన రక్షణ వ్యవస్థలు ఉన్నాయని, ఇవి వ్యూహాత్మక జాతీయ భద్రతలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని డీఆర్‌డీవో వెల్లడించింది. అదేవిధంగా నౌకాదళ సిబ్బంది గుణాత్మక అవసరాలకు ఇవి ఎంతగానో తోడ్పడనున్నాయని తెలిపింది. ఈ వ్యవస్థలను నౌకాదళ ప్రధాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అడ్మిరల్ శ్రీరాం అముర్‌కు డీఆర్‌డీవో ఛైర్మన్, డీడీఆర్‌డీ సెక్రటరీలు అందించారు.

ఇవీ 6 వ్యవస్థలు

1) గామా రేడియేషన్ ఏరియల్ సర్వైవలెన్స్ సిస్టమ్(జీఆర్‌ఏఎస్‌ఎస్): తేలికపాటి గామా రేడియేషన్ మాడ్యూల్‌ను వినియోగించి రూపొందించిన ఈ వ్యవస్థ అణు స్థావరాలు, రేడియేషన్ ఉన్న ప్రాంతాల్లో సైతం వైమానిక రేడియలాజికల్ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.

2) ఎన్విరాన్‌మెంటల్ సర్వైవలెన్స్ వెహికల్(ఈఎస్‌వీ): సంభావ్య ప్రమాదకర వాతావరణాల్లో కూడా అణు, జీవ, రసాయన ఆయుధాలను, దాడులను గుర్తిస్తుంది.

3) వెహికల్ రేడియలాజికల్ కంటామినేషన్ మానిటరింగ్ సిస్టమ్(వీఆర్‌సీఎంఎస్): అణుకలుషిత, రేడియలాజికల్‌గా ప్రమాదకరమైన వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే వాహనాలు, సిబ్బందిపై రేడియేషన్ ప్రభావాన్ని గుర్తిస్తుంది. అదేవిధంగా సర్వే చేసేందుకు ఉపయోగపడుతుంది.

4) అండర్ వాటర్ గామా రేడియేషన్ మానిటరింగ్ సిస్టమ్(యూజీఆర్‌ఎంఎస్): నీటి అడుగున గామా రేడియేషన్ స్థాయిలను అంచనా వేసి, డేటా బేస్ స్టేషన్‌కు చేరవేస్తుంది. పోర్టులు, తీరప్రాంతాలు, నేవీ కార్యకలాపాల్లో భద్రతకు దోహదపడుతుంది.

5) డర్ట్ ఎక్స్‌ట్రాక్టర్ అండ్ క్రాస్ కంటామినేషన్ మానిటర్(డీఈసీసీఓఎం): ప్రమాదకర పదార్థాలను బదిలీ చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జీవ, రసాయన, రేడియాలజీ ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. పాదరక్షల నుంచి కూడా కలుషితాలను సంగ్రహిస్తుంది.

6) ఆర్గాన్ రేడియాక్టివిటీ డిటెక్షన్ సిస్టమ్(ఓఆర్‌డీఎస్): మానవ అవయవాలలో రేడియోధార్మికత స్థాయిలను గుర్తిస్తుంది.

క్యాన్సర్ సహా.. 71 ఔషధాల ధరల ఖరారు

న్యూఢిల్లీ, జూలై 15: క్యాన్సర్ సహా.. 71 రకాల ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో మెటాస్టాటిక్ రొమ్ము క్యాన్సర్, అలర్జీలు, మధుమేహం వంటి వ్యాధుల చికిత్సలకు వినియోగించే ఔషధాలున్నాయి. ఈ మేరకు జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల సంస్థ(ఎన్‌పీపీఏ) మంగళవారం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఫార్మసీల్లో ధరల పట్టీలను ప్రదర్శించాలని ఆ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. అందులో కొన్ని ముఖ్యమైన ఔషధాల ధరలు ఇలా ఉన్నాయి. రిలయెన్స్ లైఫ్ సైన్సెస్ తయారు చేసే ట్రాస్టుజుమాబ్ ఇంజెక్షన్ ధర ఒక్కో వైల్‌కి రూ.11,966గా ఉంది. దీన్ని మెటాస్టాటిక్ బ్రెస్ట్ క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ చికిత్సలో వినియోగిస్తారు. పెప్టిక్ అల్సర్ చికిత్సలో వాడే క్లారిత్రోమైసిన్, ఎసోమెప్రజోల్, అమోక్సిసిల్లిన్‌ల కాంబినేషన్ మాత్ర ధర(ఒక్కోటి)ను రూ.162.5గా నిర్ణయించారు. దీన్ని టోరెంట్ ఫార్మా కంపెనీ తయారు చేస్తుంది. లైఫ్ సేవింగ్‌లో భాగంగా వాడే సెఫ్ట్రియాక్సోన్, డిసోడియం ఎడిటేట్, సల్బాక్టామ్ కాంబినేషన్ల ఇంజెక్షన్ వైల్ ధరను రూ.626గా నిర్ణయించారు. ఇదే కంపోజిషన్‌తో వైటెకెమ్ కంపెనీ తయారు చేసే ఇన్ఫ్యూషన్ సొల్యూషన్ ఇంజెక్షన్ ధరను ప్రతి వైల్‌కి రూ.515.50గా ఖరారు చేశారు. మధుమేహ చికిత్సలో ఉపయోగించే.. సిటాగ్లిప్టిన్ కలిగి ఉన్న 25 రకాల ఔషధాల ధరలు, ఎంపాగ్లిఫ్లోజిన్ కలిగి ఉన్న ఇతర షుగర్ ఔషధాల ధరలను కూడా తాజా నోటిఫికేషన్‌లో నిర్ణయించారు.

సమోసా, జిలేబిలపై లేబుళ్లు వేయాలన్లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 15: దేశంలో ప్రసిద్ధ చిరుతిళ్లయిన సమోసా, జిలేబీ వంటి ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లు పెట్టాలని చెప్పలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వీధి వ్యాపారులు విక్రయించే చిరుతిళ్లను లక్ష్యంగా చేసుకొని ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదని మంగళవారం తెలిపింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేలా ప్రజల్ని ప్రోత్సహించడానికే ప్రభుత్వ ఆఫీసులు, స్కూళ్లు, ఇతర కార్యాలయాల్లో 'చక్కెర, నూనె బోర్డులు' ఏర్పాటు చేయాలని, రోజువారీ తీసుకునే ఆహార పదార్థాల్లో ఉండే కొవ్వు, చక్కెర శాతం వంటి సమాచారాన్ని డిజిటల్ బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించినట్లు పేర్కొంది.

తేజస్ యుద్ధ విమానాల తయారీలో ముందడుగు

బెంగళూరు, జూలై 15: తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే-1ఏ ఉత్పత్తిలో కీలక ముందడుగు పడింది. తేజస్ తయారీలో కీలకమైన ఎఫ్-404 ఇంజన్ల డెలివరీ మళ్లీ మొదలైంది. ఈ యుద్ధ విమానాలను తయారు చేస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) సంస్థ సుదీర్ఘ విరామం తర్వాత రెండో ఇంజన్‌ను అందించింది. జీఈ నుంచి వచ్చే ఏడాది మార్చిలోగా 12 ఇంజన్లను డెలివరీ తీసుకోవాలని హాల్ భావిస్తోంది. మొత్తం 99 ఇంజన్ల కోసం భారత్ 2021లో జీఈతో ఒప్పందం చేసుకుంది. అయితే.. వరుస అవాంతరాల కారణంగా ఇంజన్ల డెలివరీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పుడు డెలివరీ ప్రారంభం కావడంతో ఈ ఏడాది చివరిలోగా మరో పది ఇంజన్లు భారత్‌కు రావొచ్చని భావిస్తున్నారు. భారత వైమానిక దళం తమకు 83 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాలు కావాలని హాల్‌కు ఆర్డర్ ఇచ్చింది.

సురక్షితంగా భూమికి శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం (జూలై 14న) సాయంత్రం 4.45 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడివడింది. ఆ తర్వాత కొద్ది సేపటికే.. ఐఎస్ఎస్ చుట్టూ ఉండే 200 మీటర్ల 'కీప్ అవుట్ స్ఫియర్'ను.. 4 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే అప్రోచ్ ఎలిప్సాయిడ్‌ను దాటేసి.. గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భూమి బాట పట్టింది. దాదాపు 22.5 గంటల ప్రయాణం తర్వాత.. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు (అమెరికా సమయం ప్రకారం తెల్లవారుజామున 2.31 గంటలకు) కాలిఫోర్నియాలోని శాన్‌డియాగో తీరానికి సమీపాన పసిఫిక్ మహాసముద్రంలో దిగింది. 3.07 గంటలకు.. తాము బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నామని మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ క్యాప్సూల్ నుంచే రేడియో సందేశం పంపారు. అప్పటికే ఆ ప్రాంతంలో సిద్ధంగా ఉన్న స్పేస్ ఎక్స్ రికవరీ నౌక 'షానన్' సిబ్బంది.. 3.10 గంటలకు పీపీఈ కిట్లు ధరించి చిన్నచిన్న పడవల్లో ఆ క్యాప్సూల్ వద్దకు వెళ్లి ప్రమాదకరమైన వాయువులు ఏవీ లేవని నిర్ధారించుకున్నారు. 3.15 గంటలకు దాన్ని నిదానంగా షానన్ నౌక వద్దకు తీసుకొచ్చారు. 3.30 గంటలకు.. తాళ్ల సహాయంతో క్యాప్సూల్‌ను నౌకలోకి తీసుకెళ్లారు. నిర్ణీత తనిఖీల అనంతరం.. 3.49 గంటలకు గ్రేస్ క్యాప్సూల్ నుంచి తొలుత మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ బయటకు వచ్చారు. 3.52 గంటలకు అందులోంచి శుక్లా బయటకొచ్చారు. తర్వాత మిగతా ఇద్దరూ వచ్చారు. ఇన్ని రోజులుగా రోదసిలో భార రహిత స్థితిలో ఉండడంతో.. వారు నడవడానికి ఇబ్బందిపడ్డారు. క్యాప్సూల్ నుంచి ర్యాంపు మీదుగా నౌకలోకి జారిన ఆ నలుగురినీ అక్కడున్న సిబ్బందే జాగ్రత్తగా పైకి లేపి, నెమ్మదిగా నడిపించుకుంటూ లోపలికి తీసుకెళ్లారు. ఆ సమయంలో వారు నలుగురూ నవ్వుతూ, చేతులు ఊపుతూ వెళ్లారు. అక్కడ ముందే సిద్ధంగా ఉన్న వైద్యులు.. రోదసి నుంచి తిరిగి వచ్చే వ్యోమగాములకు చేసే వైద్యపరీక్షలన్నీ వారికి చేశారు. అనంతరం వారిని హెలికాప్టర్‌లో తీరానికి తీసుకొచ్చారు. భూమ్మీద జీవనానికి అలవాటుపడడానికి వీలుగా వారం రోజులపాటు వారిని పునరావాస కేంద్రంలో ఉంచనున్నారు.


డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటకు వస్తున్న శుభాన్షు శుక్లా

310 భూప్రదక్షిణలు

ఐఎస్ఎస్‌లో ఉన్న 18 రోజుల్లో శుభాన్షు శుక్లా బృందం భూమి చుట్టూ 310 ప్రదక్షిణలు చేసింది. 300కు పైగా సూర్యోదయాలను, సూర్యాస్తమయాలను చూసింది. మొత్తం 1.3 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించింది. 1.3 కోట్ల కిలోమీటర్లంటే.. భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న దూరానికి 33 రెట్ల దూరంతో సమానం.

ఆనందబాష్పాలు..

డ్రాగన్ క్యాప్సూల్ రాకను లైవ్‌లో వీక్షించిన శుక్లా కుటుంబసభ్యులు.. అది సురక్షితంగా పసిఫిక్ మహాసముద్రంలో దిగగానే కరతాళ ధ్వనులతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఆ సమయంలో శుభాన్షు తల్లి ఆశా శుక్లా, తండ్రి శంభు దయాళ్ శుక్లా, సోదరి శుచి మిశ్రా ఆనందంతో కంటతడి పెట్టారు. "మా అబ్బాయి క్షేమంగా తిరిగొచ్చాడు. ఇందుకు దేవుడికి కృతజ్ఞతలు" అని ఆశా గద్గద స్వరంతో చెప్పారు. డ్రాగన్ క్యాప్సూల్ తిరుగుప్రయాణం మొదలవగానే.. తాము ఆంజనేయ స్వామి గుడికి వెళ్లామని, అక్కడ సుందరకాండ పారాయణ చేశామని ఆమె అంతకు ముందు మీడియాకు తెలిపారు. చరిత్రలో తనదంటూ ఒక పేరు లిఖించుకున్న తమ కుమారుణ్ని చూసి గర్విస్తున్నామని చెప్పారు. ఇక.. భూమ్మీదికి తిరిగొచ్చిన శుక్లా బృందానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హృదయపూర్వక స్వాగతం పలికారు. శుభాన్షు శుక్లా క్షేమంగా భూమికి తిరిగి రావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశప్రజలందరితో కలిసి తాను కూడా ఆయనకు స్వాగతం పలుకుతున్నానని చెప్పారు. శుక్లా తన అంకిత భావం, ధైర్యసాహసాలతో కోట్లాదిమంది కలలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. భారతదేశం తలపెట్టిన మానవ సహిత రోదసియాత్ర గగన్‌యాన్ దిశగా ఈ మిషన్‌ను కీలక మైలురాయిగా పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జితేంద్ర సింగ్ తదితరులు శుక్లా క్షేమంగా తిరిగి రావడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. ఇది దేశప్రజలందరికీ గర్వకారణమైన ఘట్టమని పేర్కొన్నారు. దేశ గౌరవాన్ని శుక్లా ఇనుమడింపజేశారని.. మన వ్యోమగాములు, శాస్త్రవేత్తల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారని అమిత్ షా ప్రశంసించారు. శుక్లా రోదసిలోకి వెళ్లడమే కాక.. భారతదేశ ఆకాంక్షలను కొత్త ఎత్తులకు తీసుకెళ్లారని రాజ్‌నాథ్ కొనియాడారు. ఇక.. ఈ మిషన్‌లో భాగంగా అనుకున్న ప్రణాళిక ప్రకారం శుభాన్షుశుక్లా ఐఎస్ఎస్‌లో ఏడు ప్రయోగాలు నిర్వహించినట్టు ఇస్రో వెల్లడించింది.

నిమిషప్రియ మరణశిక్ష వాయిదా

న్యూఢిల్లీ, జూలై 15: యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిషప్రియకు ఊరట లభించింది. మరణ శిక్ష అమలును యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసినట్లు భారత విదేశాంగ వర్గాలు మంగళవారం వెల్లడించాయి.వాస్తవానికి నిమిషప్రియకు బుధవారం మరణ దండనను అమలు చేయాల్సి ఉండగా.. చివరిక్షణంలో దీన్ని వాయిదా వేసినట్లు తెలిపాయి. హతుడి కుటుంబ సభ్యులతో పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం చేసుకోవడానికి నిమిషప్రియ కుటుంబ సభ్యులకు మరికొంత సమయం ఇవ్వాలంటూ భారత ప్రభుత్వం యెమెన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతూనే ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆ ప్రయత్నాల వల్లే, స్థానిక అధికారులు నిమిషప్రియ మరణ శిక్షను వాయిదా వేసినట్లు వివరించాయి. దీనిపై ఆమె భర్త టామీ థామస్ హర్షం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం, ఇతర సంస్థలు చేసిన ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.

5 ఏళ్లు దాటాక పిల్లల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- 7 ఏళ్లు దాటినా చేయకపోతే డీ యాక్టివేట్

బాల ఆధార్ తీసుకున్న పిల్లలు ఐదేళ్ల తర్వాత తప్పనిసరిగా వేలిముద్రలు, కనుపాపలు, ఫొటో అప్‌డేట్ చేయాలని, లేకపోతే వారి ఆధార్ డీ యాక్టివేట్ అవుతుందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ పేర్కొంది. ఐదేళ్ల లోపు పిల్లలకు బయోమెట్రిక్, ఐరిస్ అవసరం లేకుండా కేవలం ఫొటో మాత్రమే తీసుకొని యూఐడీఏఐ బాల ఆధార్ ఇస్తోంది. అటువంటి పిల్లలు ఏడేళ్లు దాటక మునుపే తప్పనిసరి వారి బయోమెట్రిక్, ఐరిస్, ఫొటోను వారి దగ్గరలోని ఆధార్ కేంద్రాలలో అప్‌డేట్ చేసుకోవాలని వారి ఆధార్‌లో నమోదై ఉన్న ఫోన్ నెంబర్‌కు యూఐడీఏఐ సందేశాలు పంపించింది. ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలు ఆధార్ అప్‌డేట్ చేసుకుంటే ఉచితమని, ఏడేళ్లు దాటిన పిల్లలకు రూ.100 చెల్లించాలని తెలిపింది.

ఇస్లామిక్ విద్యను బోధించటం తప్పేమీ కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 15: ఎంఐఎం పార్టీ గుర్తింపును రద్దు చేయాలన్న ఓ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తిరుపతి నరసింహ మురారి అనే వ్యక్తి తరపున దాఖలైన ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున విష్ణుశంకర్‌జైన్ అనే న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎంఐఎం పార్టీ ముస్లింలలో ఇస్లామిక్ విద్యను పెంపొందిస్తామని, షరియా చట్టం పట్ల అవగాహన పెంచుతామని చెబుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'దీంట్లో తప్పేముంది? ఇస్లామిక్ విద్యను బోధించటం తప్పేమీకాదు. మరిన్ని రాజకీయపార్టీలు ఇలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే మేం స్వాగతిస్తాం' అని వ్యాఖ్యానించింది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలను నేర్పించటానికి హిందూ పేరుతో తాను ఒక రాజకీయపార్టీ పెడతానంటే ఎన్నికల సంఘం అంగీకరించదని, ఇది వివక్షేనని అన్నారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. 'వేదాలు, ఉపనిషత్తులు బోధించటానికి ఈసీ అభ్యంతరం చెబితే సంబంధిత వేదికలపై ఫిర్యాదు చేయండి. చట్టం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుంది' అని స్పష్టం చేసింది. ఒక మతపరమైన చట్టానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తున్నప్పుడు.. ఆ మతపరమైన చట్టాన్ని తాము బోధిస్తామని ఏదైనా రాజకీయపార్టీ చెబితే అందులో అభ్యంతరాలు ఉండక్కర్లేదని తెలిపింది. ఇక, దేశంలోని మైనారిటీల హక్కులకు రాజ్యాంగం కొన్ని రక్షణలు కల్పించిందని, ఆ రక్షణల అమలు కోసం పని చేస్తామని ఎంఐఎం రాజ్యాంగం స్పష్టం చేస్తోందని పేర్కొంది. సమాజం శ్రేయస్సు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. సమాజంలో మతపరమైన చిచ్చు రేపే పనులు చేసే పార్టీలు, అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని ధర్మాసనం పేర్కొంది. కొన్ని పార్టీలు కులంపై ఆధారపడి రాజకీయాలు చేస్తున్నాయని, ఇది సమాజానికి ప్రమాదకరమని తెలిపింది.

'నాన్ వెజ్' పాలకు నో!

భారత్, అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఓ కొలిక్కి?

- చాలా వరకు భారత ఉత్పత్తులపై 10% కనీస సుంకం.. కొన్నింటిపై కాస్త అధికం
- అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై 5 నుంచి 8 శాతం వరకు భారత్ సుంకాలు

న్యూఢిల్లీ, జూలై 15: ట్రంప్ సుంకాల గోల వేళ భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధమైంది. ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా జరుగుతున్న చర్చలు తాజాగా ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. చాలా వరకు ఉత్పత్తుల విషయంలో ఇంతకుముందే పరస్పరం సానుకూలత వ్యక్తమైనా.. వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు అనుమతి, సుంకాల తగ్గింపుపై భారత్ గట్టి నిలబడింది. భారత్‌లో ఈ రంగాలపై ఆధారపడిన కోట్లాది మంది ప్రయోజనాలు దెబ్బతింటాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా అమెరికా నుంచి 'నాన్ వెజ్' పాల దిగుమతిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని పేర్కొంది. అమెరికాలో ఆవులు, గేదెలకు కోళ్లు, చేపలు, ఇతర పశువులకు సంబంధించి వ్యర్థ భాగాలు, కొవ్వులతో తయారు చేసిన పదార్థాలను ఆహారంగా వేస్తుంటారు. భారత్‌లో పాలను శాకాహారంలో భాగంగా తీసుకుంటారు. ఈ క్రమంలో జంతు పదార్థాలను తినే ఆవులు, గేదెల నుంచి వచ్చే 'నాన్ వెజ్' పాలు, పాల పదార్థాలు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమని భారత్ వాదించింది. ఈ క్రమంలో కేవలం ప్రాసెస్ చేసిన పాడి ఉత్పత్తుల దిగుమతులకే అంగీకరించింది. వాటిపైనా 'జంతు సంబంధిత ఆహారం' వాడలేదనే ధ్రువీకరణ తప్పనిసరి అని స్పష్టం చేసింది. అమెరికా నుంచి పాలు, పాల పదార్థాల దిగుమతికి గేట్లు తెరిస్తే.. భారత్‌లోని రైతులకు ఏటా రూ.1.03 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎస్‌బీఐ తాజా నివేదికలో అంచనా వేసింది.

భారత్‌పై 11.5శాతం..అమెరికాపై 7%

భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఇరుదేశాల ఉన్నతాధికారులు కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారు. వాణిజ్యం, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలోని భారత బృందం పలుమార్లు అమెరికాలోని వాషింగ్టన్ వెళ్లి చర్చలు జరిపింది. ఈ క్రమంలో మధ్యంతర ఒప్పందానికి తుదిరూపం వచ్చినట్టు సమాచారం. దీనిపై ఇరుదేశాల ఉన్నతాధికారులు వారం, పది రోజుల్లో సంతకాలు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఆ వివరాల ప్రకారం...



- చాలా వరకు భారత ఉత్పత్తులపై 10% కనీస సుంకానికి భారత్ అంగీకరించింది. అయితే కొన్ని రకాల ఉత్పత్తులపై గంపగుత్తగా కాకుండా.. కాస్త తక్కువ, ఎక్కువగా వేయాలని ప్రతిపాదించింది. దీనికి అమెరికా అంగీకరించడంతో భారత్‌పై సుంకాలు సగటున 11.5 శాతం అవుతాయని అంచనా. అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై భారత సుంకాలు 5-8 శాతం వరకు.. సగటున 7% ఉంటాయని అంచనా.
- యాపిల్స్, బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్, కొన్ని రకాల ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలతోపాటు, పలు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. అయితే జన్యుమార్పిడి ఉత్పత్తులకు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

ఆధ్యాత్మికతతో కాదు.. ప్రకృతిపై ప్రేమతో..

- అడవిలో మేము సంతోషంగానే ఉన్నాం
- 20 దేశాల్లో అలాగే గడిపాం: రష్యా మహిళ నీనా

బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో జీవించేందుకు తాను ఇష్టపడతానని రష్యా మహిళ నీనా కుటీనా(40) తెలిపారు. తాను, తన ఇద్దరు పిల్లలు ప్రకృతిలో సంతోషంగా ఉన్నామని, అయితే తమ గురించి మీడియాలో తప్పుగా ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఆధ్యాత్మికత ప్రేరణతోనే తాను ఇలా చేస్తున్నానని అనడం సరికాదని, తాను ప్రకృతిని మాత్రమే ప్రేమిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఉత్తర కన్నడ జిల్లా గోకర్ణ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ గుహ వద్ద ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న ఆమెను కర్ణాటక పోలీసులు ఇటీవల బయటకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తుమకూరులోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్ఓ)లో ఉంటున్న ఆమె.. ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడారు. తన పిల్లలు ప్రాయ(6), అమా(4)తో కలిసి అటవీ ప్రాంతంలోని గుహలో ప్రశాంతంగా గడిపామని అన్నారు. తాను చనిపోదలచుకోలేదని, అలాగే తన పిల్లలను చంపేందుకు ఇక్కడకు తీసుకురాలేదని స్పష్టం చేశారు. తన పిల్లలు అడవిలో చాలా సంతోషంగా గడిపారని అన్నారు. బంకమట్టితో ఎన్నో బొమ్మలు చేశామని, వాటికి రంగులు వేశామని వివరించారు. గ్యాస్ ఉపయోగించే వంట చేశామని తెలిపారు. కొన్నేళ్లుగా తాము 20 దేశాల్లో ఇదే తరహాలో గడిపామని అన్నారు. 2017 నుంచి తాము ఆ గుహలో ఉన్నామనేది అబద్ధమని కొట్టిపారేశారు. పోలీసులకు తమ పాత పాస్‌పోర్టులు దొరికాయని, వాటిని పరిశీలించలేదని తెలిపారు. తన పెద్ద కుమారుడు మృతిచెందాక వీసా పొందడం సాధ్యం కాలేదని, ఈలోగా భారత్ వీసా గడువు ముగిసిందని తెలిపారు. 2017 తర్వాత నాలుగు దేశాలు తిరిగామని చెప్పారు. తనకు టెలిగ్రాం చానెల్ ఉందని, తాము ఆ గుహలో ఏం చేశామనేది రికార్డు చేసి అందులో పోస్టు చేశామని తెలిపారు.


ఇద్దరు పిల్లలతో రష్యా మహిళ నీనా

సావర్కర్ గురించి తెలుసుకోవాలని

రాహుల్‌ను ఆదేశించలేం!

- పిటిషనర్ దాఖలు చేసిన పిల్‌ను చదవాలని ఆయనకు సూచించలేం
- బాంబే హైకోర్టు స్పష్టం..పిల్ కొట్టివేత

ముంబై, జూలై 15: విపక్షనేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని బాంబే హైకోర్టు కొట్టివేసింది. హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ సావర్కర్ గురించి రాహుల్ పరిపక్వత లేని, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేశారని, తద్వారా పిటిషనర్ హక్కులను ఉల్లంఘించారని ఆరోపిస్తూ కోర్టులో 'అభినవ్ భారత్ కాంగ్రెస్' వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ ఫడ్నిస్ పిల్ దాఖలు చేశారు. సావర్కర్‌పై రాహుల్‌కు ఉన్న జ్ఞాన శూన్యతను తొలగించుకునేందుకుగాను పిటిషన్‌ను చదవాలంటూ ఆయన్ను ఆదేశించాలని పిల్‌లో పంకజ్ కోరారు. ఈ వ్యాజ్యాన్ని మంగళవారం బాంబే హైకోర్టు విచారించింది. సావర్కర్ గురించి అజ్ఞానాన్ని తొలగించుకునేందుకు పిల్‌లోని కంటెంట్‌ను చదవాలని రాహుల్ గాంధీని ఎలా ఆదేశించగలం? అని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. రాహుల్ భవిష్యత్తులో ప్రధాని అయితే విధ్వంసం సృష్టిస్తారని పిల్‌లో పంకజ్ ఆరోపించారు. దీనికి ధర్మాసనం.. "మాకైతే తెలియదు. రాహుల్ ప్రధాని అవుతారని మీకు తెలుసా?" అని ప్రశ్నించింది. ఇదిలా ఉండగా, పరువు నష్టం దావాలో రాహుల్‌కు లఖ్‌నవూలోని స్థానిక ఎంపీ-ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన స్వయంగా అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు అలోక్ వర్మ ముందు హాజరయి బెయిల్ పత్రాలను సమర్పించారు. వరుసగా అయిదు వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు వారెంటు జారీ చేసింది. దాంతో ఆయన కోర్టుకు స్వయంగా హాజరయి బెయిల్ పత్రాలను అందజేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022లో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ "భారత్ జోడో యాత్ర ఎందుకని అడిగేవారు చైనా సైనికులు మన సైనికులను ఎందుకు కొట్టారని ఒక్కసారి కూడా అడగడం లేదు" అని వ్యాఖ్యానించారు. అయితే, దెబ్బలు తిన్నారనడం భారత సైనికులను అవమానపరచడమేనని పేర్కొంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాత్సవ పరువు నష్టం దావా వేశారు.


లఖ్‌నవూలోని ప్రజాప్రతినిధుల కోర్టులో రాహుల్

ఖరీదైన ఆహారం ఖైదీల

ప్రాథమిక హక్కేమీ కాదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 15: జైళ్లలో ఖైదీలకు ఖరీదైన, ఇష్టమైన ఆహారం పెట్టకపోవడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికి రాదని మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. వికలాంగులైన ఖైదీలకు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఖరీదైన ఆహారం, తమ కోసం ప్రత్యేకంగా చేసే ఆహారం కావాలని ఖైదీలు డిమాండు చేయలేరని ధర్మాసనం తెలిపింది. ప్రతి ఖైదీకి తగినంత, బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన ఆహారం పెట్టడం వరకే ప్రభుత్వాల బాధ్యత ఉంటుందని పేర్కొంది. ఆస్తి వివాదంలో జైలు శిక్ష అనుభవిస్తున్న న్యాయవాది ఎల్.మురుగనాథం చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తాను బెకర్ మస్క్యులర్ డిస్ట్రాఫీ వ్యాధితో బాధపడుతున్నానని, ప్రతి రోజూ తనకు ప్రొటీన్లు అధికంగా ఉండే గుడ్లు, మాంసం ఇవ్వాలని ఆయన కోరారు.

స్వర్ణ మందిరానికి బాంబు బెదిరింపు

అమృత్‌సర్, జూలై 15: సిక్కుల పవిత్ర స్థలం స్వర్ణ మందిరంపై బాంబు దాడులు చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి హెచ్చరికలు వచ్చాయి. 24 గంటలకన్నా తక్కువ వ్యవధిలో ఈ-మెయిళ్లు రావడంతో అధికారులు అప్రమత్తమయి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ రెండు ఈ-మెయిళ్లలోనూ ఆర్‌డీఎక్స్ వినియోగం, పేలుడు సంభవించే సమయాన్ని ప్రస్తావించారు. దీనిపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టిడ్కో గృహాలకు వెయ్యి కోట్లు అవసరం

» నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం.. ఇళ్లు పూర్తి చేసి ఇస్తాం: నారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్/జగ్గంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్లు పూర్తి కావాలంటే రూ.1,000 కోట్లు అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, కాకినాడ జిల్లా జగ్గంపేటల్లో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏడు లక్షల టిడ్కో ఇళ్లు మంజూరు చేయించామని చెప్పారు. వాటిలో అప్పట్లోనే 5లక్షల ఇళ్లు పూర్తి చేశామని, మరో 2లక్షల గృహాలను నిర్మించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అవన్నీ పూర్తి కావాలంటే రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతుందని, నిధుల కోసం ప్రయత్నిస్తున్నామని, లబ్ధిదారులకు ఇళ్లు పూర్తిచేసి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మున్సిపాలిటీల నుంచి ప్రతిపాదనలు వస్తే వచ్చే 3నెలల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాత వార్డుల ప్రకారమే ఎన్నికలు ఉంటాయని వివరించారు. టీడీఆర్ బాండ్ల మంజూరులో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్నామని, దోషులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని నారాయణ వివరించారు.

'కరేడు' పోరాటానికి అండగా ఉంటా: జగన్

అమరావతి, ఉలవపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కరేడు భూముల కోసం రైతులు చేసే పోరాటానికి అండగా ఉంటానని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆ ప్రాంతవాసులకు హామీ ఇచ్చారు. తాడేపల్లి నివాసంలో జగన్‌ను మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నేతృత్వంలో కరేడు రైతులు కలిశారు. పరిశ్రమల పేరుతో భూములు లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ ఫిర్యాదు చేశారు. ప్రజలకు, రైతులకు ఇష్టం లేకుండా భూసేకరణ చేస్తామంటే వైసీపీ తరఫున వ్యతిరేకిస్తామని, అవసరమైతే కరేడు గ్రామంలో పర్యటించి మద్దతుగా నిలుస్తానని జగన్ వారికి హామీ ఇచ్చారు.

కులాల మధ్య చిచ్చుపెడతారా: పంచుమర్తి

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'బీసీ మహిళను నీచ రాజకీయాల్లోకి లాగి, కులాల మధ్య చిచ్చుపెట్టి, రాష్ట్రంలో శాంతి భద్రతలను దెబ్బతీయాలనే పేర్ని నాని ప్రయత్నం విఫలమైంది' అని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'అవినీతిలో తనతోపాటు తన భార్యనూ దొంగను చేసిన పేర్ని నాని... మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. పేదల బియ్యాన్ని దోచుకున్న నీచుడు పేర్ని' అని పంచుమర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బిట్స్ క్యాంపస్' కూటమి విజయం: మంత్రి సారథి

నూజివీడు, అమరావతి జూలై 15(ఆంధ్రజ్యోతి): 'రూ.వెయ్యి కోట్ల వ్యయంతో రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్ఠాత్మక బిట్స్ పిలాని సంస్థ తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బిర్లా సంస్థ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా ప్రకటించడం హర్షణీయం. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన విజయం' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'ఈ క్యాంపస్ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది. బిట్స్ పిలాని సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో విశేష కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు' అని మంత్రి అన్నారు.

జర్నలిస్టుల హెల్త్ స్కీం పొడిగింపు

వర్కింగ్ జర్నలిస్టులకు ఉచిత హెల్త్ స్కీం పథకాన్ని 2025-26 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇదే అంశంపై సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా ఒక ప్రకటన చేశారు. స్కీమ్‌ను పొడిగిస్తూ వైద్య ఆరోగ్యశాఖ జీఓ జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రిడేషన్లు ఉన్న జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1,250లు సీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని తెలిపారు.

14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ద్వారా ఎంపికైన 14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాపై ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ విషయమై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీఎస్ విజయానంద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం ఢిల్లీలో యూపీఎస్సీ, డీవోపీటీ అధికారులతో సమావేశమై చర్చించారు. ఏపీకి చెందిన 14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా ఇచ్చేందుకు సమావేశం ఆమోదించింది. దీంతో 2010 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీలు లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, కె.శ్రీనివాసరావు, చౌడేశ్వరి, హిమవతి, లావణ్య లక్ష్మి, వెంకటరత్నం, లతా మాధురి, సురేశ్ బాబు, కరిముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, క్రిష్ణ ప్రసన్న, పి.శ్రీనివాస్‌కు ఐపీఎస్ హోదా లభించనుంది.

ఏసీబీ కేసులో ఏబీవీకి విముక్తి

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నమోదు చేసిన ఏసీబీ కేసు నుంచి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు పూర్తి విముక్తి లభించింది. ఏబీవీ పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయాన్ని అంగీకరిస్తూ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని కూటమి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. 2018లో ఏపీ నిఘా విభాగం అధిపతిగా ఉన్నప్పుడు జరిగిన నిఘా పరికరాల కొనుగోళ్లలో ఆయన అవినీతికి పాల్పడ్డారంటూ జగన్ ప్రభుత్వం 2021లో ఏసీబీ కేసు నమోదు చేసింది. అయితే ఇదంతా అబద్ధమని, అసలు పరికరాలే కొనుగోలు చేయలేదంటూ వెంకటేశ్వరరావు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఏబీవీ వాదనలు సమర్థించి, ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేసింది. అయినప్పటికీ 2024లో విజయవాడ ఏసీబీ కోర్టులో జగన్ ప్రభుత్వ ఒత్తిడి మేరకు అప్పటి ఏసీబీ అధికారులు అభియోగపత్రం దాఖలుచేశారు. హైకోర్టు క్వాష్ చేసిన తర్వాత చార్జిషీట్ చెల్లదంటూ బెజవాడ ఏసీబీ కోర్టు దాన్ని తిరస్కరించింది.

చేనేతలు, కళాకారులకు ప్రోత్సాహం: సిసోడియా



అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేతలు, కళాకారుల ప్రతిభకు చంద్రబాబు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత కృషి వలన ఏపీకి జాతీయస్థాయిలో గౌరవం దక్కిందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్నారు. రాష్ట్రానికి పది ఓడీఓపీ అవార్డులు రావడం గర్వకారణమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ఓడీఓపీ)' కింద గుర్తింపు పొందేలా సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన చేనేత, హస్తకళ, వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం ప్రకటించిన అవార్డులను ఢిల్లీలో సోమవారం ప్రదానం చేశారు. ఈ అవార్డుల స్వీకరణ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ మంత్రి మంత్రి సవిత, ప్రత్యేక సీఎస్ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల రక్షణకు చర్యలు: ఫరూక్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన కేంద్ర పథకాల వినియోగం, హజ్-2026, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధి రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లిన 1618 మందికి కూటమి ప్రభుత్వం నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా ముగిసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 2026 హజ్ యాత్రకు ఇప్పటి నుంచే ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. మైనార్టీల అభ్యున్నతి, స్వయం ఉపాధి కల్పన కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.



ఏడాదిలో 30 వేల మంది మహిళా వ్యాపారవేత్తలు

» మెప్మా వర్క్‌షాపులో ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్

అమరావతి, తాడేపల్లి టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా శక్తిమంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల మందిని వ్యాపారవేత్తలుగా చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు' అని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన మెప్మా రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 'మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎల్ఈఏపీ (లీప్) కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది' అని తెలిపారు.

మిగులు జలాలపై హక్కు మాకే!





సీఎం చంద్రబాబును కలిసిన నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో ఎండీ వికాస్



అమిత్ షాతో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, ఎంపీలు లావు, మాగంటి, వేమిరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్, సానా సతీశ్, మాజీ ఎంపీలు కనకమేడల, కంభంపాటి

(మొదటి పేజీ తరువాయి)

ఉభయులూ చర్చించారు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు గోదావరి వరద నీటిని తరలించేందుకు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కీలకమని చంద్రబాబు తెలిపారు. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా దీనిని రూపొందించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను వివరించారు. ఏడాదిగా క్లిష్టమైన పరిస్థితుల్లో రాష్ట్రానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ హయాంలో ధ్వంసమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో గాడిలో పెడుతున్నామని చెప్పారు. అయితే ఇప్పటికీ ఆర్థిక వనరుల కొరత తీవ్రంగా ఉందని.. కేంద్రం నుంచి మరింతగా సాయం అందించాలని ప్రత్యేకంగా కోరారు. విభజన వల్ల ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయించాలని 16వ ఆర్థిక సంఘానికి నివేదించామని తెలిపారు. అంతకుముందు.. కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించినందుకు ప్రధాని మోదీకి, అమిత్‌షాకు, కేంద్ర ప్రభుత్వానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సానా సతీశ్ ఉన్నారు.

రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలపై చర్చ..

అంతకుముందు ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు.. తన నివాసంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్‌తో సమావేశమయ్యారు. ఏపీలో ఏరోస్పేస్, రక్షణ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, పెట్టుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై చర్చించారు. రాయలసీమ ప్రాంతంలో రక్షణ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని సీఎం తెలిపారు. ఢిల్లీ మెట్రో రైల్ ఎండీ వికాస్ కూడా ముఖ్యమంత్రిని కలిశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో నిర్మాణానికి సహకారంపై చర్చించారు.

అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను చంద్రబాబు పరామర్శించారు. ఈ నెల 8న అశ్వినీ తండ్రి దౌలాల్ వైష్ణవ్ మరణించిన సంగతి తెలిసిందే. మంగళవారం కేంద్ర మంత్రి అశ్వినీ నివాసానికి చేరుకున్న చంద్రబాబు దౌలాల్ వైష్ణవ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

నేటి సీఎంల భేటీ ఎజెండాలో

బనకచర్ల వద్దు

కేంద్రానికి తెలంగాణ సీఎస్ లేఖ

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన సమావేశం ఎజెండాలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు మంగళవారం లేఖరాశారు. తక్షణమే ఎజెండాను సవరించాలని కోరారు. ఈ ప్రాజెక్టును తమ సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నారని గుర్తుచేశారు. ఏపీ పంపిన ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికను తిరస్కరించాలని కేంద్ర జలసంఘాన్ని కోరుతున్నామని, డీపీఆర్ దాఖలు చేయకుండా నియంత్రించాలని, టెండర్లను చేపట్టకుండా అడ్డుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఉన్నత పాఠశాలకూ

ఇంటర్నెట్

» ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రారంభించాలి: లోకేశ్



అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు చదవడం, రాయడం తోపాటు గణితంలో నైపుణ్యం సాధించేలా వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమం చేపట్టాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఉన్నత పాఠశాలకూ ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్య, ఇంటర్ విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 5న గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని చెప్పారు. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును పునర్వ్యవస్థీకరించి అందులో నిపుణులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. హైస్కూల్ ప్లస్‌ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసే స్పోర్ట్స్ కిట్‌లను మంత్రి పరిశీలించారు. యువత, పరిశ్రమలను అనుసంధానం చేయడమే లక్ష్యంగా రూపొందిస్తున్న పోర్టల్‌ను సెప్టెంబరు 1న ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్గదర్శకాలు రూపొందించాలన్నారు.

మంచి పాలసీ ఉంది.. ఏపీకి రండి

» ఏరోస్పేస్ ఇండస్ట్రీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఏరోస్పేస్ పరిశ్రమలను మంత్రి లోకేశ్ ఏపీకి ఆహ్వానించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఏరోస్పేస్ పరిశ్రమలకు కేటాయించిన భూములు కర్ణాటక ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో ఎక్స్ వేదికగా లోకేశ్ స్పందించారు. ఏరోస్పేస్ పరిశ్రమల కోసం తన వద్ద మంచి ఐడియా ఉందన్నారు. ఆ పరిశ్రమ వర్గాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూడొచ్చు అని అన్నారు. ఏపీ వద్ద వారి కోసం ఆకర్షణీయమైన ఏరోస్పేస్ పాలసీ సిద్ధంగా ఉందని చెప్పారు. అత్యుత్తమ స్థాయిలో ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామన్నారు. బెంగళూరుకు సమీపంలోనే వెంటనే కేటాయించేందుకు సిద్ధంగా 8,000 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే కలిసి మాట్లాడుకుందామంటూ ఆ పరిశ్రమలకు ఆహ్వానం పలికారు.

కొత్తగా 10 లక్షల ఉద్యోగాలు

» త్వరలోనే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్..

» మన మిత్ర యాప్ సేవల విస్తృతి పెంచండి

» అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు

ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లలో సృష్టే లక్ష్యం

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ద్వారా (జీసీసీ) పది లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఉన్నతాధికారులతో ఆయన ఉండవల్లి నివాసంలో దీనిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటా సెంటర్ల ఏర్పాటుకు ఇప్పటివరకూ 95 ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయని, అవి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. త్వరితగతిన ఈ సంస్థలు తమ యూనిట్లను ఏర్పాటుచేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రతిష్ఠాత్మక టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తిచేశామని అధికారులు తెలిపారు. ఆ సంస్థలు సాధ్యమైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు తమతో జీసీసీ ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని ఆయన వివరించారు. వాటి ద్వారా 35,000 ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు.రాష్ట్రానికివచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో వర్కింగ్ స్పేస్ సిద్ధం చేయాలని అధికారులను లోకేశ్ అదేశించారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్టు మంత్రి లోకేశ్ వెల్లడించారు. విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) కేంద్రాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్అండ్‌టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని .. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించ దలచిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌సేవలు ఎంతగానో సహకరించాయని గుర్తుచేశారు. వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించాలన్నారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని లోకేశ్ చెప్పారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ద్వారా 535 సేవలను ఇప్పటికే అమలు చేస్తున్నామని, ఈ సేవలను మరింత విస్తృతం చేయాలని మంత్రి ఆదేశించారు. కుల ధ్రువీకరణతోపాటు విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లను మన మిత్ర ద్వారా అందించాలని సూచించారు. రాష్ట్రంలోని మొత్తం 45,000 ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ తదితర విమానాశ్రయాల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీ సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నదన్నారు.



ఐటీ శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్, ఆ శాఖ అధికారులు

ఉద్యోగాల కల్పనలో

విశాఖ టాప్

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించింది. దేశవ్యాప్తంగా మొత్తం పది నగరాల పేర్లున్న ఈ జాబితాలో విజయవాడ మూడోస్థానం దక్కించుకుంది. ఈ నివేదికలోని వివరాల ప్రకారం... మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఊపందుకోవడం, మెరుగైన రహదారులు, విమాన సౌకర్యాలు ఉండటంతో దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలు శరవేగంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ నగరాల్లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి అనేక కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ వంటి ఐటీ, ఫార్మా కంపెనీలు విశాఖ, విజయవాడల్లో ఉద్యోగ కల్పనలో కీలకంగా ఉన్నాయి. టెక్నాలజీ కంపెనీలతో పాటు పెద్దపెద్ద డేటా, ఫార్మా కంపెనీలను విశాఖ పట్నం ఆకర్షిస్తోంది. విశాఖలో మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం చేస్తోన్న కసరత్తు కూడా ఇందుకు దోహదం చేస్తోందని ఆ నివేదిక పేర్కొంది. ఇక విజయవాడకు వస్తున్న పర్యాటకులు, భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ఐటీ కంపెనీల రాకతో పాటు, మెట్రో రైలు ఏర్పాటు, ఎయిర్‌పోర్టు విస్తరణ తదితర అభివృద్ధి కార్యకలాపాలు ఉద్యోగావకాశాలను పెంచుతున్నాయి. ఈ ఏడాది ప్రతి ఐదుగురు భారతీయ నిపుణుల్లో నలుగురు తాము చేస్తున్న ఉద్యోగం మారాలని చూస్తున్న నేపథ్యంలో ప్రధాన నగరాలకు దీటుగా టైర్-2, టైర్-3 నగరాల్లో వస్తున్న అవకాశాలు వారికి దిశానిర్దేశం చేస్తున్నాయని లింక్డ్ఇన్ తెలిపింది. స్థానికంగా తమ కెరీర్‌ను మార్చుకోవాలని, కొత్త పరిశ్రమలు ప్రారంభించడంతో పాటు ఇప్పటికే ఉన్నవాటిని అభివృద్ధి చేయాలని భావించే వారికి ఈ జాబితా ఉపయోగపడుతుందని పేర్కొంది.

నివేదికలోని ముఖ్యమైన అంశాలివీ...

- మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, ఇంక్(విశాఖ), హెచ్‌సీఎల్ టెక్ (విజయవాడ, మధురై), ఇన్ఫోసిస్ (విజయవాడ), డేటామాటిక్స్ (నాసిక్), బుల్ ఐటీ సర్వీసెస్ (మధురై) వంటి టెక్ కంపెనీలు టైర్-2, టైర్-3 నగరాల్లో తమ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నాయి. స్థానిక ప్రతిభకు తోడ్పాటు అందిస్తున్నాయి.
- డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, లారస్ ల్యాబ్స్ లిమిటెడ్, ఆలెంబిక్ ఫార్మా లిమిటెడ్, సన్‌ఫార్మా వంటి హెల్త్‌కేర్, ఫార్మా కంపెనీలు విశాఖ, వడోదరలో అవకాశాలు కల్పిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు రాయ్‌పూర్, ఆగ్రా, జోధ్‌పూర్‌లో ఆర్థిక సేవల వృద్ధిని వేగవంతం చేస్తున్నాయి.
- విశాఖ, విజయవాడ, మధురైలోని ఇంజనీరింగ్ నిపుణులకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. టైర్-2, టైర్-3 నగరాల్లో విద్య, సేల్స్, వ్యాపార రంగాలకు చెందిన నిపుణులు ఉద్యోగాల వేటలో ఉన్నారు.

సిటీస్ ఆన్ ది రైజ్-2025 జాబితా ఇదీ..

1. విశాఖపట్నం, 2. రాంచీ, 3. విజయవాడ, 4. నాసిక్, 5. రాయ్‌పూర్, 6. రాజ్‌కోట్, 7. ఆగ్రా, 8. మధురై, 9. వడోదర, 10. జోధ్‌పూర్

వైసీపీ ఇసుక దోపిడీ 781 కోట్లు

» నివేదిక సిద్ధం చేసిన మైన్స్ అధికారులు

» రేపోమాపో ప్రభుత్వానికి సమర్పణ

గోదావరిలో 125 లక్షల టన్నులు బొక్కేశారు

టన్ను రూ.475 నుంచి 625 వరకూ అమ్ముకున్నారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో గోదావరి నదిలో రూ.781.25 కోట్ల అక్రమ ఇసుక దందా సాగిందని అధికారులు తేల్చారు. ఈ ప్రాంతంలో సుమారు 14 చోట్ల అక్రమ తవ్వకాలు జరిపి, 125 లక్షల టన్నుల ఇసుక అమ్మేసుకున్నారు. అప్పట్లో డీసిల్టేషన్ పాయింట్లలో టన్ను రూ.625కు విక్రయించారు. ఈ లెక్కన సుమారు రూ.781.25 కోట్ల ఇసుక దందా సాగిందని అంచనా. ఓపెన్ రీచ్‌లలో టన్ను ఇసుక రూ.475కు విక్రయించారు. ఈ లెక్కన చూసినా.. రూ.593.75 కోట్ల విలువైన ఇసుక దోపిడీ జరిగినట్టు లెక్క. అయితే దీనికి బాధ్యులెవరో తేల్చాల్సి ఉంది. ఎందుకంటే.. వైసీపీ హయాంలో (2021 నుంచి 2024 వరకూ) తొలుత జేపీ సంస్థ పేరిట, ఎవరూ లేకుండా కొంతకాలం, ప్రతిమా ఇన్‌ఫ్రా పేరుతో మరికొంతకాలం ఇసుక దోపిడీ సాగింది. ఇసుక సరఫరా అంతా నగదు లావాదేవీల్లోనే సాగింది. బిల్లులు సక్రమంగా చూపకుండా దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై అప్పట్లోనే కొందరు కోర్టుకు వెళ్లగా నాటి కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో ఆనాటి ఎస్పీ జగదీశ్‌తో కోర్టుకు తప్పుడు నివేదిక ఇప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అక్రమాలపై కోర్టుల ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించింది. ఏపీ స్టేట్ అప్లికేషన్ సెంటర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇసుక తవ్విన ప్రాంతాలను గుర్తించి వాటి ఛాయా చిత్రాలు కూడా తీశారు. వీటి ఆధారంగా జిల్లాలో ఎక్కడెక్కడ.. ఎంతమేరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ఇసుక కమిటీ ఆదేశాల మేరకు మైన్స్, ఇతర అధికారులు ఆరా తీసి అక్రమాలను నిగ్గు తేల్చారు. జిల్లాలో రాజమండ్రి వైపు, కొవ్వూరు వైపు గోదావరిలోనూ అక్రమ ఇసుక తవ్వకాలు జరిగినట్టు గుర్తించారు. 2023 మే నెలలో జేపీ సంస్థతో ఒప్పందం ముగిసిన తర్వాత వైసీపీ పెద్దల ప్రోత్సాహంతో రకరకాల వ్యక్తులు ఇసుక దందా చేశారు. తర్వాత ప్రతిమా అనే సంస్థను ముందు పెట్టి గోదావరిలో డ్రెడ్జింగ్ చేసిన సంగతి తెలిసిందే. కొవ్వూరు వైపు ఒకరికి, రాజమండ్రి వైపు మరొకరికి కాంట్రాక్టుకు ఇచ్చి, అడ్వాన్సుగా రూ.కోట్లు కట్టించుకుని ఇసుక అక్రమాలను ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు వైపు కాంట్రాక్టు తీసుకున్న ప్రేమ్‌రాజు అనే వ్యక్తి కప్పం కట్టలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ చాలాచోట్ల బోట్స్‌మన్ సొసైటీలను ముందు పెట్టి దోపిడీ చేశారు. దీంతో ఇసుక ఎవరు తవ్వారంటే.. బోట్స్ మన్ సొసైటీల మీదకు నేరం మోపవలసి వస్తుంది. అయితే దందా చేసింది మాత్రం.. వైసీపీ పెద్దల ప్రోత్సాహంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులే. ఇసుక అక్రమాలను గుర్తించిన అధికారులు.. ఇటీవల జేపీ సంస్థకు నోటీసివ్వగా.. తమకు సంబంధం లేదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. మరి ఈ అక్రమాల గుట్టు ప్రభుత్వం ఎలా తేలుస్తుందో చూడాలి.

ఏఆర్ డెయిరీ ఎండీకి షరతులతో బెయిల్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఏఆర్ డెయిరీ ఎండీ రాజు రాజశేఖరన్కు హైకోర్టు పలు షరతులతో మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. నెల్లూరు ఏసీబీ కోర్టు సంతృప్తి మేరకు రూ. 50 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడం కానీ, బెదిరించడం కానీ చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తాము విధించిన షరతులను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించేందుకు సిట్కు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు తీర్పు ఇచ్చారు.

మద్యం కేసు నిందితులకు 22 వరకు రిమాండ్ పొడిగింపు

- ఆదేశాలిచ్చిన ఏసీబీ కోర్టు.. చెవిరెడ్డి బెయిల్పై విచారణ వాయిదా

విజయవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న 11 మంది నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్ను పొడిగించింది. జైలు నుంచి కసిరెడ్డి రాజశేఖర్రెడ్డి, సజ్జల శ్రీధర్రెడ్డి, బాలాజీ గోవిందప్ప, పైలా దిలీప్, చాణక్య, పి.కృష్ణమోహన్రెడ్డి, కె.ధనుంజయ్రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణ, చెరుకూరి వెంకటేశ్ నాయుడును వర్చువల్గా న్యాయాధికారి ఎదుట మంగళవారం హాజరుపరిచారు. వారికి 22వ తేదీ వరకు రిమాండ్ను పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. వచ్చే వాయిదాకు నిందితులను భౌతికంగా కోర్టులో హాజరుపరిచేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కాగా, చెవిరెడ్డి భాస్కర్రెడ్డి బెయిల్ పిటిషన్పై విచారణను ఏసీబీ కోర్టు 22వ తేదీకి వాయిదా వేసింది. ఆయన పిటిషన్పై డిఫెన్స్ వాదనలు మంగళవారం పూర్తయ్యాయి. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను కోర్టు వినాల్సి ఉంది. ఇక చెవిరెడ్డి భాస్కర్రెడ్డి పీఏలు బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్పై విచారణను కోర్టు 18వ తేదీకి వాయిదా వేసింది.

కౌంటర్ దాఖలుపై నిర్ణయానికి సమయమివ్వండి

- సింగయ్య మృతి కేసులో హైకోర్టుకు పీపీ వినతి

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా వైసీపీ సానుభూతిపరుడు సింగయ్య మృతిచెందిన ఘటనకు సంబంధించి నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేయడంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. కౌంటర్ దాఖలు చేస్తామని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దన్న తమ అభ్యర్థనను పరిగణించకుండా హైకోర్టులోని మరో న్యాయమూర్తి పిటిషనర్లపై తదుపరి చర్యలు అన్నింటినీ నిలుపుదల చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో కౌంటర్ వేయాలా, లేదా అనే విషయంపై నిర్ణయం తీసుకొనేందుకు విచారణను రెండువారాలకు వాయిదా వేయాలని పోలీసుల తరఫున వాదిస్తున్న ఆయన కోరారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

తుళ్లూరు పీఎస్లో డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఫిర్యాదు

తుళ్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్పై బురదజల్లే కార్యక్రమం జరుగుతుందని ఆయన ఓఎస్డీ వెంకటకృష్ణ ఫిర్యాదు చేసినట్టు తుళ్లూరు సీఐ-2 అంజయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ను కలవాలంటే డబ్బులు వసూలు చేస్తున్నారని ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాలలో గ్రూపు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నాడని, అతనిడిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఓఎస్డీ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అసత్య ప్రచారం రాజధానికి చెందిన వ్యక్తే చేస్తున్నాడని ప్రాథమిక అంచనాకు రావటంతో తుళ్లూరు పీఎస్లో పవన్ కల్యాణ్ ఓఎస్డీ ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

ఆ ఐదేళ్లూ బాదుడే

కమీషన్ల కిక్కుతో మద్యం ధరలకు రెక్కలు.. జగన్ హయాంలో రూ.6,300 కోట్లు భారం

- చీప్ నుంచి స్కాచ్ వరకు ధరా భారం
- సీసాపై రూ.20-200 వరకు అదనం
- కమీషన్ల రూపంలో తాడేపల్లికి చేరిక
- ప్రస్తుతం కమీషన్ రాజ్కు గుడ్ బై
- నెలకు 116 కోట్ల భారం తప్పించిన సర్కార్
- దేశంలోనే తొలిసారి కీలక నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మద్యం ధరలకు ముకుతాడు పడింది. సీఎం చంద్రబాబు చర్యలతో దాదాపు 20కి పైగా ప్రీమియం బ్రాండ్ల మద్యం ధరలు దిగివచ్చాయి. దీంతో ఒక్కో బాటిల్పై రూ.20 నుంచి రూ.200 దాకా తగ్గింది. ఫలితంగా నెలకు రూ.116 కోట్ల వరకు మద్యం ప్రియులపై బాదుడు భారం లేకుండా పోయింది. ఎప్పుడూ ధరలు పెంచాలని అడిగే మద్యం కంపెనీలు ఇలా ధరలు తగ్గించుకోవడం వెనుక.. వారు గత జగన్ ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుత సర్కారు పెద్దలకు ఎలాంటి ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేకపోవడమే.



రాష్ట్రంలో మద్యం ధరలు దిగివచ్చాయి. వైసీపీ హయాంలో మద్యం అమ్మకాలంటే విచ్చలవిడి దోపిడీకి కేరాఫ్గా మారగా.. ప్రస్తుత ప్రభుత్వం వాటిని మద్యం ప్రియులకు అందుబాటులోకి తీసుకురావడమేకాకుండా.. 20కిపైగా ప్రీమియం మద్యం బాటిళ్ల ధరలు తగ్గేలా చేసింది. వాస్తవానికి సాధారణంగా నాలుగైదేళ్లకు ఒకసారి మద్యం బ్రాండ్ల కంపెనీలు ధరలు పెంచాలని ప్రభుత్వాలను కోరుతుంటాయి. దీనికి అనుగుణంగా ప్రభుత్వాలు కూడా ధరలు పెంచుతాయి. కానీ, దేశంలో తొలిసారి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక కంపెనీలు దాదాపు 20కిపైగా మద్యం బ్రాండ్ల ధరలు తగ్గించాయి. కంపెనీలు ధరలు తగ్గించడంతో వాటికి అనుగుణంగా ప్రభుత్వం పన్నులు కూడా తగ్గించింది. ఫలితంగా ఆయా బ్రాండ్ల ధరలు దిగివచ్చాయి. ఉదాహరణకు మాన్షన్ హౌస్ క్వార్టర్ సీసా రూ.220 నుంచి రూ.190కి తగ్గగా, రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్పై రూ.20 తగ్గింది. యాంటిక్విటీ బ్లూ ఫుల్ బాటిల్ ధర ఏకంగా రూ.200 తగ్గింది. ఇలా అనేక మద్యం బ్రాండ్ల ధరలు దిగివచ్చాయి. అలాగే జాతీయ స్థాయి కంపెనీలు క్వార్టర్ రూ.99 ధరతో మద్యాన్ని అందుబాటులోకి తెచ్చాయి. ప్రీమియం బ్రాండ్ల ధరలు తగ్గడంతో అమ్మకాలు పెరిగాయి. కానీ, ఇదేసమయంలో సర్కారుకు ఆదాయం తగ్గింది.

జగన్ కమీషన్ల వ్యాపారం

వైసీపీ హయాంలో భారీగా ధరలు పెంచేసి వినియోగదారులను దోపిడీ చేశారు. వాస్తవంగా అమ్మకాలతో సమానంగా రాబడి పెరగాలి. కానీ, జగన్ ప్రభుత్వంలో కమీషన్ల కోసం అవసరం లేకపోయినా ధరలు పెంచడంతో వినియోగదారుల జేబుకు భారీగా చిల్లు పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ధరలు తగ్గిపోవడంతో ఆ వ్యత్యాసం స్పష్టమైంది. ధరలు తగ్గడంతో వినియోగదారులపై నెలకు రూ.116 కోట్ల భారం తగ్గింది. గత ప్రభుత్వంలో దాదాపు నాలుగున్నరేళ్ల పాటు ఈ అదనపు దోపిడీ కొనసాగింది. నెలకు రూ.116 కోట్ల చొప్పున వైసీపీ హయాంలో రూ.6,300 కోట్ల వరకు అదనంగా దోపిడీ చేశారు. జగన్ హయాంలో ఐదేళ్ల కాలంలో రూ.99 వేల కోట్ల విలువైన మద్యం అమ్మితే, దానిలో రూ.6 వేల కోట్లకు పైగా వినియోగదారులు అదనంగా చెల్లించారు. అలా చెల్లించిన దాని నుంచే వైసీపీ పెద్దలకు కమీషన్లు వెళ్లాయి.

పక్కా ప్లాన్తో ధరలు పెంపు

రాష్ట్రంలో మద్య నిషేధం చేస్తామని, దీనిలో భాగంగా షాక్ కొట్టేలా మద్యం రేట్లు పెంచుతామని అధికారంలోకి రాకముందు జగన్ 2018-19 మధ్య అనేక సార్లు ప్రకటించారు. అన్నట్టుగానే మద్యం ధరలు ఆకాశాన్ని తాకేలా పెంచారు. దాని అసలు ఉద్దేశం తాగుడు తగ్గించడమే అయితే మంచిదే. కానీ, అలా ధరలు పెంచగా వచ్చిన అదనపు ఆదాయాన్ని కమీషన్ల రూపంలో పక్కదారి పట్టించారు. పైగా ధరలు పెంచడం అంటే ప్రభుత్వం పన్నులు పెంచితే సరిపోతుంది. ఇలా చేస్తే తద్వారా వచ్చే రాబడి ఖజానాకు చేరుతుంది. కానీ, పన్నులతో పాటు కంపెనీలకు ఇచ్చే ధరలను కూడా వైసీపీ ప్రభుత్వం పెంచింది. ఉదాహరణకు ఒక పాపులర్ బ్రాండ్ ఒక కేసును తెలంగాణలో రూ.1,100కు సరఫరా చేస్తే, అదే కేసును ఏపీలో రూ.1,600కు సరఫరా చేసింది. ఇలా అదనంగా చెల్లించిన మొత్తం కమీషన్ల రూపంలో వైసీపీ శిబిరానికి చేరింది.

'జే' బ్రాండ్లకు చెల్లు

అప్పటికే మార్కెట్లో ఉన్న బ్రాండ్ల నుంచి కమీషన్లు వసూలు చేయడం ఒకెత్తు అయితే కొత్తగా 'జే' బ్రాండ్లను తీసుకొచ్చి నచ్చిన రేట్లకు అమ్ముకోవడం మరొక ఎత్తుగా జగన్ జమానాలో సాగింది. వైసీపీ ప్రభుత్వంలో 68.2శాతం బ్రాండ్లు ఊరుపేరు లేనివే. టాప్ బ్రాండ్లను కేవలం 11 శాతమే అమ్మారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతర్జాతీయ, జాతీయ కంపెనీల బ్రాండ్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. అనామక బ్రాండ్ల అమ్మకాలు 7.2శాతానికి పడిపోయాయి. ప్రభుత్వం పాపులర్ బ్రాండ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో 'జే' బ్రాండ్లు వాటంతట అవే క్రమంగా తగ్గుతూ వచ్చాయి.

తేడా.. చూడు!

- 2024-25 మొదటి మూడు మాసాల్లో 82.76 లక్షల కేసుల లిక్కర్, 28.19 లక్షల కేసుల బీరు అమ్మారు. వీటి విలువ రూ.7,086 కోట్లు.
- 2025-26 మొదటి త్రైమాసికంలో 1.02 కోట్ల కేసుల లిక్కర్, 64.64 లక్షల కేసుల బీరు విక్రయించారు. వీటి విలువ రూ.7,889 కోట్లు.
- 2024-25 మొదటి 3 మాసాల వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే 2025-26 కూటమి ప్రభుత్వ తొలి 3 మాసాల్లో లిక్కర్ 24 శాతం, బీరు 129 శాతం అమ్మకాలు పెరిగాయి.
- విలువపరంగా పెరిగింది 11.33 శాతం. అంటే రూ.800 కోట్లు. ఈ సొమ్ము ఇప్పుడు ఖజానాకు చేరితే.. గతంలో దీనిపై వైసీపీ పెద్దలకు కమీషన్లు చేరాయి.

'అదనం' రికవరీ చేయరా?

గత ప్రభుత్వంలో కమీషన్ల కోసం పెంచుకున్న ధరలు కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరు నెలలకు తగ్గాయి. వైసీపీ ప్రభుత్వంలో కంపెనీలకు అదనంగా చెల్లించిన మొత్తాలను దొడ్డిదారిలో వైసీపీ పెద్దలకు కమీషన్ల రూపంలో సమర్పించుకున్నాయి. కానీ, ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కమీషన్లు మాయమయ్యాయి. అయినా ఆరు నెలల పాటు అదనపు చెల్లింపులు కంపెనీలకు కొనసాగాయి. అలా అదనంగా చెల్లించింది దాదాపు రూ.300 కోట్లు ఉంటుందని అంచనా. దానిని కంపెనీల నుంచి రికవరీ చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి.

> మద్యం స్కాం ద్వారా వచ్చిన సొమ్ము మిథున్రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థకు చేరిందని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది. ఆ సొమ్ము మద్యం కుంభకోణం ద్వారా వచ్చింది కాదని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలనూ మిథున్రెడ్డి ఈ కోర్టు ముందు ఉంచలేదు.
>
> నేర తీవ్రత, లిక్కర్ సిండికేట్ ద్వారా రూ.3,500 కోట్లు చేతులు మారడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ముందస్తు బెయిల్ పొందేందుకు మిథున్ రెడ్డి అనర్హుడు.
> - హైకోర్టు

మిథున్రెడ్డిని కస్టడీలో విచారించాలి!

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు చేశారని ప్రాసిక్యూషన్ వాదిస్తోందని గుర్తు చేసింది. ఆయన సంస్థకు అందిన సొమ్ము మద్యం కుంభకోణానికి సంబంధించింది కాదనేందుకు ఎలాంటి రుజువులనూ ఆయన చూపలేదని తెలిపింది. అందుచేత ముందస్తు బెయిల్ ఇవ్వలేమని స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం తీర్పు వెలువరించారు. 'దర్యాప్తులో భాగంగా సేకరించి, కోర్టు ముందుంచిన ఆధారాలను, పిటిషనర్ మిథున్రెడ్డి (ఏ-4)పై ప్రాసిక్యూషన్ మోపిన తీవ్రమైన ఆరోపణలను విస్మరించడానికి వీల్లేదు. సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తే లిక్కర్ పాలసీ రూపకల్పన నేరపూరిత కుట్రలో మిథున్రెడ్డి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా స్పష్టమవుతోంది. సేకరించిన ఆధారాలను ఆయన ముందు పెట్టి.. మద్యం పాలసీ రూపకల్పన, దాని అమలులో కుట్రకోణాన్ని తేల్చేందుకు కస్టోడియల్ విచారణ అవసరం. మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన సొమ్ము మిథున్రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థకు చేరిందని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది. ఆ సొమ్ము మద్యం కుంభకోణం ద్వారా వచ్చింది కాదని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలనూ మిథున్రెడ్డి ఈ కోర్టు ముందు ఉంచలేదు. ఆయన పాత్రపై ప్రాసిక్యూషన్ ఆధారాలు కోర్టు ముందు ఉంచింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వానికి, పిటిషనర్కు రాజకీయపరమైన విభేదాలు ఉన్నాయనే కారణంతో ముందస్తు బెయిల్ మంజూరు చేయలేం. తీవ్ర ఆరోపణలు ఉన్న ఇలాంటి కేసులో దర్యాప్తు అధికారికి స్వేచ్ఛ అవసరం. ముందస్తు బెయిలిస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. ముందస్తు బెయిల్ను సర్వసాధారణంగా మంజూరు చేయడానికి వీల్లేదు. ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని సంతృప్తి చెందినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవు. నేర తీవ్రత, లిక్కర్ సిండికేట్ ద్వారా రూ.3,500 కోట్లు చేతులు మారడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ముందస్తు బెయిల్ పొందేందుకు మిథున్ రెడ్డి అనర్హుడు. ఈ నేపథ్యంలో ఆయన పిటిషన్ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మిథున్రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్రెడ్డి, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. మిథున్రెడ్డికి బెయిల్ నిరాకరిస్తూ మంగళవారం నిర్ణయం వెల్లడించారు.

సరస్వతి షేర్ల బదిలీపై ఎన్సీఎల్టీ తీర్పు రిజర్వు

- తల్లి, చెల్లిపై ట్రైబ్యునల్కు వెళ్లిన జగన్
- కంపెనీ మొత్తం తనదేనని విజయలక్ష్మి స్పష్టీకరణ
- తనకసలు వాటాయే లేదన్న షర్మిల




హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ కంపెనీ యాజమాన్య హక్కులు, షేర్ల బదిలీకి సంబంధించి మాజీ సీఎం జగన్, ఆయన తల్లి వైఎస్ విజయలక్ష్మి, చెల్లి వైఎస్ షర్మిల మధ్య ఏర్పడిన వివాదంపై తీర్పును హైదరాబాద్లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ) రిజర్వు చేసింది. ఈ కంపెనీలో 51.01 శాతం వాటా తమదేనని.. ఈ వాటాను తమకు తెలియకుండా తల్లి, చెల్లి అక్రమంగా బదిలీ చేసుకున్నారని.. ఈ బదిలీని రద్దు చేసి తమ వాటా తమకు పునరుద్ధరించాలని పేర్కొంటూ జగన్, ఆయన భార్య భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై అన్ని పక్షాల తరఫు వాదనలు మే 7న ముగిశాయి. ఇరువర్గాలు మే 30వ తేదీన లిఖితపూర్వక వాదనలు సైతం సమర్పించారు. వాదనలు విన్న ధర్మాసనంలో ఒక సభ్యుడు సెలవులో ఉండడంతో తీర్పు రిజర్వు చేయకుండా విచారణను ఈ నెల 15(మంగళవారం)కి వాయిదా వేశారు. మంగళవారం వాదనలు విన్న ఇద్దరు సభ్యులు రాజీవ్ భరద్వాజ్, సంజయ్ పురి తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఎవరి వాదనలు ఏమిటంటే..

సరస్వతి పవర్ కంపెనీలో 51.01 శాతం వాటా తమదేనని జగన్, ఆయన భార్య భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీ పేర్కొనగా.. మొత్తం కంపెనీ తన చెప్పుచేతల్లోనే ఉందని.. 99.89 శాతం వాటా తన పేరుపై ఎప్పుడో బదిలీ అయిపోయిందని, కంపెనీ తనదేనని జగన్ తల్లి విజయలక్ష్మి స్పష్టం చేశారు. ఇది తండ్రి సంపాదించిన ఆస్తి కాదని.. చెల్లి షర్మిలపై ప్రేమ, అనురాగంతో సరస్వతి కంపెనీలో తమకు ఉన్న 51 శాతం వాటాను ఈడీ కేసులు ముగిసిన తర్వాత ఇద్దామనుకున్నామని జగన్ తెలిపారు. 'చెల్లి వేరే పార్టీలో చేరి నాపై తీవ్ర విమర్శలు చేసింది. అందుకే ఆమెపై ప్రేమానురాగాలు పోయాయి. ఆమెకు సరస్వతి పవర్లో వాటా ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నాను. ఇది నా స్వార్జితం.. నేనే దాతను కాబట్టి ఏకపక్షంగా ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసే హక్కు నాకు ఉంటుంది. 51 శాతం షేర్ల సర్టిఫికెట్లు నావద్దే ఉన్నాయి. తప్పుడు పత్రాలు సృష్టించి.. తల్లి, చెల్లి మోసం చేసి నా వాటా బదిలీ చేసుకున్నారు' అని జగన్ పేర్కొన్నారు. తన కుమారుడు చెల్లిపై ప్రేమ తగ్గిందని చెబుతున్నాడే తప్ప.. తల్లిగా తనపై ప్రేమ తగ్గిందని చెప్పడంలేదని.. కంపెనీలో 99.89 శాతం వాటా తన వద్దే ఉన్నప్పుడు అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని గత వాదనల సందర్భంగా విజయలక్ష్మి తెలిపారు. 'నిబంధనల ప్రకారమే నా పేరుపై షేర్ల బదిలీ జరిగింది. నా కొడుకు, నేను ఒకే ఇంట్లో ఉంటున్నాం. అలాంటప్పుడు షేర్ సర్టిఫికెట్లు నా వద్ద లేవని ఎలా అంటారు' అని ప్రశ్నించారు. వాటాలు వదులుకున్న తర్వాత కంపెనీకి సంబంధించినంత వరకు జగన్ సంబంధం లేని వ్యక్తి అని.. కంపెనీలో అంతర్గత వ్యవహారాలను ప్రశ్నించడానికి ఆయనెవరని సరస్వతి యాజమాన్యం నిలదీసింది. ఈ వ్యవహారంతో తనకు సంబంధమే లేదని.. తన పేరుపై ఎలాంటి వాటా లేదని.. తనను ప్రతివాదుల జాబితాలో నుంచి తొలగించాలని షర్మిల కోరారు.

మహిళా ఎమ్మెల్యేపై అవేం మాటలు?

(మొదటి పేజీ తరువాయి)



> "మాజీ ఎమ్మెల్యే అయిఉండి అవేం మాటలు? ఒక మహిళా ఎమ్మెల్యేకు ఇచ్చే గౌరవమిదేనా? మీ వ్యాఖ్యలతో న్యూసెన్స్ సృష్టించారు. వాటిని ఉపేక్షించలేం. అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నియంత్రణలో ఉండండి. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండండి."
> - హైకోర్టు సీరియస్

ప్రసన్నకుమార్రెడ్డి తరఫు న్యాయవాది సుబోధ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. పిటిషనర్ పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని న్యాయవాది సుబోధ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని, విచారణను బుధవారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణను బుధవారానికి వాయిదా వేశారు. వైసీపీ నేత ప్రసన్నకుమార్రెడ్డి తనను అసభ్యపదజాలంతో దూషించారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రసన్నకుమార్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



నిందితునిపై దాడికి ప్రయత్నిస్తున్న హతుని బంధువులు

కిరాతకుడు

- కొడుకును చంపి పొలాల్లో పాతి..
- గతంలో తల్లి, చెల్లి, తండ్రి, భార్య కుమార్తె హత్య



మంగ్యా నాయక్ (ఫైల్)

క్రోసూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కన్న పేగునే కడతేర్చి పొలాల్లో పాతి పెట్టాడో కిరాతక తండ్రి. ఇదే ఉన్మాది గతంలో తన కడుపున పుట్టిన మూడేళ్ల పసికందును, చెల్లెల్ని, తండ్రినీ చంపేశాడు. కన్నతల్లినైతే ముక్కముక్కలుగా నరికి అడవిలో తుప్పల్లో పడేశాడు! తాజాగా రెండు వారాల క్రితం మొదటి భార్యకు పుట్టిన కొడుకును చంపి పొలాల్లో పాతిపెట్టాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడగా, విచారణలో నిందితుడి దుశ్చర్యల గురించి మరిన్ని విస్తుపోయే అంశాలు బయటికొచ్చాయి. పోలీసుల కథనం మేరకు... పల్నాడులోని అచ్చంపేట మండలం మాదిపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర నాయక్, కోటేశ్వరి దంపతులకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి మొదటి సంతానం మంగ్యానాయక్. కొన్నేళ్లకు మరొక బాబు జన్మించగా భార్యపై అనుమానంతో మూడు నెలలున్న ఆ పసికందును వెంకటేశ్వర నాయక్ చంపేశాడు. దీంతో కోటేశ్వరి బాయి పుట్టింటికి వెళ్లిపోయింది. తర్వాత మూడేళ్లకు ప్రమీల బాయి అనే ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. తర్వాత వెంకటేశ్వర్ నాయక్ ఉన్మాదిగా మారిపోయాడు. కొంతకాలానికి సొంత చెల్లిని దారుణంగా హత మార్చాడు. తర్వాత 2014లో కన్నతల్లి మార్వాణీ బాయిని ముక్కముక్కలుగా నరికి మాదిపాడు సమీప వెంకటాయపాలెం అడవిలో పడేశాడు. మరి కొద్ది కాలానికి తండ్రి బాలు నాయక్ను కూడా హతమార్చాడు. కొనాళ్ల జైలులో ఉండి బయటికొచ్చాడు. తనకు తెలియకుండా మేకను విక్రయించాడన్న నెపంతో సుమారు రెండు వారాల క్రితం కొడుకు మంగ్యా నాయక్ను చంపేసి, ఎర్రబాలెం సమీప పొలాల్లో పూడ్చి పెట్టాడు. మంగ్యా నాయక్ కన్పించకుండా పోవడంతో ప్రమీల బాయి క్రోసూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. వెంకటేశ్వర్ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా, హత్య విషయాన్ని ఒప్పుకున్నాడు. గతంలో కూడా అతనికి నేర చరిత్ర ఉందని, సీరియల్ కిల్లర్గా మొత్తం నాలుగు హత్య కేసుల్లో నిందితుడి ఉన్నట్టుగా వెల్లడైంది.

మిథున్రెడ్డిపై లుక్ అవుట్ నోటీసు

- విదేశాలకు పారిపోకుండా 'సిట్' అప్రమత్తం
- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేతతో.. వైసీపీ ఎంపీ కదలికలపై నిఘా



అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణంలో నిందితుడైన వైసీపీ ఎంపీ మిథున్రెడ్డిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలుచేసుకున్న పిటిషన్ను హైకోర్టు కొట్టివేసిన కొద్ది గంటల్లోనే సిట్ అప్రమత్తమైంది. ఆయన దేశం విడిచి పారిపోకుండా అడ్డుకునే చర్యలకు ఉపక్రమించింది. ఆయన కదలికలపై నిఘా పెట్టింది. మద్యం పాలసీ రూపొందించడం నుంచి పైసా వసూల్ వరకూ ప్రతి చోటా మిథున్ పాత్రపై ఇప్పటికే ఆధారాలు సేకరించింది. ఈ మొత్తం స్కాంలో రాజ్ కసిరెడ్డి(ఏ-1), మిథున్రెడ్డి (ఏ-4) అత్యంత కీలకమైన వ్యక్తులు. ఈ స్కాంలో అంతిమ లబ్ధిదారు తర్వాతి స్థానం మిథున్రెడ్డిదే. కుంభకోణం వెనుక మాస్టర్ మైండ్ అన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ జిల్లా నుంచి ఎంత.. ఏ మద్యం కంపెనీ నుంచి ఎంత.. వారాంతానికి వసూలైన సొమ్మెంత.. ఆ డబ్బును ఎక్కడ భద్రపరిచాం.. ఎవరికి అందజేశాం.. తదితర వివరాలన్నీ బిగ్ బాస్కు మిథున్ చెప్పేవారని తెలుస్తోంది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపులు సేకరించి హవాలా నెట్వర్క్ నడిపిన రాజ్ కసిరెడ్డికి అడుగడుగునా సహకారం అందించారని సమాచారం. దోపిడీకి వీలుగా కీలక స్థానాల్లో అనుయాయులైన అధికారులను నియమించడంలో.. సరఫరా ఆర్డర్ల జారీ విధానాన్ని ఆటోమేటిక్ నుంచి మాన్యువల్గా మార్చడంలో.. ఒక్కో మద్యం కేసు నుంచి దాని ధర ఆధారంగా ఎంత వసూలు చేయాలో తుది నిర్ణయం మిథున్రెడ్డిదేనని సిట్ గుర్తించింది. ఆయన్ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు కూడా అభిప్రాయపడిన దరిమిలా ఆయన్ను అదుపులోకి తీసుకోవడం ఖాయమని స్పష్టమవుతోంది. ఇప్పటికే రాజ్ కసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్రెడ్డి (ఏ-38), వెంకటేశ్నాయుడు, సజ్జల శ్రీధర్రెడ్డి, చాణక్య, దిలీప్కుమార్ సహా 11 మందిని సిట్ అరెస్టు చేసింది. వీరిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, అప్పటి సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్రెడ్డి, నాటి ఓఎస్డీ కృష్ణమోహన్రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప కూడా ఉన్నారు.

21న కాలేజీలు బంద్

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): డ్యూయల్ మేజర్ డిగ్రీ అమలు చేయాలనే డిమాండ్తో పాటు పలు సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 21న కాలేజీలు మూసివేయాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రకటించింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే.రమణాజీ, జి.రాజ్కుమా343ర్ చౌదరి, ప్రతినిధులు పి.రాజశేఖర్, సి.విజయ్భాస్కర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో హామీ ఇచ్చారని, కానీ ఆ తర్వాత వాటిని పట్టించుకోలేదని తెలిపారు. డిగ్రీపై ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ సిఫారసులను అమలుచేసి డ్యూయల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలన్నారు. ఇప్పటికే డ్యూయల్ మేజర్ విధానానికి నోటిఫికేషన్ విడుదల చేయగా, అందుకు అనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఇప్పుడు మళ్లీ సింగిల్ మేజర్ విధానం తేవాలనే నిర్ణయంతో పరిస్థితి గందరగోళంగా మారిందన్నారు. అలాగే వెంటనే డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూలు ప్రకటించాలని, ఫీజుల బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.